సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★

ఇందిరాపార్క్ స్థలం ఆక్రమణను అడ్డుకుంటాం **04**
సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ
'సర్'కు వ్యతిరేకంగా ఓటు వేయండి : మమతాబెనర్జీ పిలుపు **05**

సంపుటి 28, సంచిక: 282 | సోమవారం | 06-04-2026 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

## న్యాయపరమైన తర్కమే స్థిరత్వానికి పునాది

**తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలోనే అత్యుత్తమంగా నిలుస్తుంది**
**సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్**

- రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-II భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- సమస్యలకు పరిష్కారం చూపే 'న్యాయ దేవాలయం' కొత్త హైకోర్టు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





ప్రజాపక్షం/రంగారెడ్డి

తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలోనే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్II భవన నిర్మాణ పనులకు జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు భవన నమూనా ఫొటో ప్రదర్శనను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించ తలపెట్టిన తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలోనే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందన్నారు. కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా సౌకర్యాలు అన్నీ ఒకే ప్రాంగణంలో సమగ్రంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ఇక్కడ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుంది. మనం సిద్ధాంతం నుండి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుంది'' అని ఆయన అన్నారు. ఈ ఆడిటోరియంలో జిల్లా న్యాయవ్యవస్థ కోసం

తరువాయి 2లో

## సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

**క్యాప్స్ సిబ్బందికి పదోన్నతులు కల్పించాలి**

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో (క్యాప్స్) విధులు నిర్వహిస్తున్న రక్షణ బలగాల పదోన్నతులు, సంక్షేమంపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును తక్షణమే అమలు చేయాలని సిఆర్‌పిఎఫ్ రిటైర్డ్ డిఐజి వి.పురుషోత్తం, సిఐఎస్‌ఎఫ్ రిటైర్డ్ డిఐజి డి.శ్యామల కేంద్రాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఎక్స్ సిఎపిఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషోత్తం, శ్యామల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం స్పందించకపోతే దేశ భద్రతపై కూడా దీని ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు.

**13 ఏళ్ల న్యాయపోరాటం – తుంగలో తొక్కిన కేంద్రం..**
గత 13 ఏళ్లుగా సిఎపిఎఫ్ అధికారులు సమానత్వం, సకాలంలో పదోన్నతుల కోసం పోరాడుతున్నారని నేతలు గుర్తు చేశారు. 2025 మే 23న సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పునిస్తూ 2021లో జరగాల్సిన క్యాడర్ సమీక్షను ఆరు నెలల్లో పూర్తి చేయాలని, డిప్యుటేషన్ పోస్టులను తగ్గించి స్వంత అధికారులకు పదోన్నతి అవకాశాలు కల్పించాలని ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలను అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**వివాదాస్పద 'క్యాప్స్ బిల్లు – 2026'పై ఆగ్రహం..**
సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడానికి బదులుగా, కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాయుధ పోలీసు దళాల (సాధారణ పరిపాలన) బిల్లు, 2026ను ప్రవేశపెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ బిల్లు ద్వారా ఐజి స్థాయిలో

తరువాయి 12లో



## అమెరికా గాలింపు విమానాన్ని కూల్చేసిన ఇరాన్

- 37 రోజుల్లో ఆరు యుద్ధ విమానాలు కోల్పోయిన అమెరికా
- ఒక్క పైలట్ కోసం రంగంలోకి డజన్ల అమెరికా యుద్ధ విమానాలు
- ఇరాన్ పెట్రోకెమికల్ జోన్‌పై దాడి : ఐదుగురు మృతి
- కువైట్‌లో రెండు పవర్‌ప్లాంట్స్‌పై ఇరాన్ డ్రోన్ దాడులు

**వాషింగ్టన్:** రెండు అమెరికా యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చేసిన తర్వాత పైలట్‌కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టిన అమెరికా ఎఫ్–15ఇ గాలింపు విమానాన్ని ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరం లౌహ్ ఇ సియాహ్ ప్రాంతంలో కూల్చివేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆదివారం ప్రకటించింది. కూలిపోయిన ఎఫ్–15ఇ గాలింపు విమానానికి సంబంధించిన శకలాల వీడియోను కూడా ఐఆర్‌జిసి విడుదల చేసింది. అదేవిధంగా ఆదివారం ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మహషహర్ పెట్రోకెమికల్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌పై జరిగిన దాడుల్లో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గడచిన ఇరవైనాలుగు గంటల్లో ఇరాన్ రక్షణ, క్షిపణి తయారీ వ్యవస్థలపై అమెరికా–ఇజ్రాయెల్ 120 సార్లు దాడులు చేశాయి. ఇక దక్షిణ లెబనాన్‌లో యుద్ధం విరామం లేకుండా కొనసాగుతుండగా

తరువాయి 2లో

## దక్షిణ మధ్య రైల్వేలో భద్రతకు పెద్దపీట

**'కవచ్' పరీక్షల్లో రికార్డు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ విస్తరణ**




ప్రజాపక్షం/హైదరాబాద్

రైల్వే భద్రతా ప్రమాణాల పెంపులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే 2025–26 ఆర్థిక సంవత్సరంలో కీలక పురోగతి సాధించింది. స్వదేశీ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్ 4.0' క్షేత్రస్థాయి పరీక్షలను 487 రూట్ కి.మీ.ల మేర విజయవంతంగా పూర్తి చేసి, రైల్వే బోర్డు నిర్దేశించిన 402 కి.మీ.ల లక్ష్యాన్ని అధిగమించింది. ఇదే సమయంలో, రద్దీ గల మార్గాల్లో రైళ్ల రాకపోకలను సురక్షితంగా, వేగవంతంగా నిర్వహించేందుకు 479 రూట్ కి.మీ.ల మేర 'ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్' (ఎబిఎస్) వ్యవస్థను ప్రారంభించింది. గత ఏడాది లక్ష్యం 357 కి.మీ. కాగా,

తరువాయి 2లో



## ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్లు

**అందరూ కాపాడుకోవాలి**
**మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు**

టిఎస్‌పిజెఎ ఆధ్వర్యంలో '23వ ఉత్తమ ఫొటో జర్నలిస్ట్- 2025 అవార్డుల ప్రధానోత్సవం'

ప్రజాపక్షం/హైదరాబాద్

జర్నలిజం ఒక మహావృక్షమైతే అందులో ఫొటో జర్నలిస్టులు ప్రాణం లాంటి వారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్ల లాంటిదని, దీనిని అందరూ కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (టిఎస్‌పిజెఎ) ఆధ్వర్యంలో '23వ ఉత్తమ ఫొటో జర్నలిస్ట్ 2025 అవార్డుల ప్రధానోత్సవ' కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలోని ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి టిఎస్‌పిజెఎ రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎం.వెంకయ్యనాయుడుతో పాటు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐజెయు జాతీయ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, టియుడబ్లుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి

తరువాయి 2లో

## పత్తి కొనుగోళ్లు పడిపోయాయ్

- సిసిఐకి తగ్గిన తాకిడి
- అకాల వర్షాలతోనూ దిగుబడి అంతంతే
- ఈ సీజన్‌లో పత్తి రైతుకు కపాస్ కష్టాలు



ప్రజాపక్షం/హనుమకొండ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్ లో పత్తి కొనుగోళ్లలో భారీగా తగ్గుదల కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా జరిగే పత్తి కొనుగోళ్లు గత ఏడాదితో పోల్చితే గణనీయంగా తగ్గాయి. 2025–26 పత్తి సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిసిఐ మొత్తం 29,48,473 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది. అయితే 2024–25 సీజన్ తో పోల్చితే ఇది 6,99,144 క్వింటాళ్ల మేర తగ్గుదలగా నమోదైంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (ఎంఎస్పీ) రైతులకు అందుబాటులో ఉన్నప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలకు రైతులు రాకపోవటానికి అనేక కారణాలు వెల్లడవు తున్నాయి. ప్రధానంగా ఈ ఏడాది అమలు చేసిన కపాస్ యాప్ లో ముందుగా స్లాట్ బుక్ చేయటం రైతుల కు ఇబ్బందిగా మారిందని తెలుస్తోంది.అలాగే మిల్లుల కేటాయింపుల్లో జాప్యం కూడా కొనుగోళ్లపై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


**సిసిఐకి 29.48 లక్షల క్వింటాళ్ల పత్తి**
సీసీఐ పత్తి కొనుగోళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాస్తంత వెనుకబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత ఏడాది 202425 లో 36,47,617 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సీసీఐ కొను గోలు చేసింది. గత ఏడాది రాష్ట్రంలోనే రికా ర్డు స్థాయిలో పత్తి కొనుగోలు చేసిన సీసీఐ ఈసారి బాగా వెనుకబడింది. 202324 సీజన్ లో 22,11,873 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేయగా, 202425 లో 14,35,744 క్వింటాళ్ల పత్తిని అదనంగా కొనుగోలు చేసింది. అయితే ఈ 202526సీజన్ లో సీసీఐ రైతుల నుంచి 29,48,473 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి 6,99,144 క్వింటాళ్ల మేర తగ్గుదలగా నమోదైంది. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు ఈసారి ఇతర ప్రాంతాల నుంచి తక్కువ మంది రైతులు పత్తి అమ్మకానికి తీసుకు వచ్చారు. వరంగల్ జిల్లాలో గత ఏడాది 15,40,686క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తే, ఈసారి కేవలం 13,60,594క్వింటాల్ పత్తిని కొనుగోలు చేశా రు. ఒక్క వరంగల్ జిల్లాలోనే 1,80,092 క్వింటాల్ పత్తి కొనుగోళ్లు తగ్గాయి. అలాగే జన గామ జిల్లాలో గతేడాది 8,74,612 క్విటాళ్లు కొనుగోలు చేస్తే, ఈ సీజన్‌లో 6,86,759 క్వింటాల్ పత్తిని మాత్రమే కొనుగోలు చేశా రు. జనగామ జిల్లాలో 1,87,853 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

తరువాయి 2లో

## చేర్యాల రెవెన్యూ డివిజన్ గళం ప్రభుత్వాన్ని కదిలిస్తుందా?

- కల నెరవేరుతుందా?
- ఉద్యమంతో వేడెక్కిన డివిజన్ పోరాటం
- ఎదురుచూపులకు ముగింపు కావాలన్నదే ప్రజల ఆకాంక్ష
- చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/మద్దూరు





(ఫైల్ ఫొటోలు)

ఇది పోరాటం. ప్రజల ఆకాంక్ష... ఉద్యమ నేపథ్యం గల ప్రాంతం నుండి సాగిస్తున్న ప్రజా ఉద్యమం. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం తొలి మలి దశగా సాగుతున్న పోరాటాలకు, ఏళ్లతరబడి ఎదురుచూపులకు ముగింపు కావాలన్న ప్రజల ఆకాంక్షిస్తున్నారు. గత రెండున్నర సంవంత్సరాల క్రితం (2023 నవంబర్ 30న) జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రాంతానికి వచ్చిన ప్రస్థుత బిఆర్‌ఎస్ పార్టీ అధినేత తెలంగాణ ఉద్యమకారుడు తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నుండి ప్రస్తుత ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇద్దరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై

తరువాయి 12లో

## బెట్టింగ్ మాయలో యువత!

- భవిష్యత్తు ప్రశ్నార్థకం
- యాప్స్ బారినపడి ఆత్మహత్యలు
- చిన్నాభిన్నమవుతున్న మధ్య తరగతి కుటుంబాలు
- ఐపిఎల్ ప్రారంభంతో మరింత జోరు

ప్రజాపక్షం/జూలూరుపాడు



బెట్టింగ్‌తో కొందరి జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. గెలిచిన వారు అత్యాశతో మళ్లీ డబ్బులు పెడుతూ పోగొట్టుకుంటున్నారు. ఓడిన వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత ఈ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్స్ భారిన పడి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆన్లైన్లో గేమ్ నుంచి మొద లైన వ్యసనం తర్వాత బెట్టింగ్స్‌కు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితం కాగా ఇప్పుడు పల్లెలకు సైతం పాకింది. ప్రస్తుతం ఐపిఎల్ షురూ కావడంతో క్రేజ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యసనంగా

తరువాయి 12లో

## భూగర్భ జల వినియోగంలో భారత్ వాటా 25 శాతం



**న్యూఢిల్లీ:** భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా భూగర్భ జల వినియోగంలో సుమారు 25 శాతం వాటాను కలిగి ఉందని పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ తన నివేదికలో వెల్లడించింది. ఈ అధిక వినియోగం దీర్ఘకాలిక ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరమని హెచ్చరించిన కమిటీ, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు తప్పిన నీటి వినియోగాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖను కోరింది. ఈ వివరాలు 'గ్రౌండ్ వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ రెగ్యులేషన్' కమిటీ 41వ నివేదికలో వెల్లడయ్యాయి. ఈ నివేదికను కమిటీ చైర్మన్ కెసి వేణుగోపాల్ లోక్‌సభలో సమర్పించగా, అదే రోజు రాజ్యసభలో కూడా ప్రవేశపెట్టారు. నివేదిక ప్రకారం, భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ జల వినియోగ దేశంగా నిలిచింది. దేశంలో సంవత్సరానికి సుమారు 245 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బిసిఎం) నీరు భూగర్భ వనరుల నుంచి తీసుకుంటున్నారు. ఇది ప్రపంచ మొత్తం వినియోగంలో నాలుగోవంతుకు సమానం. దేశంలో తాగునీటి అవసరాల్లో దాదాపు 80 శాతం, సాగునీటి అవసరాల్లో సుమారు 64 శాతం ఈ భూగర్భ జలాల ద్వారానే తీరుతున్నాయి. అయితే ఈ అధిక వినియోగం కారణంగా

తరువాయి 12లో



# యుద్ధం కాదు...శాంతిని ఎంచుకో

## ట్రంప్‌కు పోప్ ఈస్టర్ డే పిలుపు

**వాటికన్‌సిటీ :** యుద్ధాన్ని ఎంచుకోవడానికి అధికారం,శక్తిసామర్థ్యాలు ఉన్న వారు విధ్వంసం బదులుగా శాంతి సాధన మార్గం ఎంచుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పోప్ లియో–14 పేరు ప్రస్తావించకుండా పరోక్ష పిలుపు ఇచ్చారు. క్రీస్తు పునరుత్థానం ఈస్టర్ సందర్భంగా పోప్ సందేశం వినేందుకు వేలాదిమంది భక్తులు ఆదివారం సెయింట్ పీటర్ స్క్వేర్‌కు తరలివచ్చారు. వాటికన్ బాసిలికా సెంట్రల్ బాల్కనీలో తెల్లగులాబీపూల అలంకరణల మధ్య నిలబడిన పోప్ ఈస్టర్ సందేశం ఇస్తూ, మనం హింసకు బాగా అలవాటు పడిపోతున్నాం, ఇప్పుడు మనం దాన్నుండి బయటపడాలి, హింసను సహించకూడదు, మనం నిష్పక్షపాతంగా ఉందాం, వేలాదిమంది ప్రజల మరణాలు జరిగితే పక్షపాతం వదలి నిష్పక్షపాతంగా వ్యతిరేకిద్దాం'' అన్నారు. యుద్ధం చేయాలనే ప్రతి కోరికనూ వదిలిపెట్టాలని పిలుపు ఇచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధ నివారణకు ప్రార్థనకు పిలుపు ఇచ్చారు. పోప్ బాధ్యతలు తీసుకున్న మొదటి అమెరికన్ జాతీయుడైన లియో పశ్చిమాసియా యుద్ధ వ్యతిరేకిగా ముద్ర వేసుకున్నారు. ''సంఘర్షణ, ఆధిపత్యం,అధికారంకోసం మనకుండే కోరికను ఈ పర్వదినం రోజున మనం విడిచిపెడదాం, యుద్ధాలతో నాశనమైన ప్రపంచానికి శాంతిని ప్రసాదించమని ఆ ప్రభువును వేడుకుందాం'' అని పిలుపు ఇచ్చారు. ఇటీవల బహిరంగ ప్రసంగాలలో ఆయన యుద్ధ విరమణ, ప్రపంచశాంతి గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారు.

# గల్ఫ్‌లో యుద్ధం అంతానికి ప్రార్థనలు

## కేంటర్‌బరీ ఆర్చిబిషప్ ఈస్టర్ పిలుపు



**లండన్ :** పశ్చిమాసియాలో యుద్ధం అంతం కావాలని కాంటర్‌బరీ తొలి మహిళా ఆర్చిబిషప్ డామే సారి ముల్లాలీ పిలుపు ఇచ్చారు. కాంటర్‌బరీ కెథెడ్రల్‌లో ఈస్టర్ సందర్భంగా ఆదివారం ఉదయం జరిగన ప్రార్థనల సందర్భంగా భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. ఇరాన్‌లో యుద్ధం ఆరవ వారంలోకి ప్రవేశించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ మానవాళిని హింస వేధిస్తోందని అన్నారు. నెలరోజుల క్రితం ముల్లాలీ మొదటి మహిళా ఆర్చి బిషప్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి ఈస్టర్ ప్రసంగం చేశారు. పశ్చిమాసియా,గల్ఫ్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న స్వేచ్ఛ,శాంతి వారికి లభించాలని ఆకాంక్షించారు. ఈరోజు క్రీస్తు పునరుత్థానం చెందాడని మనం ఎంతో ఆనందంతో ఉన్నాం, కానీ పశ్చిమాసియాలో శాంతి లేదు, ఆ శాంతిని కోరుకుందాం,దానిని సాధిద్దాం,యుద్ధం అంతం కావాలని ప్రార్థిద్దాం అన్నారు.

# క్రేజీ బాస్టర్డ్స్...ట్రంప్ బూతుపురాణం

### రేపు వంతెనలు, విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తాం

### మీ యాక్షన్‌కి మా రియాక్షన్ రెడీ : ఇరాన్ ప్రతి హెచ్చరిక





**వాషింగ్టన్ :** ట్రంప్ విధించిన గడువు సోమవారంతో పూర్తి అవుతుంది. ఇంకా 48 గంటలు గడువు మాత్రమే ఉందని, హోర్ముజ్ తెరవక పోతే నరకం చూస్తారని ట్రంప్ శనివారం హెచ్చరించిన తర్వాత ''ఇక తర్వాత ఏం జరుగుతుందో?...'' అని యావత్ ప్రపంచ దేశాలు ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న తరుణంలో తాజాగా డోనాల్డ్ ట్రంప్ ''క్రేజీ బాస్టర్డ్స్....! హోర్ముజ్ జలసంధిని తెరవండి'' అంటూ తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా బూతు పురాణం ప్రారంభించారు. మంగళవారం ఇరాన్ వంతెనలు, విద్యుత్ కేంద్రాలు, గ్యాస్ నిక్షేపాలు, మౌలిక సదుపాయాల వ్యవస్థలు అన్నిటిపైనా దాడులు చేస్తాం, హోర్ముజ్‌ను తెరవండి అని ట్రంప్ హెచ్చరించారు. ''మంగళ వారం ఇరాన్‌లో వంతెనల దినోత్సవం... విద్యుత్ కేంద్రాల దినోత్సవం...ఈ రెండూ ఒకే రోజున జరగనున్నాయి. ఇంతకంటే సాటి అయిన రోజు మరొకటి లేదు. ఈ జలసంధిని తెరవండిరా... పిచ్చివెధవల్లారా...! లేకపోతే మీరు నరకానికిపోయి అక్కడే బ్రతుకుతారు, చూస్తూ ఉండండి, అల్లాకే సర్వస్తోత్రాలూ...'' అని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. ఇరాన్‌కు అమెరికా ఇచ్చిన పది రోజుల తాజా గడువు ఏప్రిల్ ఆరో తేదీతో ముగిసిపోతుంది. ఈ గడువు ఇంకా కేవలం ఇరవైనాలుగు గంటలు మాత్రమే ఉంది. మీకు ఇచ్చిన గడువు గుర్తుందా? ఆ తర్వాత ప్రళయం విరుచుకుపడుతుంది, తర్వాత అంతా దేవుడి దయ... ఇదిలా ఉండగా ట్రంప్ మరోసారి హెచ్చరిక చేసిన తర్వాత కూడా ఇరాన్ తాను నమ్మిన సత్యానికే కట్టుబడి అమెరికాకు భయపడకుండా ధైర్యంగా నిలబడి ట్రంప్ హెచ్చరికలను తిరస్కరించింది. తాము పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రతి హెచ్చరిక చేశారు. చాలా తీవ్ర పరిణామాలు అమెరికాకు ఎదురవుతాయనిహెచ్చరించారు.

పశ్చిమాసియా వ్యాప్తంగా ఉన్న అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలను ధ్వంసం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. అమెరికాను ఊరికే ఒదిలిపెట్టేదిలేదని అన్నారు. కరాజ్ వంతెనను ధ్వంసం చేస్తే ఇరాన్ లొంగిపోతుందని అనుకోవడం ఒట్టి భ్రమ అన్నారు. ''మీ యాక్షన్‌కు మా రియాక్షన్ రెడీగా ఉంటుంది'' అని ప్రకటించారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కూడా ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌లో భారీస్థాయిలో దాడులు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అమెరికా అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

**బుషెహెచ్ అణుప్లాంటు వద్ద రేడియేషన్!**

**ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఫిర్యాదు**

ఇరాన్‌లోని బుషెహెర్ అణుకేంద్రంపై అమెరికా–ఇజ్రాయెల్ ఇప్పటికి నాలుగుసార్లు దాడులు చేశాయి. ఈ దాడులవల్ల తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ప్రభుత్వం ఆదివారం ఫిర్యాదు చేసింది. దీనివల్ల రేడియేషన్ బయటకు ప్రవహించి పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని ఈ దుందుడుకు చర్యలను అరికట్టాలని ఐక్యరాజ్యసమితిని కోరింది. శనివారం అమెరికా చేసిన దాడుల్లో బుషెహెర్ సమీపంలో ప్రొజెక్టైల్స్ పడ్డాయి. ఈ దాడుల్లో ఒకరు మరణించారు. ఈ పరిణామాలపై ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణు నియంత్రణ సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

అణుకేంద్రంలోని సిబ్బంది మరణించడం ఒక ప్రమాదకరమైన పరిణామమని ఐఎఇఎ పేర్కొంది. ఈ దాడులవల్ల రేడియేషన్ లెవెల్స్ పెరుగుతాయని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ ఆరాఘ్చి రాసిన లేఖలో తెలియజేశారు. ఈ లేఖను ఆయన టెలిగ్రామ్ వేదికగా అందరికీ షేర్ చేశారు.



# నాసా చంద్రయాన్‌లో వ్యోమగాములకు టాయిలెట్ సమస్య

**కెన్నడీ స్పేస్ సెంటర్ :** నాసా ఆర్టెమిస్–2 ప్రయోగించిన 'ఓరియన్ క్యాప్స్యూల్' ఐదో రోజు సోమవారం నాటికి చంద్రుడికి చేరువగా వెళుతుంది. ఇక అక్కడి నుండి మొట్టమొదటిసారి భూమ్మీద మనిషి చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తాడు. పది రోజులపాటు నిర్దేశించిన ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడిపై అడుగుపెట్టకుండా, కేవలం అతి సమీప పరిభ్రమణం ద్వారా, ఇప్పటివరకూ ఎన్నడూ చూడని కొత్త అద్భుతాలను అధ్యయనం చేస్తారు. దీంతో 53 సంవత్సరాల తర్వాత మళ్ళీ మొదటిసారి మనిషి చంద్రుణ్ణి సమీపించాడు. ఇదిలా ఉండగా, లో వ్యోమగాములు ఉండే క్యాప్స్యూల్‌లో టాయిలెట్ సరిగ్గా పనిచేయడంలేదు. దీనివల్ల వ్యోమగాములు ఇబ్బందులు పడుతున్నారు. మూత్ర సేకరణకు ప్రత్యామ్నాయ సంచులపై ఆధారపడాల్సివస్తోంది. పైపులైనులో మంచు పేరుకుపోయి ఉంటుందని, అందుకే ఫ్లష్ సరిగ్గా పనియేడంలేదని ఇంజనీర్లు అంచనావేసినట్లు మిషన్ కంట్రోల్ సెంటర్ ప్రకటించింది. క్యాప్స్యూల్‌లో టాయిలెట్ సరిగ్గా తెరచుకోవడంలేదు. అది స్థిరత్వాన్ని కోల్పోయింది. టాయిలెట్ పూర్తిగా తెరచుకోవడలేదని, ఈ పరిస్థితిని దాటుకుని బాధ్యతలు పూర్తిచేయగల శక్తిసామర్థ్యాలు వ్యోమగాములకు ఉన్నాయని భూతల కేంద్ర నిపుణుడు హీనా మరోవైపు మొదటిసారి చంద్రగ్రహంతో తమ సామీప్య అనుభవాలను వ్యోమగాములు నాసా భూతలకేంద్రంతో పంచుకుంటున్నారు. తామెంతో ఉగ్విగ్నతతతో, సంతోషంతో ఉన్నట్లు చెప్పారు. వారికి భూమి చిన్న గోళంగా కనిపిస్తుండగా చంద్రుడు అతి భారీ పరిమాణంలో కనిపించడం ప్రారంభించాడు. చంద్ర ఉపగ్రహం భూమికి 3,84,400 కి.మీ దూరంలో ఉంది. నలుగురు వ్యోమగాముల బృందంలో ఒక మహిళ, ఒక నల్లజాతీయుడు, ఒక అమెరికాయేతరుడు కూడా ఉన్నారు. అత్యంత అనుభవజ్ఞురాలైన మహిళా వ్యోమగామి క్రిస్టినా, అమెరికాయేతర వ్యోమగామి జెరెమీ హాన్సన్ (మిషన్ స్పెషలిస్టు), రీడ్ వైస్‌మాన్ (మిషన్ కమాండర్),మొట్టమొదటి నల్లజాతీయుడైన వ్యోమగామి విక్టర్ జె గ్రోవర్ ఈ యాత్రలో పాల్గొంటున్నారు.

# పశ్చిమాసియా ఉపగ్రహ చిత్రాలపై నిషేధం

## అమెరికా సైన్యం కదలికలపై చైనా నిఘా

**వాషింగ్టన్ :** పశ్చిమాసియా యుద్ధ ప్రాంతాలలో ఉపగ్రహ చిత్రాలను షేర్ చేయకుండా అమెరికా ఆంక్షలు విధించింది. అమెరికాకు చెందిన ప్లానెట్స్ ల్యాబ్స్ అనే సంస్థ అంతరిక్షంలో ఉపగ్రహాల నుండి చిత్రాలను తీస్తుంది.

పశ్చిమాసియాకు సంబంధించి ఈ సంస్థ తీసే చిత్రాలను షేర్ చేయకుండా నిలిపివేయాలన్న ఆదేశాల మేరకు వీటిని షేర్ చేయడం లేదు. పశ్చిమాసియాకు చెందిన యుద్ధ దృశ్యాలను విడుదల చేయడం ఆపేయాలని ట్రంప్ ప్రభుత్వం ఆదేశించింది. ఇదిలా ఉండగా, అమెరికా సైన్యం కదలికలపై చైనా నిఘా వేసింది. చైనాకు చెందిన అనేక కంపెనీలు కృత్రిమ మేధస్సు ద్వారా అమెరికా సైన్యం, దాని సైనిక వనరులకు సంబంధించిన సమాచారాన్ని లొకేషన్స్‌ను సేకరిస్తున్నాయి. ఈ సమాచారం నేరుగా ఈ కంపెనీల నుండి చైనా సైనిక వ్యవస్థకు, రక్షణ విభాగానికి చేరుతుంది. ఈ విధంగా పశ్చిమాసియాలో ఎంతమేరకు అమెరికా సైనికులను సమీకరించారు? వారు ఏ ఏ ప్రదేశాలలో ఉన్నారు? ఎంత ఆయుధ సంపత్తి వారివద్ద ఉంది? వంటి అనేక వివరాలు ఈ సమాచారంలో నిక్షిప్తమై ఉంటాయి. ఈ సమాచారం నేరుగా చైనా నుండి ఇరాన్‌కు వెళుతోందన్నది అమెరికా చేస్తున్న వాదన. యుద్ధంలో ఇరాన్‌కు రష్యా, చైనా పరోక్షంగా సహాయ సహకారాలు అందజేస్తున్నాయని ఇటీవల ఇజ్రాయెల్ పత్రికలు ఆరోపించాయి.

# దక్షిణ లెబనాన్‌ను మరో గాజా చేయవద్దు

## చర్చలకు ప్రతిపాదించిన అధ్యక్షుడు



**బీరూట్ :** దక్షిణ లెబనాన్ ప్రాంతాన్ని మరో గాజాగా మార్చేందుకు ఇరాన్ ప్రయత్నం చేస్తోందని లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఔన్ ఆదివారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో ఇప్పటివరకూ 72,000 మందిపైగా మరణించారని, ఇప్పుడు దక్షిణ లెబనాన్‌లో కూడా మృతుల సంఖ్య వేల సంఖ్యకు చేరుతోందని, దాదాపు 10 లక్షలమందిపైగా ప్రజలు గ్రామాలు, పట్టణాలు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారని, వారంతా తిరిగి ఇళ్ళకు చేరుకునే పరిస్థితి లేకుండా ఇజ్రాయెల్ ప్రకటనలు గుప్పిస్తోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో దక్షిణ లెబనాన్‌ను కాపాడుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమస్యపై లెబనాన్‌లో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రతిపాదన చేశారు. దక్షిణ లెబనాన్‌ను మరో గాజాగా మార్చవద్దని ఆయనను వేడుకున్నారు. ఆదివారం తాజాగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఏడుగురు మరణించారు. మృతుల్లో ఏడాది పసిపాప కూడా ఉంది.

# స్థిరత్వానికి పునాది

(మొదటి పేజీ తరువాయి)

న్యాయ సదస్సు శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ''నేర్చుకోవడం మానేసిన న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆపేస్తుంది. నేను దేశవ్యాప్తంగా దీనిని చూశాను, ఈ సంప్రదాయాన్ని బలంగా, దృఢంగా సమర్థిస్తున్నాను'' అని ఆయన అన్నారు. మూడు అంతస్తులలో రూపొందించిన సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. ''సంస్థాగత స్మృతి అనేది ఒక విలాసం కాదు. అది న్యాయపరమైన తార్కికతలో స్థిరత్వానికి పునాది. చక్కగా భద్రపరచబడిన, అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పును బలోపేతం చేస్తాయి. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వడం చూసి నేను సంతోషిస్తున్నాను,'' అని చెప్పారు. ''ఆ చిత్తశుద్ధి, గంభీరత ప్రణాళికలోని మరో అంశంలో కూడా కనిపిస్తున్నాయి. సుస్థిరమైన మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారు. తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం,అది ఉన్న భూమిని గౌరవించాలి,'' అని సి జె ఐ పేర్కొన్నారు. కొత్త భవనం కోసం 100 ఎకరాలు కేటాయించడమే కాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లకు పైగా మంజూరు చేసినందుకు ఆయన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే 100 ఏళ్ల పాటు సేవలందించేలా రూపొందించబడిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేళ్లలో పూర్తవుతుంది. 2024లో శంకుస్థాపన జరిగిన జోన్I పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, జోన్II ఒక న్యాయస్థానం అంత ముఖ్యమైనదిగా ఉంటుందని ఆయన అభివర్ణించారు.

**సమస్యలకు పరిష్కారం చూపే 'న్యాయ దేవాలయం'**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై న్యాయ స్ఫూర్తి విరాజిల్లాలని, అన్ని వర్గాల ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే 'న్యాయ దేవాలయం'గా కొత్త హైకోర్టు నిలుస్తుందని అన్నారు. సామాన్య పౌరుడికి కోర్టు చివరి ఆశ్రయమని, అలాంటి పవిత్ర ప్రాంగణాన్ని నిర్మించే అవకాశం తమ ప్రభుత్వానికి దక్కడం చరిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు. రాబోయే వంద ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య పరస్పర గౌరవమే లక్ష్యంగా ఈ భారీ నిర్మాణాన్ని చేపట్టినట్లు ప్రకటించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తీసుకున్న కీలక నిర్ణయాల్లో భాగంగా 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే జోన్I పనులు శరవేగంగా సాగుతున్నాయని, నేడు శంకుస్థాపన చేసిన జోన్II నివాస సముదాయాలను కూడా డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దేశంలోనే అత్యంత ఆధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సముదాయం తోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 49కోర్టుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పులకే కాకుండా వారి అమూల్యమైన అభిప్రాయాలకు కూడా తమ ప్రభుత్వం అత్యున్నత విలువ ఇస్తుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

హైదరాబాద్ నగర కీర్తి కిరీటంలో మరో మణిహారంగా నిలిచే ఈ అద్భుత కట్టడం, భవిష్యత్ తరాలకు న్యాయ విజ్ఞాన కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజలందరికీ త్వరితగతిన న్యాయం అందించే స్ఫూర్తిని బలోపేతం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ సెక్రెటరీ వికాస్ రాజ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ జి కర్ణన్, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి,ఆర్డీవో రాజేంద్రనగర్ వెంకట్ రెడ్డి, తహసిల్దార్ రాములు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి కళ్లు

(మొదటి పేజీ తరువాయి)

రాం నారాయణ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు ఫోటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫోటో జర్నలిస్టుల ప్రథమ బహుమతిని ఇందు శ్రీనివాస్(ఈనాడు, నిజామాబాద్), రెండవ బహుమతి ఎ.క్రిష్ణ (హాన్స్ ఇండియా, హైదరాబాద్), తృతీయ బహుమతి జి.బాలస్వామి (సాక్షి,హైదరాబాద్)లకు అందజేశారు. అలాగే కాన్సొలేషన్ బహుమతులను ఎన్.రాజేష్ (సాక్షి,హైదరాబాద్), జి.శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), ఎ.జాన్(సాక్షి,హైదరాబాద్), ఆర్.రాజు (సాక్షి,ఖమ్మం), పి.వాసప్రసాద్(సాక్షి,వరంగల్), ఎం.శ్రీనివాస్(ది హన్స్ ఇండియా,నల్లగొండ), జి.వేణుగోపాల్(సాక్షి,జనగాం),ఎం.అనిల్ కుమార్ (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), వీరగోని రజనీకాంత్ గౌడ్ (నమస్తే తెలంగాణ,హైదరాబాద్), ఎ.జ్వాల కోటేశ్వర్ రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్) లకు అందజేశారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రిపోర్టర్ కలం పెడితే, ఫొటో జర్నలిస్టు కళను బందిస్తారన్నారు. తాను 1964లో ఎబివిపి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి ఫొటో జర్నలిస్టులతో అనుబంధం ఉందన్నారు. ప్రపంచంలో బాషాలు ఎన్నైనా ఉండోచ్చు కానీ, ఏ బాషతో సంబంధం లేకుండా ఉండేది కేవలం ఫోటోగ్రఫీ మాత్రమేనని గుర్తు చేశారు. వంద మాటల పెట్టు ఒక ఫోటో రూపం అని అభివర్ణించారు. ఒక వ్యాసం చెప్పలేని భావాన్ని ఒక ఫోటో చెబుతుందన్నారు.

కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంతో పొల్చితే ప్రస్తుత జర్నలిజంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుత 'ఎఐ టెక్నాలజీ' అన్ని రంగాలకు చాలా ఉపయోగకరంగా మారిందని, ముఖ్యంగా వైద్య రంగంలో చాలా మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. ఫొటో జర్నలిస్టులు కూడా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, ప్రస్తుత ఎఐ రంగంలో ఎలా ముందుకెళ్లాలో చర్చించుకుందామని సూచించారు. పొన్నాల లక్ష్మ య్య మాట్లాడుతూ అక్షర సత్యానికి ఊపిరి పోసే సాధనమే ఫొటో జర్నలిజం అని అన్నారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ నేరుగా తీసిన ఫోటోలోని సహజతత్వం, కృత్రిమంగా చిత్రీకరించిన చిత్రాలకు ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిజెఎ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.నరహరి, ఉపాధ్యక్షులు పి.రామ్ మూర్తి, కోశాధికారి కె.అనిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. వసంత్ కుమార్, ఏం. ఎ. సర్వర్, పి. మోహన చారి, అలీముద్దీన్, పి. హరి కృష్ణ, ఎ. మహేష్ కుమార్, నేతలు బషీరుద్దీన్, టి. వి. రమణ, రాజ్ కుమార్, పి. వెంకటేష్, గోపి, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కూల్చేసిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)



ఆదివారం ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఒక పసిబిడ్డ సహా ఏడుగురు మరణించారు.వీటన్నింటికీ భిన్నంగా ఒమన్ దేశ ప్రభుత్వం హోర్ముజ్ నుండి ప్రశాంతంగా తన నౌకలను దాటించేందుకు ఇరాన్‌తో శాంతియుత సంభాషణలు చేస్తున్నట్లు ప్రకటించింది. కువైట్‌లోని రెండు పవర్ ప్లాంట్స్‌పై ఇరాన్ డ్రోన్లు దాడులు చేసి ధ్వంసం సృష్టించాయి. డీశాలినేషన్ సెంటర్‌ను ధ్వంసం చేశాయి. కువైట్,బహ్రైన్‌లలోని కీలకఇంధన మౌలిక సదుపాయాలు ఇరాన్ డ్రోన్ల దాడులతో దద్దరిల్లాయి. పెద్ద ఎత్తున మంటలు పైకి ఎగసిపడ్డాయి.

ఏప్రిల్ మూడో తేదీన రెండు యుద్ధ విమానాలను కోల్పోయి యుద్ధంలో పరువు పోగొట్టుకున్న అమెరికా తాజాగా గాలింపు విమానాన్ని కూడా కోల్పోయింది. ఎఫ్–15 కూలిపోవడంతో జాడ తెలియని పైలట్ గురించి అమెరికా–ఇరాన్‌ల నుండి మొదట పరస్పర భిన్నమైన ప్రకటనలు వెలువడినప్పటికీ ఆ తర్వాత కథ అమెరికాకు అనుకూలంగా సుఖాంతమైంది. జాడ తెలియకుండా పోయిన తమ పైలట్‌ను భారీ యుద్ధం తర్వాత కాపాడుకున్నట్లు 'అల్ జజీరా' వార్తాసంస్థకు అమెరికా అధికారి ఒకరు తెలియజేశారు.ఈ సహాయ కార్యక్రమాలు ఇంకా పురోగతిలో ఉన్నాయని కూడా ఆదివారం మధ్యాహ్నం ఆయన ప్రకటించారు. ఇరాన్ భూభాగం నుండి పైలట్‌ను కాపాడుకోవడం కోసం అమెరికా చాలా హై రిస్కు ఆపరేషన్ నిర్వహించింది. భీకర యుద్ధం చేసింది. ఇప్పటివరకూ 37 రోజులుగా పశ్చిమాసియాలో జరిగిన యుద్ధంలో, ఆరు యుద్ధ విమానాలను అమెరికా కోల్పోయింది. అదేవిధంగా రెండు యుద్ధ విమానాలను ఏక కాలంలో ఒక ప్రాంతీయస్థాయి యుద్ధంలో అమెరికా కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి కావడం విశేషం.

కూలిపోయిన రెండు యుద్ధ విమానాలలో ఇద్దరు అమెరికా పైలట్ల జాడ తెలియలేదు. ఈ ఇద్దరిలో ఒక పైలట్ కువైట్ సమీపంలో కుప్పకూలిన విమానం నుండి సురక్షితంగా, ఆరోగ్యంగా బయటపడగా, మరోపైలట్‌ను ఇరాన్ భూభాగం నుండి తమ సహాయ విమానాలు భారీ పోరాటం తర్వాత స్వల్ప గాయాలతో రక్షించాయని ట్రంప్ ప్రకటించారు. రెండు యుద్ధ విమానాలకు చెందిన ఇద్దరు పైలట్లలో ఇరాన్ భూభాగంలో జాడతెలియకుండాపోయిన పైలట్ కోసం ఎంతో భీకర యుద్ధంతోపాటు, సాహసోపేతమైన విన్యాసాల ద్వారా కాపాడుకున్నట్లు చెప్పారు. ఒక్క పైలట్‌ను రక్షించడంకోసం అనేక డజన్ల అమెరికా యుద్ధ విమానాలు రంగంలోకి దిగి హైరిస్క్ ఆపరేషన్ నిర్వహించాయని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. ఎంతో ధైర్యవంతుడైన తమ ఎఫ్–15 అధికారి ఇరాన్‌లోని లోతైన పర్వతాలలో గాయపడి ఉన్నారని, ఆయనను రక్షించామని, ఆయన అత్యంత గౌరవనీయుడైన కల్నల్ అనీ, తమ దళాలు ఆయనను సమీపించాయని పేర్కొన్నారు. తమ దళాల పోరాట పటిమకు ఇదొక చిహ్నమన్నారు. ఇరాన్ కూడా స్పందిస్తూ, తాము ఉపయోగించకుండా వదిలేసిన విమానాశ్రయాన్ని తమ సిబ్బందిని కాపాడుకోవడంకోసం అమెరికా ఉపయోగించుకుంటోందని విమర్శించింది. అంతకు ముందు ఇరాన్ ఒక సంచలనాత్మకమైన ప్రకటన చేస్తూ, ఇరాన్‌లో కుప్పకూలిపోయిన అమెరికా యుద్ధ విమానానికి చెందిన పైలట్‌ను వారి సైనిక బలగాలు కాపాడలేకపోయాయని, ఇక సాధ్యం కాదని తెలిశాక ఆ పైలట్ శత్రు దళాలకు దొరక్కుండా ఉండటంకోసం అతడిని చంపేందుకు ఆ పరిసర ప్రాంతాలలో దాడులు చేస్తున్నాయని ఇరాన్ సైనికవర్గం 'తస్నిమ్ న్యూస్ ఏజన్సీ'కి తెలియజేసింది. కోహ్‌గిల్యుయేహ్, బోయెర్–అహ్మద్ రాష్ట్రాలలో గాలిస్తూ దాడులు చేస్తున్నాయని ప్రకటించింది.అదేవిధంగా ఇరాన్ భూభాగంలో పైలట్‌ను విడిపించేందుకు పంపిన రెండు రవాణా విమానాలు చెడిపోయాయి. వాటిని తరలించడం సాధ్యం కాకపోవడంతో కూలిపోయిన తమ సొంత విమానాలను అమెరికా సైన్యం తునాతునకలుగా ధ్వంసం చేసుకుందని వార్తలు వెలువడ్డాయి.

ఇరాన్‌లోని పెద్దనగరం ఇస్ఫహాన్ వద్ద అమెరికా పైలట్ జాడ తెలియకుండా పోవడంతో ఇక అతడిని రక్షించడం అమెరికా దళాలకు చాలా కష్టసాధ్యమైన పని అని అంతర్జాతీయస్థాయిలో కథనాలు వెలువడ్డాయి. యుద్ధంలో ఒక పైలట్ గాయపడి శత్రు ప్రాంతంలో నిస్సహాయుడిగా ఉండిపోతే అతడిని అలాగే వదలకుండా కాపాడుకోవడానికి ఎంతకైనా సాహసించాలనే సూత్రం ఒకటైతే, ఆ శత్రసైనికుణ్ణి చేజిక్కించుకుని మరింత సమాచారం సేకరించాలనేది ప్రత్యర్థి దేశం లక్ష్యంగా ఉంటుంది. ప్రస్తుతం జాడ తెలియని అమెరికా సైనికుడి విషయంలో శత్రుదేశాలమధ్య ఇదే ఆలోచనతో పెద్ద పోరాటం జరిగింది. చివరకు ఆ పైలట్‌ను అమెరికా దక్కించుకుంది. విమానం కూలిపోయినప్పుడు ఆ శకలాలు కూడా సాక్ష్యాలుగా శత్రుదేశానికి దొరక్కుండా వాటిని శత్రు భూభాగం నుండి తరలించుకుపోతారు. వీలు కాకపోతే వాటిని ధ్వంసం చేస్తారు. ఇస్ఫహాన్ వద్ద కూడా అమెరికా ఇదేవిధమైన యుద్ధ నీతి పాటించి తమ గాలింపు విమానాన్ని తునాతునకలుగా ధ్వంసం చేసింది.

ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో ఆదివారం 37వ రోజు యుద్ధంలో ఇరాన్‌వ్యాప్తంగా అమెరికా–ఇజ్రాయెల్ భీకర దాడులు చేశాయి. ఇరాన్‌లోని విశ్వవిద్యాలయాలను శత్రుసేనలు గగనతల దాడుల్లో ధ్వంసం చేయడంతో ఆ దేశ విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది.ఇరాన్‌లో మొత్తం 30 విశ్వవిద్యాలయాలపై అమెరికా–ఇరాన్ తీవ్ర దాడులతో విద్యావ్యవస్థకు అపార నష్టం కలిగించాయి. ఇరాన్‌లోని సైన్స్ కేంద్రాలపై దాడులు జరిగాయి.

# పడిపోయాయ్

(మొదటి పేజీ తరువాయి)

తగ్గింది. అలాగే మహబూబాబాద్ జిల్లాలోగత ఏడాది 4,10,675 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తే, ఈ సీజన్‌లో 2,92,579 కొనుగోలు చేశారు.

ఇక్కడ కూడా 1,18,096 క్వింటా ళ్ల పత్తి సీసీఐకి తగ్గింది.భూపాలపల్లి, ములుగు జిల్లాలో కూడా భారీగా సీసీఐకి పత్తి అమ్మకానికి రాలేదు. ఒక్క హనుమకొండ జిల్లాలో మాత్ర స్వల్పంగా పెరిగాయి. గత ఏడాది 1,62,544 క్వింటాళ్లను సీసీఐ కొనుగోలు చేస్తే, ఈ సీజన్లో మాత్రం 1,68,898 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. అంటే 6,354 క్వింటాళ్ల పత్తిని అధికంగా సీసీఐ కొనుగోలు చేసింది.

**పత్తి రైతుకు కపాస్ కష్టాలు...**

పత్తి రైతుకు ఈ సీజన్ లో కపాస్ యాప్ చుక్కలు చూపించింది. పత్తిని విక్రయించే రైతు ముందు కపాస్ యాప్ లో స్లాట్ బుక్ చేసు కుని, యాప్ లో సూచించిన తేదీ, మార్కెట్ కు మాత్రమే పత్తిని తీసుకె ళ్లాలని ఆంక్షలు పెట్టారు. రైతుల్లో చాలామందికి ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవటంతో పాటు కపాస్ యాప్పై అవగాహన లేకపోవటంతో సీసీఐకి బదులు ప్రవేటు వ్యాపారులను ఆశ్రయించారని సమాచారం.

అలాగే ఎకరాకు క్వింటాళ్లే కొంటామని సీసీఐ నియంత్రణ పెట్టడం కూడా రైతులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో చాలామంది రైతు లు సీసీఐ నింబధనలతో విసుగు చెంది ప్రైవేటుకు పత్తిని తరలించారనే అభిప్రాయాలు వ్యక్తం అవతున్నాయి. అలాగే అంతర్ జిల్లా పత్తి అమ్మకాలపై ఆంక్షలు పెట్టడం కూడా వరంగల్ ఏనుమాముల మార్కెటకు గత సీజన్ కంటే తక్కువ పత్తి అమ్మకానికి వచ్చిందని తెలుస్తోంది. వీటన్నింటికి తోడు జిన్నింగ్ మిల్లుల వర్గీకరణ కారణంగా పత్తి కొనుగోళ్ల ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. కొద్ది రోజులు జెన్నింగ్ మిల్లర్ల ఆందోళనలు కూడా సీసీఐ కొనుగోళ్లపై తీవ్రప్రభావం చూపాయి. ఇక వీటన్నింటికంటే ప్రధానమైనది దిగుబడి. ఆకాల వర్షాలతో చేతికి వచ్చే పత్తి వర్గానికి నీట తడిచి పనికి రాకుండా పోయింది. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి ఐదారు క్వింటాళ్లకు మించలేదు.దీంతో సీసీఐకి కూడా అమ్మకానికి తక్కువ పత్తి వచ్చింది. మొత్తంగా పరిశీలిస్తే 202324 సీజన్ లో పోల్సితే మాత్రం ఈసారి 7,36,599 క్వింటాళ్ల పత్తి అధికంగా రాగా.. గత ఏడాది రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన సీసీఐ ఈసారి మాత్రం 7లక్షల వరకు తక్కువ కొనుగోలు చేసింది.

# భద్రతకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

దాన్ని మించి అమలు చేయడం విశేషం.'కవచ్' వ్యవస్థ పరీక్షలు కాజీపేట–పెద్దంపేట, మల్కాజిగిరి–కామారెడ్డి, చర్లపల్లి–రఘునాథపల్లి, గుంతకల్లు–రాయచూరు, ముద్ఖేడపర్భణి మధ్య నిర్వహించగా, అన్ని సెక్షన్లలో 'లోకో కవచ్' పరీక్షలు సైతం విజయవంతమయ్యాయి. అదేవిధంగా, కాజీపేట–బల్హార్షా, విజయవాడ–దువ్వాడ, వాడి–రేణిగుంట మార్గాల్లో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ అమలు చేయడం ద్వారా రైళ్ల మధ్య దూరం సురక్షితంగా నిర్వహించబడుతోంది. ఈ విధానం రైళ్ల ఢీకొనే ప్రమాదాలను తగ్గించడంతో పాటు, రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచి, సగటు వేగాన్ని మెరుగుపరుస్తుంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, ఈ విజయానికి కారణమైన సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాల సిబ్బందిని అభినందించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా 'కవచ్' మరియు ఎబిఎస్ వ్యవస్థలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రైల్వే భద్రత, సామర్థ్య పెంపులో దక్షిణ మధ్య రైల్వే సాధించిన ఈ పురోగతి ప్రయాణికులకు మరింత సురక్షిత, వేగవంతమైన సేవలను అందించడంలో కీలకంగా మారనుంది.

# బాబూజీ స్ఫూర్తితో సామాజిక న్యాయం, అన్నివర్గాలకు మేలు



బాబూ జగ్జీవన్ రామ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డా.బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం వారు చేసిన కృషిని సిఎం కొనియాడారు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని, దళితుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పనిచేశారని గుర్తు చేసుకున్నారు. బాబూజీ స్ఫూర్తితో తెలంగాణలో సామాజిక న్యాయం, అన్నివర్గాల మేలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.



బాబు జగ్జీవన్ రామ్ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రాష్ట్ర మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు సమర్పించి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున బాబు జగ్జీవన్ రామ్ దేశ స్వాతంత్ర్యానికి విశేషంగా సేవలందించారని కొనియాడారు. ఏ హోదాలో ఉన్నా కూడా కష్టపడి పని చేసి, సామాజిక న్యాయం కోసం కృషి చేశారని, వారి జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు అపారమైనవని మంత్రి వివేక్ పేర్కొన్నారు.



అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి చిరస్మరణీయమని టిజిఎస్‌ఆర్‌టిసి ఇడి సిహెచ్.వెంకన్న అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని టిజిఎస్‌ఆర్‌టిసి ఘనంగా నివాళులర్పించింది. సంస్థ ప్రధాన కార్యాలయం బస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇడి సిహెచ్.వెంకన్నతో పాటు అధికారులు, సిబ్బంది బాబుజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.



బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాన్ని తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మి తో పాటు ఇతర అధికారులు అసిస్టెంట్ సెక్రటరీ మనోహర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ భారతదేశానికి, బడుగు బలహీన వర్గాలకు ఎంతో సేవ చేసారని, అలాగే వారి కూతురు మీరా కుమారి లోక్‌సభ స్పీకర్‌గా ఉండి తెలంగాణ బిల్ ఆమోదం పొందడానికి కృషి చేశారని అన్నారు.

డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో ఆదివారం మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్‌కి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్‌వికెరెడ్డి, పలువురు డైరెక్టర్లు, డీన్లు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్‌వికె రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి, విద్యా వికాసానికి, దేశ సమైక్యతకు, సమగ్రతకు దిశా నిర్దేశం చేసిన మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని సామాజిక సాధికార వారోత్సవాలు నిర్వహించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమాలు మాజీ ఉప ప్రధాని, బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలతో



మొదలై భారత రాజ్యాంగ నిర్మాత, స్ఫూర్తి ప్రదాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్‌టిసెల్ లైసన్ ఆఫీసర్ డా.బనోత్ ధర్మ, అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు, పలు విభాగాల అధిపతులు, ఉద్యోగ సంఘాల నాయకులు కాంతం ప్రేమ కుమార్, విశ్వనాథ్, భరత్ రెడ్డి, ఎన్.సి. వేణు గోపాల్ తదితరులు హాజరయ్యారు.

**అంబేద్కర్ వర్సిటీలో సామాజిక సాధికార ఉత్సవాల వివరాలు :** ఈనెల 6వ తేదీన ఆధునిక భారతదేశ అభివృద్ధిలో జగ్జీవన్ రామ్ పాత్రపై ఉపన్యాసం, 7న సామాజిక న్యాయం కోసం కళలు ఆర్టిస్టుల ఆధ్వర్యంలో శిబిరం, 8న రిజర్వేషన్లు – ప్రజాస్వామ్యం – సవాళ్లుపై సదస్సు, 9న ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ (వ్యవస్థాపకుల వేదిక). 10న ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం: సంఘర్షణలు, వైరుధ్యాలు, భవిష్యత్ కార్యాచరణపై జాతీయ సదస్సు నిర్వహిస్తారు. 11న మహాత్మా జ్యోతిబా పూలే స్మారక ఉపన్యాసం, 'పులే' తెలుగు చలనచిత్రం ప్రత్యేక ప్రదర్శన; మధ్యాహ్నం : ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్1 పుస్తకంపై చర్చ కార్యక్రమం నిర్వహించనున్నారు. 13న డా.బి.ఆర్. అంబేద్కర్ స్మారక ఉపన్యాసం, 14న డా.బీ.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం డా.బీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి, ఆ తర్వాత అంబేద్కర్ యూనివర్సిటీ డిజిటల్ సాధికారత కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.



బాబు జగ్జీవన్ జయంతి పురస్కరించుకుని ఆదివారం గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ఎంపి వి.హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు కుమారరావు, మత్సఅభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, జగదీశ్వరరావు సురేష్ కుమార్ తదితరులు

# దేశవ్యాప్తంగా పేదరికం, నిరుద్యోగం..
# ప్రశ్నిస్తున్న గొంతులపై ఉక్కుపాదం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద వర్గాల పార్టీ సిపిఐకి ఆర్థికంగా సహకారం అందించడం ద్వారా భవిష్యత్ ఉద్యమాలకు బాటలు వేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీ, సరళాదేవినగర్‌లో ప్రజలకు నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇ.టి.నరసింహ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు పేదరికం, నిరుద్యోగం, పాలకులు వీటిని పరిష్కరించకపోగా భావోద్వేగ రాజకీయాలు చేస్తూ తప్పుదారి పట్టిస్తు అసలైన సమస్యల నుంచి దారి మళ్లిస్తున్నారన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న గొంతులపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు అనేక పోరాటాల ద్వారా ప్రజలు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ వర్గాలకు అనుకూలమైన చట్టాలు రూపకల్పన చేస్తు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల తీరని ద్రోహం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడుల మూలంగా భారతదేశంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎన్‌జి కోసం గంటల తరబడి పెట్రోల్ బంకుల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారని, మనకు రావాల్సిన చమురు, రాకపోవటం వల్ల ఆధారిత పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడి అనేకమంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే యుద్ధాన్ని నిలిపివేయటానికి భారత సర్కార్ అమెరికా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఇటి నరసింహ డిమాండ్ చేశారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో పార్టీ మరిన్ని ఉద్యమాలను చేస్తుందని ఈ ఉద్యమానికి కావాల్సిన వనరుల సమీకరణ కోసం ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ప్రజలు ఆశీర్వదించి తమ సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నేర్లకంటి శ్రీకాంత్, ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి జిల్లా కౌన్సిల్ సభ్యులు సక్రిబాయి, జంగయ్య, కళ్యాణ్, అనిల్, రూప్ సింగ్, వంశీ, చంద్రయ్య, సుశాంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆ భూములను గుంజుకుంటోంది

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాదర్‌గూల్‌లోని రూ.7 వేల కోట్ల విలువ చేసే 373 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ పెద్దలు గద్దల్లా తన్నుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. ఈ భూముల వెనుక రెవెన్యూ శాఖ మంత్రి కుటుంబ సభ్యుల హస్తం ఉన్నదన్నారు. ప్రస్తుతం ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబ సభ్యులను బెదిరించి బయటికి పంపించారని, వారిని పోలీసులు, బౌన్సర్లతో బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉప నాయకురాలు సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ చట్టంలోని సెక్షన్ 8,సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఈ భూములను విక్రయించే హక్కు ఎవరికీ లేదని, ఈ విక్రయాలు చెల్లుబాటు కాబోవని, ఆర్‌డిఒ ఆ భూములను సెక్షన్ 22ఎ కింద నిషేధిత జాబితాలో పెట్టారని వివరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సదరు కంపెనీలు హైకోర్టుకు వెళ్లగా, ఆర్‌డిఒ నిర్ణయం సరైందేనని, ఈ భూముల క్రయ విక్రయాలు చెల్లబోవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ తీర్పునిచ్చాయన్నారు. దీనిపైన కూడా సదరు కంపెనీలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉన్నదన్నారు. ఇప్పటీ ఆ భూమి 'భూభారతి వెబ్‌సైట్‌'లో కూడా ప్రభుత్వ భూమిగానే చూపిస్తుందన్నారు. ఆనాటి ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు భూములను ఇస్తే, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ భూములను గుంజుకుంటోందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూములను కాపాడేందుకు నాటి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు పెద్ద పోరాటం చేశారని, దీనిపైన నాటి సిఎం వైఎస్‌ఆర్ స్పందిస్తూ ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారని, ఆ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం రక్షించిందని ఆయన వివరించారు. ఆ 373 ఎకరాల్లో 17 ఎకరాల లచ్చమ్మ కుంట (ఎఫ్‌టిఎల్), 6 ఎకరాల బఫర్ జోన్ ఉందని, ఆ చెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్స్ అన్నీ ఈ కంపెనీలు ధ్వంసం చేశాయని మండిపడ్డారు. 'రేపు ఉదయం'(సోమవారం)వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ అక్కడకు వెళ్లి చర్యలు తీసుకోకపోతే, బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలతో కలిసి అక్కడికి వెళ్తామని హెచ్చరించారు.

# గోల్కొండలో గంజాయి పట్టివేత

7 మంది అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోల్కొండ ఖిల్లా పరిసర ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎస్‌టిఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మొత్తం 308 గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకోగా, వాటి బరువు 2.03 కిలోలుగా గుర్తించారు. ఈ కేసులో 11 మందిపై కేసు నమోదు చేసి, 7 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ పరాహాన్, మహమ్మద్ వసీం, మహమ్మద్ మోహుసిన్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ అఫ్రాన్, సయ్యద్ అమీర్ అలీ, మహమ్మద్ ఇమ్రాన్ ఉన్నారు. కాగా అమన్ అలీ షాన్వాస్, మహబూబ్ మహమూద్ అహ్మద్, నజీర్ తదితరులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ నజీర్ మహారాష్ట్రలో చదువుకుంటూ అక్కడి నుంచి గంజాయిని పంపిస్తూ, స్థానికంగా విక్రయాలు జరిపిస్తున్నట్లు బయటపడింది. సమాచారం అందుకున్న ఎస్టిఎఫ్ ఏటీం ఇన్‌చార్జి అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 రెండు చక్ర వాహనాలు, 3 ఆటోలను కూడా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

# కెబిఆర్ పార్క్ జంక్షన్ ఫ్లైఓవర్ పనుల్లో వేగం

పూర్తయిన పి5 ఫౌండేషన్ కాంక్రీటింగ్ పనులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి చేపట్టిన కెబిఆర్ పరిసర ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల పనులపై మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) దృష్టిసారించింది. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా, కెబిఆర్ ప్యాకేజీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కెబిఆర్ పార్క్ ప్రవేశమార్గంలో (పార్క్ హయత్ హోటల్ వైపు) వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణంలో కీలక దశ పూర్తయింది. ఫ్లైఓవర్ నిర్మాణంలో అత్యంత కీలకమైన పి5 పిల్లర్ ఫౌండేషన్ రాఫ్ట్ రీఇన్‌ఫోర్స్‌మెంట్ పనులు విజయవంతంగా ముగిశాయి. పి5 ఫౌండేషన్ కోసం ఎం35 గ్రేడ్ కాంక్రీట్ పోరింగ్ పనులను ఇంజనీర్లు పర్యవేక్షించారు. ప్రస్తుతం ఈ రాఫ్ట్ కాంక్రీటింగ్ పనులు పూర్తయ్యాయి. కాంక్రీట్ వేసిన అనంతరం ఫినిషింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, గడువులోగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తెలిపారు.

## చిరంజీవులుకు మహాత్మ జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు

ఈనెల 10న రవీంద్రభారతిలో ప్రధానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు మహాత్మ జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు 2026కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 10వ తేదీ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో జరిగే మహాత్మా జ్యోతిరావు పూలే 199 జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డు ప్రధానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మాజీ ఎంపి, మాజీ మంత్రి వి.హనుమంతరావు, శాసన మండలి ప్రతిపక్ష నాయకులు సిహెచ్ మధుసూదనచారి, యాంటీ కరప్షన్ బ్యూరో తెలంగాణ రాష్ట్ర మాజీ డిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు పాల్గొని అవార్డు ప్రధానం చేస్తారని తెలిపారు. గత రెండు ఏళ్లుగా బీసీ ఉద్యమ కోసం పనిచేస్తూ బీసీ సిద్ధాంతాలపై అనేక పుస్తకాలు రాసి తెలంగాణ బీసీ ప్రజలకు ఒకే తాటిపై తీసుకు రావడానికి తన ప్రసంగాల ద్వారా, అనేక సదస్సులు నిర్వహిస్తూ బీసీలను జాగృతి పరుస్తున్న టి.చిరంజీవులను ఈ ఆవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు.

## కొత్త కోచ్‌లను పరిశీలించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఇండియన్ రైల్వే మరో ముందడుగు వేసింది. భవిష్యత్తు తరాల కోసం 'అమృత్ భారత్' కోచ్‌లకు సంబంధించిన నమూనా కోచ్‌లను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద పరిశీలించారు.ఈ నమూనా కోచ్‌లలో ప్రయాణికుల సౌకర్యం, ఆకర్షణీయమైన అంతర్గత అలంకరణ, మెరుగైన ప్రయాణ అనుభవం దృష్ట్యా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. కోచ్‌లలో పివిసి ఫ్లోరింగ్, సీట్లు, బెర్త్ రెక్సిన్, స్నాక్, కర్టెన్లు, లావేటరీ ప్రాంతాలు వంటి భాగాల్లో సమన్వయంతో కూడిన రంగుల థీమ్‌ను అమలు చేశారు. అన్ని పదార్థాలు హెచ్‌ఎల్3 ఫైర్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రూపొందించడంతో పాటు, ప్రయాణికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారు. ఆధునికత, అందం, దీర్ఘకాలిక ఉపయోగం, సులభ నిర్వహణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కోచ్‌ల రంగుల రూపకల్పన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలు రోలింగ్ స్టాక్ ఆధునీకరణలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నాయని, అన్ని వర్గాల ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా ఉందని వెల్లడించారు.

# 'కేంద్ర కార్మిక కోడ్'లను అమలు చేయబోమని కేంద్రానికి లేఖ రాయండి

'సింగరేణి' సమస్యలు పరిష్కరించండి: కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర కార్మిక కోడ్‌కు సంబంధించిన నాలుగు నల్ల చట్టాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయమై అసెంబ్లీలో తీర్మానం కూడా చేయాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'సేవ్ సింగరేణి' అనే అంశంపైన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 'మానవతా దృక్పథంతో ఆలోచించి మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, పెండింగ్,అలియాస్ పేర్లకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని, సింగరేణి సంస్థ అల్ట్ మిన్ కంపెనీతో రూ. 2250 కోట్లతో చేసుకున్న ఒప్పందంపై శ్వేత పత్రం విడుదల చేయాలని, నైనీ, తాడిచర్ల వంటి బొగ్గు గనులను కొత్తగా వచ్చే గనులను కూడా సింగరేణి సంస్థకే అప్పగించాలని' రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడతూ రాజస్థాన్ ప్రభుత్వంతో సింగరేణి సంస్థ రూ11 వేల కోట్లతో ఒప్పందం చేసుకుందని, ఒక మెగావాట్ విద్యుత్‌కు అయ్యే ఖర్చుకు మూడు రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టే విధంగా ఈ అగ్రిమెంట్ ఉన్నదన్నారు. రూ.27 లక్షలు కూడా ఆదాయం లేని అల్ట్ మిన్ అనే చిన్న కంపెనీతో రూ.2250 కోట్ల ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. దీనిపైన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ జెండాలను, ఏజెండాలను పక్కన పెట్టి అధికార ఎఐటియుసి,ఐఎన్‌టియుసి,సిఐటియుతో పాటు అన్ని యూనియన్లు సింగరేణి సంస్థ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని ఆమె కోరారు. మరో 20 రోజుల్లో రాజకీయ శక్తిగా తాము రాబోతున్నామని, ఈ లోపు ప్రభుత్వం సింగరేణి సమస్యలను పరిష్కరించకపోతే 'బొగ్గు బాయి బాట' కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సింగరేణి సమస్యల పరిష్కారినికి అవసరమైతే సమ్మెబాట పడుతామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి జెఎసి, ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.

# ఏకాగ్రత, ధ్యానంతో అద్భుత స్మరణశక్తి

జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో దిగ్విజయంగా 'మహా శతావధానం'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవ మేధస్సు తలుచుకుంటే అసాధ్యమైనది ఏదీ లేదని, ఏకాగ్రత, ధ్యానంతో అనంతమైన స్మరణ శక్తిని సొంతం చేసుకోవచ్చని పలువురు జైన్ మహాఅవధానులు, ప్రముఖులు అన్నారు. జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపం ఆడిటోరియంలో నిర్వహించిన మహా శతావధానం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జైన్ మహాఅవధాని అభినందన చంద్రసాగర్, నమీ, నేమీ చంద్రసాగర్లు, హర్యానా మాజీ గవర్నర్ బంగారు దత్తాత్రేయ, గౌరవ అతిథులుగా సిఐఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ ఆశిశ్ జైన్, తారక్ మెహతా కా ఉల్టా చెస్మా ప్రతినిధి సమయ్ షా (గోగి), గోలి హజరయ్యారు. మహాఅవధాని అభినందన చంద్రసాగర్ మాట్లాడుతూ నిరంతర సాధన, ధ్యానం, శ్వాసపై నియంత్రణ ద్వారా మెదడులోని నిక్షిప్తమైన శక్తులను మేల్కొల్పవచ్చన్నారు. శతావధానం అనేది కేవలం ఒక కళ కాదు, ఇది జీవన విధానమన్నారు. బండారు దత్తాత్రేయ ప్రారంభోపన్యాసం చేస్తూ భారతీయ సంస్కృతిలో అవధాన విద్యకు ప్రత్యేక స్థానం ఉందని, కంప్యూటర్ల కంటే వేగంగా మానవ మెదడు పనిచేస్తుందని ఇక్కడి అవధానులు నిరూపించారన్నారు. అవధానం కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, విద్యార్థులు కూడా ఇటువంటి ఏకాగ్రతను అలవరచుకుంటే జీవితంలో గొప్ప శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ట్రస్టీలు కైలాష్ బండారి, సిఎ విక్రమ్ శ్రీమల్, అమిత్ వజావత్, హితేష్ ముథ, అంకిత్ చోరాదియా, ప్రతినిధులు ఆకాష్ గురూజీ, అక్షత్ జైనం, రిషబ్, అక్షిత్, ఆర్యన్ జైనం, ప్రానం తదితరులు పాల్గొన్నారు.

## నగరవ్యాప్తంగా వేగంగా నాలాల పూడికతీత పనులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో వర్షాకాలానికి ముందస్తు సిద్ధతగా మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాలాల పూడికతీత పనులలో అధికారులు వేగం పెంచారు. నాలాల పూడికతీత పనులు యంత్రాంగం ముమ్మరంగా సాగిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**పురోగతిలో ఉన్న పనులు..**

– జిహెచ్‌ఎంసి గణాంకాల ప్రకారం మొత్తం 241 పనులకు గాను, ఇప్పటికే 195 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.
– మొత్తం మంజూరైన నిధులు : రూ.4330.35 లక్షలు.
– ప్రస్తుత పురోగతి నిధులు : రూ.3397.45 లక్షలు.
– టెండర్ ప్రక్రియలో ఉన్నవి : 11 పనులు (రూ.334.85 లక్షలు).
– మొదలవ్వాల్సినవి : 33 పనులు (రూ.569.55 లక్షలు).

**క్షేత్రస్థాయిలో ముమ్మర తనిఖీలు..**

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్నతాధికారులు పూడికతీత పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. అత్తాపూర్ సర్కిల్ 20 పరిధిలోని మీర్ ఆలం పార్క్ నాలాను డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ బృందం తనిఖీ చేసింది. అలాగే హాషీమాబాద్‌లోని అల్జుబైల్ కాలనీ మేజర్ నాలాను హైడ్రా ఇంజనీరింగ్ బృందాలు సందర్శించాయి. అంబర్‌పేట్ సర్కిల్ 42 పరిధిలోని ఫీవర్ హాస్పిటల్ నాలా, బతుకమ్మ కుంట, కృష్ణానగర్ నాలాలు, అంబర్‌పేట్ వద్ద జరుగుతున్న యంత్రాల పూడికతీత పనులను ఇంజనీరింగ్ బృందం పర్యవేక్షించారు. శంషాబాద్ సర్కిల్ 18లో ఫిరంగి నాలా పనులు, వార్డు నెంబర్ 53 (తోరూర్)లోని ఇంజాపూర్ మాసబ్ చెరువు నాలా పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఖైరతాబాద్ జోన్ సర్కిల్ 39లోని అన్నపూర్ణ బ్లాక్ సమీపంలో గల మేజర్ నాలా పనులను అధికారులు పరిశీలించారు.

**జోన్‌ల వారీగా పనుల వివరాలు..**

| జోన్ పేరు | మొత్తం పనులు | నిధులు (లక్షల్లో) | పురోగతిలో ఉన్నవి |
|---|---|---|---|
| శంషాబాద్ | 17 | 574.90 | 17 |
| రాజేంద్రనగర్ | 60 | 1186.49 | 45 |
| చార్మినార్ | 37 | 625.06 | 35 |
| గోల్కొండ | 57 | 960.80 | 43 |
| ఖైరతాబాద్ | 32 | 577.30 | 24 |
| సికింద్రాబాద్ | 38 | 405.80 | 31 |

# ఇందిరాపార్కు స్థలం ఆక్రమణను అడ్డుకుందాం

వాకర్స్‌కు సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ పిలుపు

సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా

ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని ఇందిరా పార్కులో కరాటే కోచింగ్ సెంటర్ పేరిట జరిగే ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. ఇందుకు ఇందిరాపార్కు వాకర్స్ చేపట్టే ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. గత కొన్నిరోజులుగా కరాటే కోచింగ్ పేరిట పార్కు స్థలాన్ని కబ్జా చేసి స్థానిక ఎంఎల్‌ఎ ముఠా గోపాల్ నిధులతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాకర్స్ ముందు కొచ్చి నిరసిస్తుండటం అభినందనీయమన్నారు. ఆదివారం సేవ్ ఇందిరాపార్కు అంటూ వాకర్స్ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరై, స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇందిరాపార్కులో ఎమరాల్డ్ స్వీట్ హౌస్ పేరిట కొంత స్థలం, డంపింగ్ యార్డు పేరిట మరికొంత స్థలం, స్నోవరల్డ్, షటిల్,కోర్టు పేరుతో ఇందిరాపార్కు చుట్టూ స్థలం కబ్జాకు గురవుతున్నదని మండిపడ్డారు. కబ్జాల నుంచి ఇందిరాపార్కు స్థలాన్ని రక్షించేందుకు జిహెచ్‌ఎంసి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు తమ పార్టీ పక్షాన ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వివిధ నిర్మాణాల పేరుతో ఇందిరాపార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డికి, జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి స్టాలిన్, ఇందిరాపార్కు వాకర్స్ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, నర్సింగ్‌రావు, ఇతర వాకర్స్ పాల్గొన్నారు.

# మెడలు పట్టి గెంటేసిన బిఆర్‌ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు

ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు ప్రభుత్వంపై పోరుబాట చేపడుతాం

మీడియా సమావేశంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మెడలు పట్టి గెంటేసిన బిఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదని పార్టీ మారుతారని వస్తున్న కథనలపై ఈటల సంచలన వ్యాఖ్యలు చేశారు. శామీర్‌పేటలోని ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి ఐదేళ్లు గడుస్తుందని మాజీ సిఎం కెసిఆర్ తనకు ఉన్న న్యూస్ పేపర్లు, టీవి చానళ్లలో సొంత కథనాలతో తనపై అడ్డగోలుగా అసత్య ప్రచారాలు చేశారని మండి పడ్డారు. అనివార్య కారణాల వలన బిజెపిలో చేరడం జరిగిందన్నారు. బిజెపి నాయకురాలు బొడిగె శోభతో పాటు తనపై పార్టీ మారుతున్నారని పోస్టర్లు వేయడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం ప్రస్తుతం జరుగుతుందన్నారు. పార్టీలు మారడం బట్టలు మార్చుకున్నంత తేలిక కాదని వివరించారు. పార్టీలు మారకూడదని సందేశం ఇచ్చిన వాళ్లమని గుర్తుచేశారు. అలాంటి తనపై వెకిలి చేష్టలు, చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గత ఇరవై ఏళ్లుగా టిఆర్‌ఎస్‌లో పార్టీలో కొనసాగడం జరిగిందని ఆ పార్టీలో నాకు అభిమానులు కూడ ఉన్నారని అన్నారు. కేసిఆర్ ఈటలను బయటకు పంపించి తప్పు చేశారని కొందరు బాహటంగా అనుకుంటున్నారని చెప్పారు. అనేక మంది ఉద్యమకారులను, మంత్రులను, ఎంపిలను కెసిఆర్ పొగొట్టుకున్నారని చెప్పారు. పార్టీ నుంచి బయటకు వచ్చిన నాయకులు కెసిఆర్‌ను కలిసి తిరిగి పార్టీలోకి వస్తామని ప్రచారం చేయడం తగదని అన్నారు. తనకున్న అధికార బలంతో ఓ అధికారిని పెట్టి రాత్రికి రాత్రే తన గోదాములను ఖాళీ చేయించారని ఆరోపించారు. అనాడు అధికారం చేతుల్లో ఉందని నాకు చెందిన భూములను, కోళ్లఫారమ్‌లను లాక్కోన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేఖత వస్తుందని ఆనాడు కేసిఆర్ చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేస్తుందని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని పేర్కోన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న అంశాలపై త్వరలోనే ప్రణాళికలు చేసుకుని ప్రభుత్వంపై పోరాడుతామని చెప్పారు. చలో బాలాజినగర్ కార్యక్రమాన్ని మా ఎంఎల్‌ఎలు, ఎంపిలతో కలిసి చేపడుతామని కార్యచరణ సిద్ధం చేస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి అన్ని స్థానాలను కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు బొడిగే శోభ, నాయకులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డలకు ప్రాచీన కళలు నేర్పించాలి

రాష్ట్రపతి నిలయం ఇన్‌చార్జి రజని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రపతి నిలయంలో ప్రతినెలా నిర్వహించే కళా సంధ్య కార్యక్రమం వీనుల విందుగా జరిగింది. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీరామ నృత్యాలయ డ్యాన్స్ అకాడమీకి చెందిన గురువు భార్వాది స్రవంతిరెడ్డి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, ఫోక్ నృత్యాలు ప్రదర్శించారు. స్రవంతిరెడ్డి అకాడమీకి చెందిన మొత్తం 49 మంది నృత్య కళాకరులు పలు విభాగాల్లో తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి నియలం ఇంచార్జీ, మేనేజర్ రజనీ మాట్లాడుతూ.. ఆడబిడ్డలను మన సంస్కృతిలో భాగం చేయాలని కోరారు. వారికి మన ప్రాచీన కళారూపాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కళా సంధ్యా కార్యక్రమంలో సీతా కల్యాణ ఘట్టం కండ్లకు చాలా ఇంపుగా ఉందని, ఇదిగో భద్రాది అనే పాటలో ఐదేండ్ల లోపు చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో అద్భుతంగా ఆకట్టుకున్నారని గురువు స్రవంతిరెడ్డికి కితాబిచ్చారు. మూసిక వాహనం, వీణ పుస్తక దారిణి, గరుడ గమన, వినాయక కౌతవం వంటి పాటలకు అద్భుతంగా నృత్య ప్రదర్శనలు చేసిన కళాకారులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నృత్యాలయ డ్యాన్స్ అకాడమీ గురువు స్రవంతిరెడ్డికి సన్మానంతో పాటు మెమోంటో అందజేశారు. చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

## హైదరాబాదీలు నిజమైన కళాభిమానులు

ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ రాజేంద్రపాటిల్



**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** హైదరాబాద్ ప్రజలు నిజమైన కళాభిమానులు అని ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ రాజేంద్రపాటిల్ కొనియాడారు. ఈ సంవత్సరం గ్యాలరీల సంఖ్య బాగా పెరిగిందని.. సుమారు 20,000 మంది ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించారని ఆయన తెలిపారు. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇది మా మూడవ ఎడిషన్, ఈ ఉత్సవం ముంబై, ఢిల్లీ, బెంగళూర్‌లలో 38 ఎడిషన్లను పూర్తి చేసిందని.. అయితే హైదరాబాద్‌లో చాలా ప్రోత్సాహకరమైన స్పందన ఇచ్చిందన్నారు. ఫెస్టివల్‌లో కళా సమాజం చురుకుగా పాల్గొన్నదని.. 300 మందికి పైగా కళాకారులతో ఏర్పాటైన సుమారు 120 స్టాల్స్‌లో చాలా వరకు హైదరాబాద్‌కు చెందిన ప్రతిభావంతులవే కళారూపాలు ఉన్నాయని పేర్కొన్నారు. మేము గ్యాలరీ స్టాల్స్, సోలో ఆర్టిస్ట్ స్టాల్స్, యువ, కొత్త కళాకారుల కోసం ప్రత్యేక స్థలాలతో సహా వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశామని.. దీనివల్ల సందర్శకులు ఒకే చోట అనేక రకాల కళలను అన్వేషించడం చాలా సులభంగా.. అంతేకాకుండా ఉపయోగకరంగా ఉందన్నారు.

## వామపక్ష పార్టీలు చీలిపోయినా ప్రజల పక్షాన నిలిచి పోరాటం

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** వామపక్ష పార్టీలు చీలిపోయినా.. పార్టీలు ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తున్నాయని.. ప్రజల పక్షాన నిలిచిన కామ్రేడ్స్ వర్ధిల్లుతారని పలువురు వక్తలు కొనియాడారు. ఎర్రజెండా నీడన 50 ఏళ్ల ప్రయాణం... అంటూ పాతజ్ఞాపకాలను వారు నెమరువేసుకున్నారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వేడుకలో సిపిఐ(ఎంఎల్ లిబరేషన్) ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉమ్మడి ఏపీలో సిపిఐలో పదేళ్లు పనిచేసి విశాలాంధ్రలో 15 సంవత్సరాలు సేవలందించిన లోకం భాస్కరరావు, లోకం పద్మలను ఘనంగా సన్మానించారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం చేసుకున్న ఆరు జంటలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కందిమల్ల ప్రతాపరెడ్డి, తిప్పర్తి యాదయ్య, పి.రాజేశ్వరరావు, గోలి సీతారామ్య, ఎస్.రాజా, పి. నారాయణరెడ్డి, కనపర్తి బెన్వర్, లోకం కృష్ణయ్య, పల్లె నరసింహ, ఎన్.రామారావు, దేవరకొండ శ్రీను అతిథులుగా విచ్చేయగా.. కార్యక్రమానికి సోమశిల తిరుపాల్ అధ్యక్షత వహించారు. శివశంకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో 10 ఏండ్ల పాటు సిపిఐలోను.. 15 ఏళ్ల పాటు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లోనూ తనతో పాటు సతీమణి పద్మ పనిచేశామని.. ప్రస్తుతం సిపిఐ(ఎంఎల్ లిబరేషన్) ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా సేవలందిస్తున్నామని.. మొత్తం 50 ఏళ్ల పాటు ఎర్రజెండా నీడలో ప్రజల పక్షాన తాము పోరాటం చేశామని.. చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు పల్లె నరసింహ చైతన్య గీతాలను ఆలపించారు. ఎర్రజెండా వెలుగులో ఎగిసిన పిడికిళ్లలో ఎన్నెన్ని త్యాగాల గుర్తులు ఉన్నాయో అనే పాటను ఆయన పాడి వినిపించారు. కార్యక్రమంలో విశాలాంధ్ర నవ చేతన పూర్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



# ప్రపంచ జిడిపిలో ఆరోగ్యరంగానికి 10 శాతం వాటా

మెంటర్ హెల్త్ లీడర్‌షిప్,ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్,యాంటీ మైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ నిపుణుడు డాక్టర్ విజయ్ వి.యెల్దండి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రపంచ జిడిపిలో ఆరోగ్యరంగానికి 10 శాతం వాటా కలిగి ఉంది. ప్రస్తుతం ఇది యుఎస్‌డి 122 బిలియన్‌గా ఉండగా 2024 నాటికి యుఎస్‌డి 200 బిలియన్ కు చేరుతుందని అంచనా అని మెంటర్ హెల్త్ లీడర్‌షిప్,ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్,యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ నిపుణుడు డాక్టర్ విజయ్ వి.యెల్దండి అన్నారు. ఆదివారం నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం,ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్మెంట్ వారు సంయుక్తంగా ప్రజా వైద్యం, మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ,వాటి పరిణామాలు అనే అంశం పై రంగారెడ్డి జిల్లా కొండాపూర్ సిఆర్ ఫౌండేషన్ లోని ఇంద్రజిత్ గుప్తా హాల్ లో సెమినార్ ను నిర్వహించారు.ఈ సెమినార్ కి నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా. టి.సురేష్ బాబు అధ్యక్షత వహించి కేంద్రం కార్యకలాపాల గురించి వివరించి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ బుర్రి రంగారెడ్డి ని మోడరేటర్ గా నియమించి సెమినార్ ని ప్రారంభించారు.మెంటర్ హెల్త్ లీడర్‌షిప్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ నిపుణుడు డాక్టర్ విజయ్ వి.యెల్దండి పబ్లిక్ హెల్త్,మెడికల్ ఎడ్యుకేషన్ ప్రైవేటైజేషన్, దాని పరిణామాలు అనే అంశంపై ప్రసంగిస్తూ ప్రదానంగా ప్రపంచ జిడిపిలో ఆరోగ్యరంగం 10 శాతం వాటా కలిగి ఉంది. ప్రస్తుతం ఇది యుఎస్‌డి 122 బిలియన్‌గా ఉంది 2024 నాటికి యుఎస్‌డి 200 బిలియన్ కు చేరుతుందని అంచనా కు వచ్చారు. భారతదేశంలో ప్రైవేట్ రంగం 62 శాతం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కలిగి ఉండి,70 రోగులను చూసుకుంటోంది.ప్రైవేట్ ఈక్విటీ ప్రవేశం మరియు రెండవ, మూడవ స్థాయి నగరాలకు విస్తరణతో ప్రైవేటైజేషన్ వేగంగా పెరుగుతోందని ఆయన హెచ్చరించారు. తాను ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చదువుకున్నానని,ఆ విద్య తనకు ప్రజలకు సేవ చేయడానికి అవకాశం కల్పించిందని డా యెల్దండి గుర్తుచేశారు. ప్రస్తుతం మెడికల్ విద్య ఖర్చులు అధికంగా ఉండటం వల్ల, వైద్యులు ఆ ఖర్చులను తిరిగి సంపాదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రోగులు ప్రత్యేక ఆసుపత్రుల్లోకి వెళ్లి అనేక పరీక్షలు చేయించుకోవడం వల్ల వారి జేబులు ఖాళీ అవుతున్న ఉదాహరణలు ఆయన ఇచ్చారు. భారతదేశంలో హెల్త్‌కేర్ "సిక్‌కేర్"గా మారింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఎఐ, మెడికల్ టూరిజం, రోబోటిక్స్,డయాగ్నస్టిక్ హెల్త్ టెక్ స్టార్టప్‌లు, కార్పొరేట్ హాస్పిటల్ చైన్లు పెరుగుతున్న కొద్దీ ఖర్చులు మరింత పెరుగుతున్నాయి. పేద ప్రజల ఆరోగ్య అవసరాలు విస్మరించబడతాయని ఆయన హెచ్చరించారు. 202526 నాటికి భారతదేశంలో 1,29,000 ఎంబిబిఎ సౌఒ ఎంబిబిసంఒ సన్సీట్లు ఉండగా, వాటిలో 50 ప్రైవేట్ ఉన్నాయి. త్వరలో ఇది 8088 కు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. 1978లో డబ్లు ఎచ్‌ఒ, యునైసఫ్....యు ఇ సంయుక్తంగా నిర్వహించిన అల్మాఆటా డిక్లరేషన్ను ఆయన గుర్తుచేశారు. "హెల్త్ ఫర్ ఆల్" లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అందరికీ అందుబాటులో ఉండాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సెమినార్‌లో సిఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ డా. కె.నారాయణ, వివిధ రంగాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం, సిఆర్ ఫౌండేషన్ సభ్యులు వృద్ధాశ్రమం వాసులు పాల్గొన్నారు.

## రేడియం స్టిక్కర్ భారం

### ప్రైవేట్ సంస్థలకు రూ.100 కోట్ల లబ్ధి?




**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** రవాణా శాఖలో రేడియం స్టిక్కర్ వ్యవహారం విమర్శలకు తావిస్తున్నది. రేడియం స్టిక్కర్ వేసే ప్రక్రియ ఐదు ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లడంతో వాహనదారులపై అదనపు భారం పడుతోంది. రేడియం స్టిక్కర్ అప్‌లోడ్ చేస్తేనే రవాణా శాఖ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నందున.. మారిన విధానంతో ప్రైవేట్ సంస్థలకు ఏడాదికి రూ.100 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుందనే విమర్శలు వస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాలకు రేడియం స్టిక్కర్ ఉండాలి. ఈ నిబంధన మేరకు ఫిట్‌నెస్ కోసం ఆన్‌లైన్‌లో స్టిక్కర్‌తో వాహనం ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జీవనోపాధి కోసం కమర్షియల్ వాహనాలు కొనుగోలు చేసిన వారికి ఇప్పటివరకు రూ.వందల్లో ఖర్చు అయితే.. ఇప్పుడు అది కాస్తా రూ.వేలల్లోకి చేరింది. కమర్షియల్ వాహనాలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన రేడియం స్టిక్కర్ వేసేలా కొత్త నిబంధన తీసుకురావడం.. ఐదు కంపెనీలకు బాధ్యతలను అప్పగించడం.. సంబంధిత కంపెనీలకు సరిపడా ఉద్యోగులు లేకపోవడం.. లక్షల సంఖ్యలో వాహనాలు ఉండటం కారణంగా స్టిక్కర్ వేసిన సమాచారం రవాణా శాఖకు అప్‌లోడ్ చేయడంలో జరుగుతున్న వ్యూహాత్మక జాప్యంతో వాహనదారుల నుంచి అదనంగా డబ్బు వసూలు చేసేందుకు వెసులుబాటుగా మారిందన్న విమర్శలు ఊపందుకున్నాయి. గతంలో రేడియం స్టిక్కర్ వేస్తే మూడేళ్లు వచ్చేదని.. ఇప్పుడు 10 రేట్లు ఖర్చు పెట్టి వేయించినా ఏడాది కూడా వచ్చేలా లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుడిపై భారం వేసే క్యూఆర్ కోడ్ విధానంతో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఏడాదికి రూ.100 కోట్ల మేరకు చేరుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రభుత్వానికి ఆదాయం కేవలం 10 శాతం మాత్రమే చేరుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రేడియం స్టిక్కర్ వ్యవహారం ఇప్పుడు రవాణాశాఖలో హాట్ టాపిక్‌గా మారిందని చెప్పవచ్చు.




## కుల నిర్మూలన కోసం మారథాన్ వాక్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్/చిక్కడపల్లి :** అసమానతలు లేని సమ సమాజం కోసం మారథాన్ అడుగులు... అంటూ ఆదివారం నెక్లెస్ రోడ్డులో మారథాన్ వాక్ జరిగింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో కుల వివక్ష లేని నవ సమాజం కోసం, రాజ్యాంగ స్ఫూర్తిని చాటి చెప్పేలా మా నడక అంటూ పర్యావరణ ప్రేమికులు, ఆదర్శ దంపతులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, యువత నినదించారు. కులం లేని సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ న్యాయమూర్తి రాధా రాణి నినదించారు. ఉత్సాహంగా సాగిన మారథాన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టిపిఎస్‌కె గౌరవ అధ్యక్షుడు జి.రాములు, విజ్ఞాన దర్శిణి అధ్యక్షుడు టి. రమేష్, డిబియస్ అధ్యక్షుడు శంకర్, గుత్తాజోత్స్న, జ్యోతి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం ఎన్,సోమయ్య, సుజావతి, సిటీ కమిటీ నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక తులసిరామ్ పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్‌కు నివాళ్లు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ సర్కిల్ (బడా గణేష్) వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ విజయరెడ్డి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. నిర్వాహకులతో పాటు దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కుల, మతాల సంకెళ్లు తెంచిన కవి సమ్మేళనం

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** కవులు కుల, మతాల సంకెళ్లను తెంచిన కవి సమ్మేళనం అని.. ఆదర్శ భారతీయులంతా ఒక్కటై కులమత అంతరాలు లేని సమాజాన్ని నిర్మూలించేందుకు కంకణం కట్టిన రోజు అని.. కులమతాల అడ్డుగోడల్ని కూల్చుతూ మనుషుల్ని మనుషులుగా చూసే స్వప్నమని.. సుందరయ్య కలలు కన్న స్వప్నమని కవి యాకూబ్ కొనియాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 65 మంది కవులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కవి యాకూబ్ మాట్లాడుతూ, కుల. మత రహిత సమాజానికి ఈ కవి సమ్మేళనం ఆరంభమని.. సమసమాజ స్థాపనకు ఇది ప్రారంభమని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ మాట్లాడుతూ, కుల వ్యవస్థను ప్రశ్నించే కవిత్వం కావాలని.. సమాజాన్ని పట్టిపీడిస్తున్న కులం పోవాలని.. అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచిన కుల గోడల్ని కూల్చే కవులు అక్షరం ఆయుధాలు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితి కార్యదర్శి కె.అనందాచారి, ఎస్కే సలీమ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గుప్త జ్యోత్స్న, మౌనం మల్లిక్, మాస్టర్ జి, వనపట్ల సుబ్బయ్య, సాధనాల వెంకటస్వామి నాయుడు, జనజ్వాల, జి.యాదగిరిరావు, పుష్యమి సాగర్, గొర్ల బుచ్చన్న రచన సాహు, రేణుక అయోల, నాంపల్లి సుజాత, ముజాయుద్దీన్, సందీప్, ఓటారికల్ మోహనకృష్ణ, మహేష్ దుర్గే, అత్తులూరి విజయలక్ష్మి, శ్రీధర్ గాజుల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజుపై హైకోర్టు తీర్పును నిరసిస్తూ

# 8న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** రాష్ట్ర ఇంజినీరింగ్, డిగ్రీ, పిజి విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం విచారకరమని, ఇందుకు నిరసిస్తూ ఈ నెల 8న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ధర్నా ప్రదర్శనల్లో భాగంగా కలెక్టరేట్‌ల ముట్టడి, ఆర్‌డిఒ, ఎంఆర్‌ఒ ఆఫీసుల వద్ద ధర్నాలు, ఎంఎల్‌ఎ క్యాంప్ ఆఫీసుల ముట్టడి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని ఓ హోటల్‌లో 18 బిసి సంఘాల సమావేశం సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వం జిఒ ప్రకారం ఫీజులు వసూలు చేయొద్దని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని గుర్తుచేశారు. కానీ విరుద్ధంగా ప్రస్తుత హైకోర్టు తీర్పు 14 లక్షల మంది విద్యార్థుల ఉన్నత చదువులకు గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. హైకోర్టులో అడ్వకేట్ జనరల్, గవర్నమెంట్ అడ్వకేట్లు సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే హైకోర్టు ఇలాంటి తీర్పు ఇచ్చిందని విమర్శించారు. కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను స్కీంను ఎత్తువేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. 18 ఏళ్లుగా కొనసాగుతున్న ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించారని, సమాజంలో విప్లవాత్మక మార్పు వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, హైకోర్టు తీర్పుపై వెంటనే అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, రూ.6వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరారు. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, రాజేశ్ యాదవ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నేతలు రాజేందర్, జిల్లపల్లి అంజి, నిఖిల్ పటేల్, శివకుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అఖిలాశ్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్‌కి భారతరత్న ఇవ్వాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** భారత ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, ఆధునిక భారత దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన రాజకీయ దురంధరుడు, సుదీర్ఘకాలం పార్లమెంట్‌లో సభ్యుడిగా, దేశ ప్రజలకు విశేషమైన సేవలు అందించిన యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కి కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో జరిగిన బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు జేపీ లత మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ, అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పి ఉప అధ్యక్షుడు ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు రాజు మాదిగ, విజయ్‌రావు మాదిగ, ఎడ్ల రుద్రి మాదిగ, చెండేటి వేణుగోపాల్ మాదిగ, దేవేందర్ మాదిగ, నాని మాదిగ, మురళీధర్ మాదిగ, సత్యనారాయణ మాదిగ, బోలు శ్రీనివాస్ హోలియా దాసరి, రవి సత్యనారాయణ నేత, తుమ్మల శివప్రసాద్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, బాభేందర్, డప్పు మహేష్ మాదిగ, ఇతేపాక హరి మాదిగ తదతరులు పాల్గొన్నారు.



## దన్‌రాజ్ జైన్ జ్యువెలర్స్ ఫెస్టివ్ లక్కీ డ్రా విజేతలు వీరే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధన్‌రాజ్ జైన్ జ్యువెలర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమ ఫెస్టివ్ లక్కీ డ్రా–2026ను ప్రకటించింది. గత మార్చి 8 నుంచి ఈ నెల 4 వరకు సాగిన ఈ ఫెస్టివ్‌లో వేలాది మంది వినియోగదారులు ఉత్సాహభరిత వాతావరణంలో షాపింగ్ చేసినట్టు ధన్‌రాజ్ జైన్‌జ్యువెలర్స్ ఎండి ధ్రువ్ రాంకా తెలిపారు. ఆదివారం హైదరాబాద్ చంపాపేటలో జరిగిన లక్కీడ్రా కార్యక్రమంలో రూ.30 లక్షల విలువైన బహుమతుల విజేతలను వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన మారుతి సుజుకి ఎర్టిగా శంకర్‌పల్లికి చెందిన ఇష్రత్ బేగం గెలుచుకోగా, ఐదు టివిఎస్ అపాచీ బైక్‌లను రుఖయ్యా సుల్తానా, బండే నవాజ్, అఫ్షీన్, గౌస్ మొహిద్దీన్, రుబీనా బేగంకు అందజేశారు. గ్రాండ్ ప్రైజ్‌లతోపాటు, క్యాంపెయిన్ అంతటా నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా ప్రతి వారం 10 మంది విజేతలకు ఎల్‌పిజి రిఫ్రిజిరేటర్లు, ఎల్‌జి వాషింగ్ మెషిన్లు, ఎల్‌జి టెలివిజన్లు, వన్‌ప్లస్ నార్డ్ స్మార్ట్‌ఫోన్లు, ప్రీమియ గృహోపకరణాలు, గాడ్జెట్‌లు ప్రదానం చేసినట్టు ఆయన వివరించారు.

### ఒడిశాలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల

# రిజర్వేషన్ పెంపు



**భువనేశ్వర్:** ఒడిశా ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు రిజర్వేషన్ శాతాలను పెంచింది. అదే విధంగా, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలైన ఎస్ఇబిసి (ఒడిశాలో ఒబిసిలకు సమానమైన వర్గం) కోసం వైద్య, సాంకేతిక విద్యలో కొత్తగా రిజర్వేషన్ ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన భువనేశ్వర్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ తీర్మానాలను అనుసరించి, ఎస్‌టి విద్యార్థుల రిజర్వేషన్‌ను 12 శాతం నుండి 22.5 శాతానికి పెంచారు. అలాగే ఎస్‌సిల రిజర్వేషన్‌ను 8 శాతం నుండి 16.25 శాతానికి పెంచారు. అదనంగా, ఎస్ఇబిసి వర్గానికి చెందిన విద్యార్థులకు 11.25 శాతం రిజర్వేషన్‌ను తొలిసారి అమలు చేస్తున్నారు. ఈ మార్పులు రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఈ కొత్త రిజర్వేషన్ విధానం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, వాటికి అనుబంధ కళాశాలలు, విద్యాసంస్థలు, ఐటిఐలు, పాలిటెక్నిక్‌లలో అమలులోకి రానుంది. ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, మెడిసిన్, శస్త్రచికిత్స, డెంటల్, నర్సింగ్, ఫార్మసీ, అనుబంధ ఆరోగ్య శాస్త్రాలు, సైకియాట్రీ, ఆయుర్వేదం, హోమియోపతి, వ్యవసాయం, అనుబంధ శాస్త్రాలు, ఆర్కిటెక్చర్, ప్లానింగ్, సినీమాటిక్ ఆరట్స్ వంటి విభాగాలలో ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఇదే విధంగా, అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలలో డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు ఇచ్చే అన్ని కోర్సులకు కూడా ఈ రిజర్వేషన్ విధానం వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరచుగా ప్రకటించే ఇతర కోర్సులకూ ఇది వర్తిస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం విడుదలైన పత్రంలో ఉంది. రాష్ట్రంలో ఎస్‌టి జనాభా 22 శాతానికి పైగా ఉన్నప్పటికీ, ఇంతకాలం వారికి కేవలం 12 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉండటం అసమానతకు దారితీసిందని ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. అందువల్ల జనాభా నిష్పత్తిని అనుసరించి రిజర్వేషన్‌ను పెంచినట్లు తెలిపారు. ఇదే విధంగా SCల జనాభా 17 శాతానికి పైగా ఉన్నప్పటికీ, వారికి కేవలం 8 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉండటం గమనార్హం. ఉదాహరణకు, రాష్ట్రంలో మొత్తం 2,421 అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లలో, పాత విధానంలో ఎస్‌టి విద్యార్థులు కేవలం 290 సీట్లు మాత్రమే పొందగలిగారు. ఇప్పుడు రిజర్వేషన్ పెంపుతో ఈ సంఖ్య 545కు పెరుగుతుంది. అదే విధంగా ఎస్‌సిల కోసం సీట్లు 193 నుండి 393కు పెరుగుతాయి. ఇంజనీరింగ్ రంగంలో కూడా గణనీయమైన మార్పులు కనిపిస్తాయి. రాష్ట్రంలో మొత్తం 44,579 ఇంజనీరింగ్ సీట్లలో ఎస్‌టిల సీట్లు 5,349 నుండి 10,030కు పెరుగుతాయి. ఎస్‌సిల సీట్లు 3,566 నుండి 7,244కు పెరుగుతాయి. అదనంగా, ఎస్ఇబిసి విద్యార్థులకు తొలిసారి 515 సీట్లు దక్కుతాయి. ఈ నిర్ణయం ఒడిశాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కీలకమైనదిగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఆర్‌బిఐ రెపోరేటు యథాతథం!

### ఆర్థిక నిపుణుల అంచనా




**ముంబయి:** ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో, ముఖ్యంగా పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు ఉన్నందున, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఏప్రిల్ ద్రవ్య విధాన సమీక్షలో కీలకమైన రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచే అవకాశముందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, వివిధ రకాల వస్తువుల ధరల అస్థిరత, రూపాయి విలువలో తీవ్ర మార్పులు వంటి అంశాలన్నీ కలిపి ఆర్థిక విధాన నిర్ణయాలను క్లిష్టం చేస్తున్నాయి. రూపాయి విలువ డాలర్‌కు 93కు పైగా పడిపోవడం, క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా ఉండటం వంటి పరిణామాలు దిగుమతి ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఐఆర్‌సిఎ ప్రధాన ఆర్థిక నిపుణురాలు అదితి నాయర్ ప్రకారం, క్రూడ్ ఆయిల్ ధరలు, భౌగోళిక పరిస్థితులపై అనిశ్చితి ఉన్నందున ఆర్‌బిఐ తక్షణ మార్పులకు వెళ్లకుండా ప్రస్తుత స్థితిని కొనసాగించే అవకాశమే ఎక్కువ. ఎస్‌బిఐ ప్రధాన ఆర్థిక నిపుణుడు సౌమ్య కాంతి ఘోష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ప్రస్తుత సంక్షోభం ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆయన ప్రకారం, సూపర్ ఎల్ నినో ప్రభావం కూడా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ లక్ష్యమైన 4 శాతానికి సమీపంగా ఉంటే, ఈ సరఫరా షాక్‌ను తాత్కాలికంగా పరిగణించి రేట్లను మార్చకుండా ఉంచవచ్చని క్రిసిల్‌కు చెందిన ఆర్థిక నిపుణురాలు దిప్తి దేశ్‌పాండే అభిప్రాయపడుతున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి నుండి ఆర్‌బిఐ మొత్తం 1.25 శాతం వరకు రెపో రేటును తగ్గించినప్పటికీ, 2025 ఆగస్టు, అక్టోబర్–2026 ఫిబ్రవరి సమీక్షల్లో రేటును మార్చలేదు. ఆరు సభ్యులతో కూడిన ద్రవ్య విధాన కమిటీ సమావేశం సోమవారం ప్రారంభమై, బుధవారం తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ లక్ష్యానికి దగ్గరగా ఉన్నప్పటికీ, ఇటీవల క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వల్ల ఇంధనం, రవాణా, ఇతర అవసరాల ధరలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. అంచనాల ప్రకారం, క్రూడ్ ఆయిల్ ధరలు ప్రతి బ్యారెల్‌కు 10 డాలర్లు పెరిగితే ద్రవ్యోల్బణం సుమారు 0.60 శాతం వరకు పెరుగుతుంది. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన సంక్షోభం తరువాత క్రూడ్ ధరలు 60 డాలర్ల నుండి 100 డాలర్లకు పైగా పెరిగాయి. అదనంగా, రూపాయి విలువ 4 శాతం కంటే ఎక్కువగా పడిపోవడం దిగుమతుల ఖర్చును పెంచుతోంది. కాగా, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆర్‌బిఐ ప్రధానంగా ద్రవ్యోల్బణ నియంత్రణపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. దేశీయ ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ అనిశ్చితులు ఎగుమతులు మరియు పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. అందువల్ల ఆర్‌బిఐ తన విధానంలో లచీలత్వాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆర్‌బిఐ తన ప్రస్తుత తటస్థ విధాన ధోరణిని కొనసాగించే అవకాశముంది. భవిష్యత్ నిర్ణయాల్లో ద్రవ్యోల్బణ అంచనాలు, ద్రవ్య లభ్యత, ఆర్థిక మార్కెట్ల స్థిరత్వం, రూపాయి మార్పులు, మూలధన ప్రవాహాలు వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. మొత్తం మీద, ఆర్‌బిఐ జాగ్రత్తగా, పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# ఉగ్రవాద మడ్యూల్ బట్టబయలు



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ హ్యాండ్లర్లతో పాటు తీవ్రవాద సంస్థలతో అనుబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఒక ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసులు బయటపెట్టారు. ఈ మాడ్యూల్ యువతను మతపరంగా ఆకర్షించి, తీవ్రవాద భావజాలానికి అనుగుణంగా తీర్చిదిద్దే కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గూఢచారి విభాగం వర్గాలు వెల్లడించాయి. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న అనుమానితులను పట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్, ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలను పంపించారు. మొత్తం డజను మందిని అరెస్ట్ చేయడానికి చర్యలు చేపట్టగా, అందులో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. పోలీసుల సమాచారం ప్రకారం, ప్రధాన నిందితుడు రహమతుల్లా షరీఫ్, అతని అనుచరులు ఆన్‌లైన్ వీడియోల ద్వారా జిహాదీ ప్రచారం చేస్తున్న వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ, యువతను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. మహిళలను కూడా 'ఖవాతీన్' అనే ప్రత్యేక విభాగంలో చేర్చే ప్రయత్నాలు జరిగాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మాడ్యూల్‌కు 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా' (ఐసిస్), అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ వంటి తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ గ్రూప్ విదేశీ హ్యాండ్లర్లతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, తీవ్రవాద కంటెంట్‌ను విస్తృతంగా పంచుకుంది. నిందితులు ఒసామా బిన్ లాడెన్, ఇస్రార్ అహ్మద్ షేక్, జాకిర్ నాయక్, అన్వర్ అల్‌అవ్లాకీ వంటి వ్యక్తుల వీడియోలను షేర్ చేస్తూ ముస్లిం యువతను జిహాద్ వైపు మళ్లించే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దర్యాప్తులో భాగంగా, ఈ గ్రూప్ పాకిస్తాన్, ఆఫ్ఘానిస్తాన్, సిరియా, బంగ్లాదేశ్ దేశాల్లో ఉన్న హ్యాండ్లర్లతో 40కు పైగా సోషల్ మీడియా ఖాతాల ద్వారా సంప్రదింపులు జరిపినట్లు గుర్తించారు. 'హిజ్రత్'ను ప్రోత్సహించడం, భారతదేశంలో ఖిలాఫత్ స్థాపన లక్ష్యంగా పని చేసినట్లు అనుమానిస్తున్నారు. అల్‌హకీమ్ షుకూర్, మహ్మద్ హుజైఫా, నింజా, హేమ్రోక్సీ, అబు ముహారిబ్, అబు బలుషి వంటి హ్యాండ్లర్లు ఈ గ్రూప్‌కు ఆయుధ వినియోగంపై మార్గదర్శనం ఇచ్చినట్లు సమాచారం. కొంతమంది ఇప్పటికే విదేశాల్లోని మదరసాలలో శిక్షణ పొందుతున్నట్లు కూడా తెలుస్తోంది. సయిదా బేగం అనే నిందితురాలు పాకిస్తాన్, జమ్మూ కశ్మీర్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ, జిహాదీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. ఈ గ్రూప్ సైబర్ ఉగ్రవాదానికి సంబంధించిన కంటెంట్‌ను కూడా పంచుకుంటూ, ప్రభుత్వ వెబ్‌సైట్లను హ్యాక్ చేయడానికి యత్నాలు చేసినట్లు అనుమానం వ్యక్తమైంది. విదేశీ నిధుల ప్రవాహంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. అదనంగా, నిందితులు ఐసిస్ జెండాలతో ఫోటోలు తీసుకొని, వన్ ఉమ్మా వంటి నినాదాలు వినిపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లు అధికారులు గుర్తించారు. భారత జాతీయ గీతాన్ని అవమానకరంగా పాడడం, జాతీయ పతాకాన్ని అవమానించే వీడియోలను పంచుకోవడం వంటి చర్యలూ బయటపడ్డాయి. ఇక, నాన్‌బిలీవర్స్‌పై హింసకు ప్రోత్సహించే సందేశాలు, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైసెస్ (ఐఇడిఎస్) తయారీకి సంబంధించిన సమాచారం కూడా ఈ గ్రూప్ పంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా, ఈ మాడ్యూల్ దేశ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉన్నందున దర్యాప్తు సంస్థలు విస్తృత స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నాయి.

# పశ్చిమ బెంగాల్‌లో 'జంగిల్ రాజ్'

### ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ



**కూచ్ బిహార్:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మాల్దా ఘటనను ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. న్యాయాధికారులను అక్కడ కొంత మంది నిర్బంధించడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. సుప్రీం కోర్టు కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ, సిబిఐ లేదా ఇతర సంస్థలతో దర్యాప్తు జరిపించాలని సూచించింది. అంతేగాక, ఈ దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. కాగా, కూచ్ బిహార్‌లో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన ప్రధాని మోదీ ఈ ఘటనను ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ప్రభుత్వం 'మహా జంగిల్ రాజ్' నడుపుతోందని ఆరోపించారు. టిఎంసి పాలనలో భయం వ్యాపిస్తుండగా, బిజెపి మాత్రం ప్రజలకు నమ్మకాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. మాల్దాలో ఇటీవల జరిగిన ఘటనలో, ఎన్నికల జాబితా సవరణ సమయంలో న్యాయాధికారులను గంటల తరబడి ముట్టడి చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల భద్రత ఎలా ఉంటుంది? అని ప్రశ్నించారు. ఈ ఘటనను టిఎంసి పాలనలో చట్టవ్యవస్థ పూర్తిగా క్షీణించిందనే ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. అదనంగా, మహిళల భద్రత, అక్రమ చొరబాటు, జనాభా మార్పులు వంటి అంశాలను కూడా ప్రస్తావిస్తూ టిఎంసిపై విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాటు పెరుగుతోందని, ఇది రాష్ట్ర ప్రజల భద్రతకు ముప్పుగా మారుతోందని ఆరోపించారు. అలాగే ఎన్నికల జాబితా సవరణ (సర్), పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై టిఎంసి వైఖరిని విమర్శిస్తూ, హిందూ శరణార్థులకు పౌరసత్వం ఇవ్వకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను మోదీ మంచీచెడు మధ్య జరిగే పోరుగా పేర్కొన్నారు. టిఎంసి భయం, అవినీతి, కట్ మనీ సంస్కృతిని పెంపొందిస్తుండగా, బిజెపి అభివృద్ధి, భద్రత, విశ్వాసం కలిగిస్తున్నదని అన్నారు. ఎన్నికల రోజున ఎలాంటి భయాలకు లోనుకాకుండా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, స్వేచ్ఛా, నిష్పక్షపాత ఎన్నికలు జరుగుతాయని మోదీ ఆకాంక్షించారు. ఎన్నికల ఫలితాల తరువాత టిఎంసి పాలనలో జరిగిన అవినీతి, హింసపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రతపై దృష్టి సారిస్తూ, సాండేశ్‌ఖాలి ఘటనలను ప్రస్తావించి, బిజెపి ప్రభుత్వం వస్తే మహిళలకు గౌరవం, భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### 'సర్'కు వ్యతిరేకంగా

# ఓటు వేయండి

### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపు



**ముర్షిదాబాద్:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ప్రక్రియలో అనేక మంది ఓటర్ల పేర్లను తొలగించారని, ప్రజలు దీనికి ప్రతిస్పందనగా ఎన్నికల్లో తమ ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే పేర్లు తొలగించబడిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ముర్షిదాబాద్‌లో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన ఆమె, కేంద్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా బాధ్యులుగా విమర్శిస్తూ, ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. బూత్ ఏజెంట్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, అవి సరిగా పనిచేయకపోతే వెంటనే కొత్త యంత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కార్యకర్తలకు చెప్పారు. ముస్లింల ప్రయోజనాల కోసం తాను పోరాడుతున్నానని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలుస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. ఈ అంశంపై బిజెపి తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ముర్షిదాబాద్‌లో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రస్తావిస్తూ, వాటికి తమ పార్టీ కారణమని వచ్చిన ఆరోపణలను ఖండించారు. టిఎంసి పాలనలో మైనారిటీలు, ఎస్‌సి, ఎస్‌టి యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని ఆమె పేర్కొన్నారు. అలాగే మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలు కొనసాగుతాయని, నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఎన్నికల ఓటర్ల జాబితానే ఈసారి ఎందుకు ఉపయోగించలేదని ప్రశ్నించారు. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగగా, మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. అన్ని పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి.

# కేరళలో అక్రమంగా బిజెపి కిట్‌ల పంపిణీ



**త్రిస్సూర్:** కేరళ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో త్రిశూర్ జిల్లాలో బిజెపి అక్రమంగా కిట్‌ల పంపిణీ చేస్తున్నదన్న ఆరోపణలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికలకు ముందు, మనలూరు నియోజకవర్గంలోని వడనప్పల్లి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బిజెపి కార్యకర్తలు యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్), లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ కార్యకర్తలు ఒక గోదాంను ముట్టడి చేసి, అక్కడ కిట్‌లు తయారు చేసి పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో గోదాంలో ఉన్న స్థానిక బిజెపి నాయకుడు, నటుడు దేవన్‌ను బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. యుడిఎఫ్ అభ్యర్థి టిఎన్ ప్రతాపన్ అక్కడికి చేరుకుని, సుమారు 4,000 కిట్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, ఇంకా 10,000 కిట్‌ల తయారీకి సరిపడా సామగ్రి ఉందని ఆరోపించారు. ఆయన గోదాంను స్వాధీనం చేసుకోవాలని, లోపల ఉన్న బిజెపి నాయకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌డిఎఫ్ కార్యకర్తలు కూడా ఇలాంటి డిమాండ్లే చేశారు. ఈ పరిస్థితిలో బిజెపి కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పోలీసులు అక్కడికి చేరుకున్నప్పటికీ, యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ కార్యకర్తలను చెదరగొట్టడం కష్టమైంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు కేంద్ర బలగాలను కూడా మోహరింపచేశారు. ఈలోగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఇసిఐ) అధికారులు గోదాంలో తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, ఎన్నికల సంఘం ఏప్రిల్ 4న త్రిశూర్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా గృహోపకరణ కిట్‌ల పంపిణీపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఓలారి పార్థసారథి దేవాలయం సమీపంలో, అదే విధంగా కార్తిక సూపర్ మార్కెట్ వద్ద అనధికారికంగా కిట్‌ల పంపిణీ జరుగుతుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అడ్డుకుంది. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.900గా ఉండవచ్చని అంచనా. ఇప్పటివరకు 75 కిట్‌లు పంపిణీ అయినట్లు గుర్తించారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి బిజెపి ఆహార కిట్‌లు, మద్యం కూపన్లు పంపిణీ చేస్తున్నట్టు యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ నాయకులు ఆరోపించారు. అయితే బిజెపి అభ్యర్థి పద్మజా వేణుగోపాల్ ఈ ఆరోపణలను ఖండించారు. రాజకీయ దురుద్దేశంతోనే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆమె ప్రత్యారోపణలకు దిగారు.

# నకిలీ ఔషధ తయారీ ముఠా గుట్టురట్టు



**న్యూఢిల్లీ:** నకిలీ ఔషధాలు, ప్రత్యేకించి ప్రాణరక్షక ఔషధాల తయారీ, సరఫరాలో నిమగ్నమైన ఒక అంతర్రాష్ట్ర ముఠాను ఢిల్లీ పోలీసులు బయటపెట్టారు. ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో సుమారు రూ.2 కోట్ల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, ఈ అక్రమ వ్యాపారానికి మద్దతుగా పనిచేసిన నకిలీ జిఎస్‌టి సంస్థల నెట్‌వర్క్‌ను కూడా పోలీసులు బహిర్గతం చేశారు. దర్యాప్తు ప్రకారం, ఈ నెట్‌వర్క్ ద్వారా సుమారు రూ.50 కోట్ల వరకు బోగస్ బిల్లింగ్ జరిగినట్లు అంచనా. ఈ ముఠా ప్రధానంగా డయాబెటిస్, రక్తపోటు, కాలేయ వ్యాధులు వంటి సమస్యలకు ఉపయోగించే షెడ్యూల్ 'హెచ్' ఔషధాలను నకిలీగా తయారు చేసి పంపిణీ చేసింది. ఇవి ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. నిందితుల్లో నిఖిల్ అరోరా అలియాస్ సన్నీ (ఢిల్లీ), శివమ్ త్యాగి, మయాంక్ అగర్వాల్ (ఉత్తరప్రదేశ్), మోహిత్ కుమార్ శర్మ (ఉత్తరాఖండ్), అలాగే షారూఖ్, రాహుల్ ఉన్నారు. వీరిలో చివరి ఇద్దరు నకిలీ జిఎస్‌టి కంపెనీల ద్వారా బోగస్ బిల్లులు తయారు చేసి డబ్బు మళ్లింపులో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు. షాహదరాలోని బిహారి కాలనీలో మార్చి 11న దాడి నిర్వహించగా, 1.2 లక్షలకుపైగా నకిలీ మాత్రలు, క్యాప్సూల్స్ స్వాధీనం అయ్యాయి. రాబెమాక్ డిఎస్ఆర్, టెల్మా ఎఎం, గ్లూకోనార్మ్ వంటి ప్రసిద్ధ మందులతోపాటు నకిలీ కరెన్సీ కూడా లభించింది. ఈ ఔషధాలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తరచుగా వాడేవి కావడంతో ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో, నిందితులు నకిలీ జిఎస్‌టి సంస్థల పేరుతో బిల్లులు తయారు చేసి అసలు వ్యాపారాన్ని దాచిపెట్టినట్లు తెలిసింది. ఈ షెల్ కంపెనీలు కేవలం కాగితాల పైనే ఉండి, పన్ను తనిఖీలను తప్పించుకోవడానికి ఉపయోగపడ్డాయి. ఇంకా, ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో అక్రమ ఔషధ తయారీ యూనిట్‌ను పోలీసులు గుర్తించారు. అక్కడ మెట్ఫార్మిన్, కాల్షియం కార్బోనేట్ వంటి ముడి పదార్థాలు, ఆధునిక యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ అక్దాస్ సిద్ధిఖీ పరారీలో ఉన్నాడు. మొత్తం కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

### హిమాంత భార్యకు

# మూడు దేశాల పాస్‌పోర్టులు!

### కాంగ్రెస్ ఆరోపణలతో రాజకీయ వేడి

**న్యూఢిల్లీ:** అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వ శర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, అలాగే విదేశాల్లో ఆస్తులను దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు రాజకీయ వేడిని రగిల్చాయి. ఈ ఆరోపణలను శర్మ ఖండించారు. ఇవి దురుద్దేశపూరితమైనవి, కల్పితమైనవని పేర్కొన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేసిన వారిపై 48 గంటల్లో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ తరఫున పవన్ ఖేరా ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొన్ని పత్రాలను చూపిస్తూ ఈ ఆరోపణలు చేశారు. శర్మ భార్య రినికీ భుయాన్ శర్మకు యూఏఈ, ఆంటిగ్వాబార్బుడా, ఈజిప్ట్ దేశాలకు చెందిన మూడు పాస్‌పోర్టులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదనంగా, దుబాయ్‌లో రెండు ఆస్తులు ఉన్నప్పటికీ ఎన్నికల అఫిడవిట్‌లో వాటిని వెల్లడించలేదని ఆరోపించారు. ఇంకా, అమెరికాలోని వైయోమింగ్ రాష్ట్రంలో ఒక కంపెనీ ద్వారా డబ్బులు దాచిపెట్టారని కూడా ఆరోపించారు. ఈ అంశాలపై విచారణ జరిపి, అవసరమైతే సర్మా నామినేషన్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను శర్మ తీవ్రంగా ఖండిస్తూ, ఇవి రాజకీయ ప్రేరణతో చేసిన అబద్ధాలేనని అన్నారు. అస్సాంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నిరాశతో ఇలాంటి ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. తన భార్యతో కలిసి పావన్ ఖేరాపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తామని తెలిపారు. ఇక రినికీ భుయాన్ శర్మ కూడా ఈ ఆరోపణలను ఖండిస్తూ, తప్పుడు పత్రాలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె కూడా ప్రకటించారు. కాగా, ఈ వివాదం ఎన్నికల సమయంలో రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది. రెండు ప్రధాన పార్టీల మధ్య ఆరోపణలు, ప్రతిఆరోపణలు తీవ్రమవుతున్నాయి. నిజానిజాలు కోర్టు ద్వారా వెలుగులోకి వస్తాయని సర్మా విశ్వాసం వ్యక్తం చేశారు.

# పని ప్రదేశాల్లో అంతరాలు..

**న్యూఢిల్లీ:** భారతదేశంలో పనిచేస్తున్న ఉద్యోగులలో 86 శాతం మంది పని ప్రదేశంలో గణనీయమైన మార్పులు, అంతరాయాలను ఎదుర్కొన్నారని, ఇది ప్రపంచ సగటుతో పోలిస్తే ఎక్కువని తాజా నివేదిక వెల్లడించింది. అదే సమయంలో, నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటికి ధృవీకరణ పొందడం వైపు భారతీయ ఉద్యోగులు మరింతగా దృష్టి సారిస్తున్నారని కూడా ఈ అధ్యయనం సూచిస్తోంది. ప్రిన్స్‌టన్ కేంద్రంగా పనిచేసే ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ సంస్థ రూపొందించిన ఈ నివేదికలో, భారతీయ ఉద్యోగ వర్గం సాంకేతిక మార్పులు, ఉద్యోగ బాధ్యతల పరిణామం, పని తీరు అంచనాలలో వేగంగా జరుగుతున్న మార్పులను ఎలా ఎదుర్కొంటుందో విశ్లేషించారు. ప్రస్తుతం ఉద్యోగ స్థిరత్వాన్ని సాధించాలంటే నిరంతరం కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వాటిని ప్రదర్శించడం అవసరమని ఎక్కువ మంది నిపుణులు భావిస్తున్నారని నివేదిక చెబుతోంది. గత ఏడాది కాలంలో భారతదేశంలో 86 శాతం మంది ఉద్యోగులు పని ప్రదేశంలో ప్రధాన మార్పులను అనుభవించగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సంఖ్య 67 శాతం మాత్రమే నమోదైంది. ఈ గణాంకాలు భారతీయ ఉద్యోగ వాతావరణంలో మార్పులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నాయి. నివేదిక ప్రకారం, భారతదేశంలో ఉద్యోగ రంగంలో మార్పులు ఒక ముఖ్య లక్షణంగా మారుతున్నాయి. ఉద్యోగులు కొత్త సాధనాలను అలవాటు చేసుకోవడం, మారుతున్న బాధ్యతలకు తగిన విధంగా తమ పాత్రలను మార్చుకోవడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటున్నారు. అదే సమయంలో తమ నైపుణ్యాలను కొలిచే, ధ్రువీకరించే విశ్వసనీయ విధానాల అవసరం కూడా పెరుగుతోంది. ఉద్యోగ మార్కెట్లు మరింత చురుకుగా మారుతున్న సమయంలో, కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం వేగంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అన్ని రంగాల నిపుణులు నిరంతర అభ్యాసం, ధ్రువీకరించిన అర్హతలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. పోటీ ప్రపంచంలో నిలబడటానికి ఇది అవసరమని వారు భావిస్తున్నారు. ఈ నివేదికలోని విశ్లేషణ ప్రకారం, పని ప్రదేశంలో మార్పులు వేగంగా పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని అనేక మంది ఉద్యోగులు తమను తాము మార్పులకు అనుగుణంగా మార్చుకోగల సామర్థ్యం ఉన్నదనే నమ్మకంతో ఉన్నారు. ఇది ఒకవైపు ఒత్తిడిని సూచిస్తే, మరోవైపు భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న ఉత్సాహాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. 2026 హ్యూమన్ ప్రోగ్రెస్ నివేదిక 18 దేశాల్లోని 32,000 మందికి పైగా ఉద్యోగుల అభిప్రాయాల ఆధారంగా రూపొందింది. ఇది ఇప్పటివరకు రూపొందించిన నివేదికల్లో అతి పెద్ద డేటా సెట్‌గా గుర్తింపు పొందింది. ఈ అధ్యయనం సాంకేతిక మార్పులు, ఉద్యోగ వాతావరణ మార్పుల మధ్య ఉద్యోగుల అనుభవాలను ప్రతిబింబిస్తూ, నైపుణ్య సిద్ధత, ధ్రువీకరణ అవకాశాలు, అనుకూలన సామర్థ్యాలపై సమగ్ర అవగాహనను అందిస్తుంది. ఈ నేపథ్యంలో, ఉద్యోగులు భవిష్యత్ ఉద్యోగాలను స్పష్టంగా ఊహించలేకపోయినా, ఐదుగురిలో నలుగురు కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నారని సంస్థ సిఇఒ అమిత్ సేవాక్ తెలిపారు. అనుకూలన సామర్థ్యం ఇప్పుడు అత్యవసర నైపుణ్యంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నివేదికలో ఎఐ వినియోగం భారతదేశంలో వేగంగా పెరుగుతోందని కూడా వెల్లడైంది. ప్రస్తుతం ఉద్యోగులు తమ పనిలో 42 శాతం వరకు ఎఐ సాధనాలను ఉపయోగిస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఇది ప్రపంచ సగటుతో పోలిస్తే ఎక్కువ. ఈ పరిణామం ఉద్యోగ పాత్రలను, పనితీరు అంచనాలను గణనీయంగా ప్రభావితం చేస్తోంది. ఈ మార్పుల వల్ల ఉద్యోగులు నిరంతరం కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతున్నది. అదే సమయంలో నైపుణ్యాలను అధికారికంగా ధ్రువీకరించే విధానాలపై డిమాండ్ సైతం పెరుగుతోంది. పది మందిలో తొమ్మిది మంది ఉద్యోగులు ధ్రువీకరించిన అర్హతలు అవసరమని భావిస్తున్నారు. పరిశ్రమలోని ఇతరులతో తమ సామర్థ్యాలను పోల్చుకోవాలనే ఆసక్తి కూడా ఎక్కువగా కనిపిస్తోంది. కెరీర్ మార్గాలు అనిశ్చితంగా మారుతున్న నేపథ్యంలో, నైపుణ్యాలకు సంబంధించిన ఆధారాలు వృత్తి పురోగతికి, దీర్ఘకాల ప్రాముఖ్యతకు కీలకంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ఉద్యోగులు ఎఐ ప్రభావంతో వస్తున్న పని విధానాల్లో మార్పును ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగదాతలు, విద్యా సంస్థలు, విధాన నిర్ణేతలు స్పష్టమైన ప్రమాణాలు, విశ్వసనీయ నైపుణ్య అంచనా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం పెరుగుతోంది.

# కొత్త వాదనలు.. అభ్యుదయ భావనలు


సాహిత్యం నిరంతరం ఒకే రీతిలో ప్రవహించే శాంత గోదావరిలా ఉండదు... చాలా సందర్భాల్లో ఉరకలు వేస్తూ, గట్టులు తెంచుకుంటూ, అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగిపోతుంది. 'మనుషులు వస్తుంటారు... పోతుంటారు.. నేను మాత్రం ఇలా నిరంతరం ప్రవహిస్తునే ఉంటాను' (మెన్ మె కమ్ అండ్ మెన్ మె గో.. బట్ ఐ గో ఆన్ ఫరెవర్) అంటాడు లార్డ్ టెన్నిస్ 'ది బ్రూక్' కవితలో. అభ్యుదయ భావనలకు, ప్రగతిశీల సాహిత్యానికి దీనిని అన్వయించుకోవచ్చు. ఈ కాలంలో అభ్యుదయ రచనలు రావడం లేదనే అభిప్రాయం కొంత మందిలో ఉండవచ్చు. ఒక కోణంలో ఇది నిజమే. కానీ, పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు. పుస్తకరూపాన్ని సంతరించుకుంటున్న కవిత్వం తగ్గినప్పటికీ, ఇతరత్రా రూపాల్లో ఆ ప్రవాహం కొనసాగుతునే ఉంది. ప్రత్యేకించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా కనిపిస్తున్నది. ఆన్‌లైన్ వేదికల ద్వారా తెలుగు సాహిత్యం దేశాల హరిహద్దులు దాటుతున్నది. విప్లవ, మానవతా భావాలు ప్రాంతీయ పరిమితులు దాటిన 'సార్వత్రిక' రూపాన్ని సంతరించుకున్నాయి. పాత సమస్యలకు కొత్త భాషలో, కొత్త మాధ్యమాల్లో సమాధానం చెబుతున్నారు. స్త్రీవాదం, లైంగిక వాదం, స్వలింగ సంపర్కుల హక్కులు, పర్యావరణ న్యాయం, డిజిటల్ హక్కులు వంటి కొత్త అంశాలు తెరపైకి వచ్చాయి. అన్నిటి వెనుకా అభ్యుదయ కోణం ఉంది. అంటే, పాత కాలపు రచయితల విప్లవ ఆలోచనలు మార్గం మార్చుకున్నాయేగానీ, దిశ మార్చుకోలేదు. ప్రజా చైతన్యం, సమానత్వం, అన్యాయానికి వ్యతిరేక పోరాట స్ఫూర్తినిచ్చే సాహిత్యం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. గతం కంటే మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళుతున్నది. ఒక అభ్యుదయ రచయిత కేవలం పుస్తకాలను, కవితలను, వ్యాసాలను రాయడం మాత్రమే కాదు.. సమాజానికి ఒక కొత్త అద్దం చూపిస్తాడు. అందులో కనిపించే నిజం అందరికీ నచ్చకపోవచ్చు. కానీ, అతను మాత్రం వాస్తవాన్ని తెలియచేయడం తన ధర్మంగా భావిస్తాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయోజనాలు పొందుతున్న వర్గాలకు లేదా సంప్రదాయాలను అఘుటితంగా కాపాడుకోవాలనుకునే వర్గాలకు ఇలాంటి రచనలు సవాళ్లు విసురుతుంటాయి. అందుకే, ప్రతి అభ్యుదయ రచయిత తన ప్రయాణంలో అనేక రకాల ప్రతిఘటనలను ఎదుర్కొంటాడు. సనాతన సంస్కృతి, ఆచారాలను అనుసరిచేవారికి అభ్యుదయ రచన ఒక సవాలు. అందుకే, సనాతన వాదులు అభ్యుదయ సాహిత్యాన్ని దేశ, ధర్మ మూలాలను ధ్వంసం చేసే రచనలుగా పేర్కొంటారు. మహిళల అభ్యున్నతిని కోరుకున్న చలం రచనలను 'విశృంఖలత్వం'గా ఎంతో మంది అభివర్ణించారు. చాలా వరకు సమకాలీన రాజకీయ రంగం కూడా, సాహిత్యంలో అభ్యుదయ కోణాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. అభ్యుదయ రచయిత సమాజంలోని అన్యాయాన్ని బయటపెట్టేటప్పుడు రాజకీయ వ్యవస్థను కూడా విమర్శిస్తాడు. కొరడాతో కొట్టినట్టు నిలదీసి ప్రశ్నిస్తాడు. అందుకే, అధికారంలో ఉన్న వారికి అసౌకర్యం కలిగించే వచనాలు, కవితలు రాస్తే, ఆ పుస్తకాలపై నిషేధాలు... ఆవిష్కరణ సభలకు అడ్డంకులు... వ్యక్తిగత వేధింపులు. సమాజాన్ని హింసవైపు ప్రేరేపించేవి ఉన్నాయన్న ముద్రలు. నాటకాలు, సినిమాలు కూడా ఇలాంటి ఒత్తిళ్లు.. అణచివేతలనే ఎదుర్కొంటాయి. చాలా సందర్భాల్లో, ప్రగతిశీల భావజాలంతో నిర్మించిన సినిమాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను లేదా సంభాషణలను మార్చాలని సెన్సార్ బోర్డు సూచిస్తుంది. దీనితో వాస్తవ సందేశం లేదా మూల సూత్రం వక్రీకృతమవుతుంది. అభ్యుదయ సాహిత్యం ఎప్పుడూ మార్కెట్లో పెద్ద సంఖ్యలో అమ్ముడుపోదనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఈ రకమైన సాహిత్యం వినోదం కోసం కాకుండా, ఆలోచింపజేయడానికి ఉంటుంది. ప్రచురణకర్తలు వీటిని 'ప్రమాదకరం'గా భావించి, పెట్టుబడిని నిరాకరిస్తుంటారు. ఫలితంగా రచయితలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. కొంతమంది రచయితలు తమ సమాజం లేదా కుటుంబం నుంచే బహిష్కణకు గురవుతారు, వ్యక్తిగత సంబంధాలు కోల్పోయి, ఏకాకిగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిణామాలు సహజంగానే అభ్యుదయ రచయితల మానసిక ఒత్తిడికి దారితీస్తుంది. అంతేకాదు, వివాదాస్పదంగా పేర్కొంటూ, ఇలాంటి రచనలపై దూషణ, విద్వేష ప్రేరేపణ, మతభావనలకు భంగం కలిగించడం వంటి నేరాల కింద కేసులు తప్పవు. కొన్నిసార్లు ఇవి సంవత్సరాల తరబడి నడుస్తాయి. సోషల్ మీడియా కాలంలో అభ్యుదయ రచయితల గురించి తప్పుడు ఆరోపణలు, ఎడిటెడ్ వీడియోలు, కంటెంట్‌ను వక్రీకరించి వ్యాప్తి చేయడం సాధారణమైంది. దీని వలన వారి విశ్వసనీయత దెబ్బతింటుంది. ఇన్ని ప్రతిబంధకాల మధ్య అభ్యుదయ రచయిత తన ప్రస్థానాన్ని కొనసాగించాలి. వారి మార్గం ఎప్పుడూ సునాయాసంగా ఉండదు. సంప్రదాయ, రాజకీయ, ఆర్థిక, సామాజిక, చట్టపరమైన దిశల్లో ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. కానీ నిజమైన అభ్యుదయ రచయిత ఈ ప్రతి ఘటనలను తన సంకల్పానికి, తన భావజాలానికి బలాన్నిచ్చే ఇంధనంగా ఉపయోగించుకుంటాడు. ప్రతి ఘటనలే ఆలోచనలకు మరింత పదును పెడతాయి. అభ్యుదయ రచయితను సాహిత్య సృష్టికర్త కోణానికి పరిమితం చేయడం తప్పు. అతను ఒక సమాజ శిల్పి. అతని ఆలోచనలు అక్షర రూపాన్ని దాల్చుకొని, సాహిత్య స్రవంతి గా మారి, సమాజాన్ని కదిలించగల శక్తిగా మారతాయి. కాలం ఏదైనా, పరిస్థితులు ఏవైనా, ప్రతీ ఒక్క కాలంలో నూ మార్పులకు ప్రధాన కారకం సాహిత్యమే. పాత వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడం, కొత్త మార్గాలను సూచించడం కూడా ప్రగతిశీల అభ్యుదయ రచయిత కర్తవ్యాలు. అంటే, ఒక రచయిత ఏకకాలంలో విమర్శకుడు, మార్గదర్శి పాత్రలు కూడా పోషించాలి. వీధి నాటకాలు లేదా పాటలు, నవలలు లేదా కథానికలు, జానపదాలు లేదా నేటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్.. రూపం ఏదైనప్పటికీ, అభ్యుదయ రచయిత సాహిత్యాన్ని పుస్తకాల గడపల్లో వదిలిపెట్టకుండా, ప్రజల మధ్యకి తీసుకువెళతాడు. ఎప్పుడైతే సాహిత్యం ప్రజలకు అందుబాటులోకి వస్తుందో, అప్పుడు అది పెద్ద ప్రభావాన్నే చూపుతుంది. భావజాలాలు మారుతాయి. రాజకీయ పరిస్థితులు రూపాంతరం చెందుతాయి. కొన్ని సందర్భాల్లో సామాజిక సమస్యల స్వరూపం మారవచ్చు కానీ, సమానత్వం, న్యాయం, మానవత అనే మౌలిక విలువల అవసరం ఎప్పటికీ తగ్గదు. కాబట్టే అభ్యుదయ, ప్రగతిశీల రచయితల సాహిత్యం ఎప్పుడూ సమకాలీనమే. ప్రతిఘటనలతో పాటు అభ్యుదయ భావజాలాలు మరింత బలంగా, మరింత ప్రాచుర్యంలోకి వస్తాయని చరిత్ర చెబుతుంది. ఎదురైన సవాళ్లు ఎప్పుడూ రచయిత సమాజ మార్పు సంకల్పానికి మరింత బలమైన పునాదులు వేస్తాయి. అభ్యుదయ రచయిత అంటే కొత్త ఆలోచనల ప్రేరేపకుడు.... బడుగుల తరపున నిలబడి ప్రశ్నించే నాయకుడు.... భవిష్యత్ సమాజానికి మార్గదర్శకుడు. అతని భావజాలం సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలో నిరంతరం ప్రవహిస్తునే ఉంటుంది. అభ్యుదయ భావాలు కలిగిన రచయిత సమాజంలో మార్పుకు మార్గదర్శి. అతని కలం ఆచలోనా శక్తులను నింపుతూ, మనసులను కదుపుతూ, కలకాలం నిలిచిపోయే సాహిత్యాన్ని సృష్టిస్తుంది. సమానత్వ విత్తనం వేస్తుంది. అన్యాయంపై నిరసన జ్వాల వెలిగిస్తుంది. భవిష్యత్తు పట్ల ఆశను పెంచుతుంది. సమకాలీన పరిస్థితుల్లో సాహిత్యానికి విప్లవవాత్మక రూపాన్ని కల్పిస్తుంది. అభ్యుదయ రచయితలు ఎదుర్కొనే సవాళ్లు, సమస్యలు సామాన్యమైనవేమీ కాదు... కానీ, వాటి వల్లే వారి భావజాలం మరింత పదును పుచ్చుకుంది. మరింత విస్తృతమవుతుంది. నేటి అత్యాధునిక సాంకేతిక విప్లవ సమాజంలోనూ, డిజిటల్ ప్లాట్ఫార్ములు, సినిమాలు, విద్యా వ్యవస్థ, సామాజిక ఉద్యమాల రూపంలో అభ్యుదయ భావాలు ప్రతిధ్వనిస్తునే ఉన్నాయి. ఎన్నికాలాలు గడిచినా, నిజమైన మానవతా దృక్కోణం ఎప్పటికీ పాతబడదని నిరూపిస్తునే ఉంటాయి. మాట మార్పును తీసుకురాగలుగుతుంది.. ఆలోచనలు మారుస్తుంది... విప్లవాన్ని సృష్టిస్తుంది. ఆ మాటల మాంత్రికుడే రచయిత. ఆ రచయితే అభ్యుదయ భావాలు వెదజల్లితే, అతను సృజించే సాహిత్యం నిత్యనూతనంగా ఉంటుంది. వెలుగుబాట చూపిస్తుంది.

— సత్యశ్రీ



## 'ది సీక్రెట్ ఆఫ్ ది ఓల్డ్ క్లాక్'

అమెరికాలో అత్యంత ప్రసిద్ధమైన బాల–యువ మిస్టరీ నవలలలో ఒకటి 'ది సీక్రెట్ ఆఫ్ ది ఓల్డ్ క్లాక్'. ఇది 'న్యాన్సీ డ్రూ' సిరీస్‌లోని మొదటి పుస్తకం. పబ్లిక్ డొమైన్‌లో చేరిన ఈ నవల 1930లో ప్రచురించబడింది. రచయితగా పేరు కనిపించినా, నిజానికి దీనిని మిల్డ్రెడ బెన్సన్ అనే రచయిత్రి క్యారొలిన్ కీన్ అనే కలం పేరుతో రచించారు. ఈ కథలో ప్రధాన పాత్ర న్యాన్సీ డ్రూ— 18 ఏళ్ల తెలివైన, ధైర్యవంతమైన యువతి. ఆమె తండ్రి ఒక న్యాయవాది. తండ్రి నుంచి వచ్చిన తార్కిక ఆలోచన, సమస్యలను ఛేదించే నైపుణ్యం న్యాన్సీకి సహజంగానే ఉంటుంది. న్యాన్సీ డ్రూ ఒక పాత ఇంట్లో నివసిస్తున్న టర్నర్ కుటుంబం పరిస్థితిని గమనిస్తుంది. ఆ కుటుంబానికి చెందాల్సిన ఆస్తి, డబ్బు వారసత్వంగా రావాలి. కానీ ఆ వీలునామా ఎక్కడో కనిపించకుండా పోతుంది. అదే సమయంలో, ఆ ఆస్తిని అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న టాప్హామ్ కుటుంబం కూడా రంగంలోకి దిగుతుంది. నిజమైన వీలునామా దొరకకపోతే, నిరపరాధులైన టర్నర్ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉంటుంది. న్యాన్సీ ఈ అన్యాయాన్ని సహించలేక, స్వయంగా దర్యాప్తు ప్రారంభిస్తుంది. ఆమె పాత ఇళ్లు, అటిక్‌లు, పత్రాలు, రహస్య సంకేతాలు పరిశీలిస్తూ ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో ఆమెకు ఒక ముఖ్యమైన సంకేతం లభిస్తుంది. అదే పాత గడియారం (ఓల్డ్ క్లాక్). ఆ గడియారం లోపలే దాచిపెట్టిన రహస్యం చివరకు కనిపించకుండా పోయిన వీలునామాకు దారి తీస్తుంది. న్యాన్సీ తన తెలివితేటలు, ధైర్యంతో నిజాన్ని వెలికి తీయడంతో, టర్నర్ కుటుంబానికి న్యాయం జరుగుతుంది. న్యాయం, నైతికత, బలహీనుల పక్షాన నిలబడడం, తార్కిక ఆలోచన, ఆధారాలతో సమస్య పరిష్కారం వంటి అంశాలు ఈ పుస్తకంలో ప్రధానంగా కనిపిస్తాయి. అప్పటి కాలానికి మించిన ధైర్యమైన యువతి పాత్ర స్త్రీ సాధికారతకు దర్పణం. అనేకానేక మలుపులు, రహస్యాలు, సంకేతాలు పాఠకుల్లో ఆసక్తిని పెంచుతాయి. 'న్యాన్సీ డ్రూ సిరీస్'కు పునాది వేసిన ఈ పుసతకం, 20వ శతాబ్ద ప్రారంభంలోనే స్వతంత్ర యువతి పాత్రను పరిచయం చేసింది. బాల సాహిత్యంలో మిస్టరీ జానర్‌ను ప్రజాదరణ తెచ్చిపెట్టింది. 'ది సీక్రెట్ ఆఫ్ ది ఓల్డ్ క్లాక్' కేవలం రహస్య కథ మాత్రమే కాదు. ఇది తెలివితేటలు, ధైర్యం, న్యాయ భావన కలిసిన ఒక స్ఫూర్తిదాయకమైన కథ. ఈ పుస్తకం న్యాన్సీ డ్రూను ఒక పాత్రగా మాత్రమే కాకుండా, యువతకు ఆదర్శంగా నిలిపింది.




## భవిష్యత్తును కలలుగా మలిచిన మేధావి


ఇరవయ్యో శతాబ్దపు సాహిత్య చరిత్రలో కొన్ని పేర్లు మాత్రమే కాలాన్ని దాటి నిలిచాయి. అవి తమ కాలాన్ని మాత్రమే కాదు, రాబోయే తరాల ఊహలను కూడా ఆకారమిచ్చాయి. అటువంటి అరుదైన మేధావుల్లో ఒకడు ఐజాక్ అసిమోవ్ 2 జనవరి 1920 –6 ఏప్రిల్ 1992). అతడు కేవలం సైన్స్ ఫిక్షన్ రచయిత కాదు.. శాస్త్రాన్ని కథగా, కథను ఆలోచనగా, ఆలోచనను మానవ భవిష్యత్తుగా మలిచిన విశిష్ట వ్యక్తి. అసిమోవ్ ప్రపంచానికి రోబోట్లు కేవలం యంత్రాలు కాదని నేర్పాడు. అవి నైతికత కలిగిన మేధస్సులుగా ఉండగలవని చూపించాడు. సామ్రాజ్యాల పతనం కేవలం రాజకీయ ఘటన కాదని, అది మానవ మేధస్సు లోపాల ప్రతిబింబమని వివరించాడు. విజ్ఞాన శాస్త్రం కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాదని, అది మానవ జీవితానికే దిశానిర్దేశం చేయగలదని చెప్పాడు. పేదరికంలో పుట్టి, కలల ప్రపంచంలో పెరిగిన అసిమోవ్‌ది, అప్పటి సోవియట్ యూనియన్‌కు చెందిన పెట్రోవిచి అనే గ్రామం. యూదు కుటుంబంలో పుట్టిన అతడి బాల్యం రాజకీయ అశాంతి, ఆర్థిక కష్టాలతో నిండిన కాలంలో సాగింది. అతడికి ప్రపంచం మొదట చూపించింది దుఃఖాన్ని కాదు...వలసను. మూడేళ్ల వయసులోనే అతడి కుటుంబం అమెరికాకు వలస వచ్చింది. బ్రూక్లిన్‌లోని ఒక చిన్న మిఠాయి దుకాణమే అసిమోవ్‌కు విశ్వవిద్యాలయం. అక్కడ అమ్మే పల్ప్ మ్యాగజైన్‌లే అతని గురువులు. సైన్స్ ఫిక్షన్ పత్రికలు అతడికి కొత్త లోకాలను తెరిచాయి... రాకెట్లు, గ్రహాలు, రోబోట్లు, భవిష్యత్ సమాజాలు. అతడి తండ్రి ఈ పత్రికలను పనికిరావని భావించినా, అసిమోవ్ వాటిలో 'విజ్ఞానం' చూశాడు. అది చదవడమే కాదు.. రాయాలన్న కోరిక అతనిలో నాటుకుంది. పదకొండేళ్ల వయసులోనే కథలు రాయడం ప్రారంభించాడు. అతని బాల్యం ఇతర పిల్లల మాదిరిగా ఆటపాటలతో కాదు, ఊహా ప్రపంచాలతో నిండిపోయింది. అసిమోవ్ జీవితంలో శాస్త్రం ఒక బలమైన పునాది. కొలంబియా విశ్వవిద్యాలయంలో బయోకెమిస్ట్రీ చదివి పిహెచ్‌డి సాధించాడు. శాస్త్రాన్ని లోతుగా అర్థం చేసుకున్న వ్యక్తిగా, అతను సైన్స్ ఫిక్షన్‌కు కొత్త విశ్వసనీయతను ఇచ్చాడు. అతని కథలు కేవలం ఊహలు కాదు.. అవి శాస్త్రీయ తర్కంతో నడిచే భవిష్యత్తులు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నేవీ ప్రయోగశాలలో పనిచేశాడు. అణుబాంబు యుగం, శాస్త్రం చేతుల్లో ఉన్న వినాశక శక్తి – ఇవన్నీ అతని ఆలోచనలను మరింత లోతుగా మార్చాయి. విజ్ఞానం మంచికీ, చెడుకీ సమానంగా ఉపయోగపడగలదని అతను గ్రహించాడు. 1939లో మరూన్డ్ ఆఫ్ వెస్టా అనే కథతో అసిమోవ్ సాహిత్యరంగంలో అడుగుపెట్టాడు. కానీ నిజమైన మైలురాయి 1941లో వచ్చిన 'నైట్‌ఫాల్'. ఒక గ్రహంలో ప్రతి వెయ్యి సంవత్సరాలకు ఒకసారి చీకటి కమ్ముకుంటుంది. ఆ చీకటిని తట్టుకోలేని నాగరికత ఎలా పతనమవుతుందన్న ఇతివృత్తం. సైన్స్ ఫిక్షన్‌ను మానవ మానసికతతో కలిపింది. ఇది సైన్స్ ఫిక్షన్‌ను కేవలం యంత్రాల కథల నుంచి సమాజపు కథలుగా మార్చిన క్షణం. అసిమోవ్ పేరు వినగానే గుర్తుకు వచ్చే రచన 'ఫౌండేషన్ సిరీస్'. ఒక గెలాక్సీ సామ్రాజ్యం పతనమవుతుందని ముందే లెక్కించిన శాస్త్రవేత్త హ్యారీ సెల్డన్, ఆ పతనానంతరం మానవజాతి త్వరగా కోలుకునేందుకు ఫౌండేషన్‌ను స్థాపిస్తాడు. ఇది కేవలం కథ కాదు – ఇది చరిత్ర, రాజకీయం, మానవ మేధస్సు గురించి గొప్ప ఉపమానం. సామ్రాజ్యాలు ఎందుకు కూలిపోతాయి? మానవ అహంకారం, అధికారం, అజ్ఞానం ఎలా నాగరికతలను నాశనం చేస్తాయి? ఈ ప్రశ్నలకు అసిమోవ్ సైన్స్ ఫిక్షన్ రూపంలో సమాధానాలు ఇస్తాడు. 'రోబోటిక్స్' అనే పదాన్ని ప్రపంచానికి ఇచ్చింది అసిమోవే. అంతేకాదు, రోబోట్లు ఎలా ప్రవర్తించాలి అన్నదానికి నైతిక చట్టాలను రూపొందించాడు. 'రోబోట్ మనిషిని గాయపరచకూడదు, మనిషి ఆజ్ఞను పాటించాలి, తన ఉనికిని కాపాడుకోవాలి' అంటూ రోబోట్లకు మూడు నియమాలు విధించాడు. ఈ మూడు చట్టాలు కేవలం కథల కోసం కాదు. ఇవి భవిష్యత్తులో నిజంగా యంత్రాలు మానవ జీవితంలోకి వస్తే పాటించాల్సిన తత్వసూత్రాలుగా మారాయి.ఒక యంత్రం ఆలోచిస్తే, అనుభవిస్తే, ప్రేమిస్తే, అది యంత్రం గానే మిగిలిపోతుందా? లేక మనిషిగా మారుతుందా? అని 'ఐ', 'రోబోట్', 'ది బైసెంటెనియల్ మ్యాన్' లాంటి కథలు ఒక ప్రశ్న వేస్తాయి.. అతడు కల్పిత ప్రపంచాలు సృష్టించి ఉండవచ్చు. అదే సమయంలో, నిజమైన శాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా వివరించాడు. అదే అసిమోవ్ ప్రత్యేకత. స్వయంగా శాస్త్రవేత్త కావడంతో, అతని సైన్స్ ఫిక్షన్ రచనలు వాస్తవానికి చాలా దగ్గరగా ఉండేవి. ఖగోళ శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, చరిత్ర వంటి ఎన్నో అంశాలపై అతను విస్తృతంగా రచనలు చేశాడు. శాస్త్రం భయపడాల్సిన విషయం కాదని, అది ఆసక్తిగా చదవాల్సిన కథ అని అతను నిరూపించాడు. అసిమోవ్ జీవితం సాహిత్యం, శాస్త్రంతో పాటు మానవీయతతో నిండినది. విచిత్రం ఏమిటంటే, ఆలోచనల్లో గ్రహాలను దాటి ప్రయాణించే అసిమోవ్ నిజ జీవితంలో విమాన ప్రయాణాలంటే భయపడేవాడు. ఆలోచనలకు మానసిక హద్దులతో సంబంధం లేదని అతని రచనలు నిరూపిస్తాడు. అసిమోవ్ 1992లో మరణించినా, అతని రచనలు ఇంకా జీవిస్తున్నాయి. భవిష్యత్తు గురించి ఆలోచించడమే కాదు, ఆ భవిష్యత్తుకు మనమే బాధ్యత వహించాలన్న సందేశం అతని రచనల్లో కనిపిస్తుంది. విజ్ఞానం చేతుల్లో ఉన్న శక్తి మానవత్వంతో కలిస్తేనే నాగరికత నిలుస్తుందనేది అతని జీవిత సారం.


నేడు వర్ధంతి

## చదవాల్సిన పుస్తకం

### ఫిక్షన్‌పై ఆసక్తిని పెంచే 'రోబోటిక్ సిరీస్'

అమెరికన్ శాస్త్రకథా రచయిత ఐజాక్ అసిమోవ్ సృష్టించిన 'రోబోట్ సిరీస్' విజ్ఞాన–సాహిత్యంలో ఒక అత్యంత కీలకంగా మారాయి. ఈ సిరీస్ భవిష్యత్తు సాంకేతిక ప్రపంచాన్ని ఊహించింది. మనిషి–యంత్ర సంబంధాలపై గంభీరమైన తాత్విక, నైతిక, మానసిక ప్రశ్నలను కూడా ముందుకు తెస్తుంది. ప్రత్యేకించి 'ది లాస్ ఆఫ్ రోబోటిక్స్' అనే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి, యంత్రాలకు నైతిక నియంత్రణ ఉండాలనే భావనను ప్రజాదరణలోకి తీసుకువచ్చిన రచయితగా అసిమోవ్ ప్రసిద్ధి చెందాడు. శాస్త్రకథల ప్రపంచంలో రోబోట్లను భయంకరమైన యంత్రాలుగా కాకుండా, బుద్ధిమంతమైన సహాయకులుగా చూపించిన తొలి రచయితలలో ఆయన ఒకరు. అందువల్ల ఈ సిరీస్ సైన్స్ ఫిక్షన్‌లోనే కాకుండా సాంకేతికత–నైతికత చర్చల్లో కూడా ప్రాముఖ్యత పొందింది. కాగా, రోబోట్ సిరీస్ ప్రధానంగా రెండు భాగాలుగా విస్తరించింది. మొదటిది చిన్న కథల సమాహారం. రెండవది నవలల సమూహం. చిన్న కథల ద్వారా అసిమోవ్ రోబోట్లకు సంబంధించిన నైతిక సంక్లిష్టతల పరిచయం. నవలలలో మాత్రం ఆ భావనలను సమాజ, రాజకీయ, సాంకేతిక నేపథ్యంతో విస్తరించి చూపిస్తాడు రచయిత. 'ఐ, రోబోట్' అనే కథల సంకలనం ఈ సిరీస్‌కు ప్రథమ ద్వారం లాంటిది. ఇందులో కథలన్నింటిని కలిపే ప్రధాన పాత్ర డాక్టర్ సుసన్ కాల్విన్ అనే రోబోసైకాలజిస్ట్. ఆమె రోబోట్ల ప్రవర్తనను పరిశీలిస్తూ, వాటి మానసిక నిర్మాణాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రతి కథలో ఒక ప్రత్యేక సమస్య కూడా ఉంటుంది. రోబోట్ మూడు నియమాలను అనుసరించేటప్పుడు ఎదురయ్యే తార్కిక గందరగోళమే ప్రధాన సమస్య. అందువల్ల ఈ కథలు ఒక రకంగా 'నైతిక ప్రయోగాల శ్రేణి'లా కనిపిస్తాయి.ఇక రెండవ భాగం ఎలిజా బాలీ అనే డిటెక్టివ్ కథలపై ఆధారపడిన నవలల సమాహారం. ఇందులో ముఖ్యమైనవి 'ది కేవ్స్ ఆఫ్ స్టీల్, ది నెకెడ్ సన్, ది రోబోట్స్ ఆఫ్ డాన్, రోబోట్స్ అండ్ ఎంపైర్'. ఈ నవలలు శాస్త్రకథను డిటెక్టివ్ కథతో మేళవిస్తాయి. ఎలిజా బాలీకి సహాయకుడిగా ఉండే రోబోట్ డేనీల్ ఒలివా అనే పాత్ర కథలకు ప్రత్యేక ఆకర్షణ. మానవ డిటెక్టివ్–రోబోట్ భాగస్వామ్యం ద్వారా అసిమోవ్ విచిత్రమైన మానసిక, సామాజిక ప్రశ్నలను పరిశీలిస్తాడు. రోబోట్ సిరీస్‌లో అత్యంత విశిష్టమైన అంశం 'ప్రపంచ నిర్మాణం'. అసిమోవ్ భవిష్యత్తు భూమిని రెండు విభిన్న సమాజాలుగా చిత్రిస్తాడు. ఒకవైపు భూమిపై జన సాంద్రత అత్యంత ఎక్కువగా ఉన్న మహానగరాలు..ఇవి భూమి ఉపరితలానికి దిగువన ఉన్న భారీ మెట్రో నగరాల్లా ఉంటాయి. మరోవైపు అంతరిక్ష కాలనీలలో నివసించే స్పేసర్లు అనే ధనిక సమాజం ఉంటుంది. వీరు జన సంఖ్య తక్కువగా ఉన్న విశాల గ్రహాలలో నివసిస్తూ అధునాతన సాంకేతిక సౌకర్యాలను ఆస్వాదిస్తారు. భూమిపై ఉన్న ప్రజలు రోబోట్లపై అనుమానంతో ఉంటారు. వారికి రోబోట్లు ఉద్యోగాలను కబళిస్తాయని భయం ఉంటుంది. అయితే స్పేసర్ల ప్రపంచంలో మాత్రం రోబోట్లు సాధారణ జీవన భాగమైపోతాయి. ఈ రెండు సమాజాల మధ్య ఉన్న సాంస్కృతిక వ్యత్యాసం కథలకు గాఢతను ఇస్తుంది. అసిమోవ్ సమాజాన్ని కేవలం సాంకేతిక కోణంలో నే కాకుండా సామాజిక–రాజకీయ కోణంలో కూడా పరిశీలించాడు. రోబోట్ సిరీస్ ప్రధానంగా మూడు నియమాల తాత్విక సంక్లిష్టత చుట్టూ తిరుగుతుంది. ఈ నియమాల ప్రకారం రోబోట్ మానవునికి హాని చేయకూడదు, మానవ ఆజ్ఞలను పాటించాలి, తనను తాను రక్షించుకోవాలి అనేవి. అయితే ఈ నియమాలు పరస్పర విరుద్ధ పరిస్థితుల్లో ఎలా పనిచేస్తాయి? అనే ప్రశ్నే అసిమోవ్ కథలలో ప్రధాన చర్చ. రోబోట్ సిరీస్ కేవలం సాంకేతిక కథల సంకలనం మాదిరి కాకుండా, ఒక మానసిక నవలల సమాహారంగా కనిపిస్తుంది. భూమిపై నివసించే ప్రజలకు బహిరంగ ప్రదేశాలంటే భయం ఉండటం, స్పేసర్లకు మాత్రం జనసమూహాలంటే భయం ఉండటం వంటి విభిన్న మానసిక లక్షణాలను అసిమోవ్ చూపించాడు. ఇది సాంకేతిక పరిణామం మనిషి జీవన విధానాన్ని ఎలా మార్చుతుందో చూపించే ప్రయత్నం. అలాగే రోబోట్లను అసిమోవ్ తరచుగా భావోద్వేగ పరంగా మనుషులకంటే స్థిరమైనవారిగాచిత్రించాడు. రోబోట్స్ కూడా తార్కికంగా ఆలోచిస్తాయని, వ్యక్తిగత అహంకారం లేదా స్వార్థం ఉండదని చెప్తాడు. ఈ నేపథ్యంలో మనుషుల బలహీనతలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు రోబోట్లు నైతికంగా మనుషులకంటే ఉన్నతంగా గోచరిస్తారు. అసిమోవ్ రచనా శైలి చాలా స్పష్టమైనది, సంభాషణలతో నిండినది.




కథలలో పెద్దగా యాక్షన్ సన్నివేశాలు ఉండవు. ఎక్కువగా పాత్రలు పరస్పరం చర్చిస్తూ సమస్యను విశ్లేషిస్తాయి. అందువల్ల కొందరికి ఈ శైలి కొంచెం శుష్కంగా అనిపించవచ్చు. కానీ అదే సమయంలో ఈ శైలి కథలలోని తాత్విక అంశాలను స్పష్టంగా వ్యక్తం చేస్తుంది. అసిమోవ్ కథలు సాధారణంగా ఒక తార్కిక పజిల్ చుట్టూ తిరుగుతాయి. కథ చివర్లో ఆ సమస్యకు ఆశ్చర్యకరమైన పరిష్కారం వస్తుంది. ఈ విధానం డిటెక్టివ్ కథల నిర్మాణాన్ని గుర్తు చేస్తుంది. అందుకే రోబోట్ సిరీస్‌ను సైన్స్ ఫిక్షన్ డిటెక్టివ్ కథలు అని కూడా పిలుస్తారు. రోబోట్ సిరీస్ ముఖ్యమైన లక్షణం దాని 'దూరదృష్టి'. అసిమోవ్ ఈ కథలను దశాబ్దాల క్రితమే రాసినప్పటికీ, ఇప్పటి కృత్రిమ మేధస్సు (ఎఐ) చర్చలతో అవి ఆశ్చర్యకరంగా అనుసంధానమై ఉంటాయి. యంత్రాలకు నైతిక నియంత్రణ అవసరం, ఆల్గోరిథమ్‌లు తీసుకునే నిర్ణయాల బాధ్యత ఎవరిది, మనిషి–యంత్ర సంబంధం ఎలా ఉండాలి వంటి ప్రశ్నలు ఈ రోజు సాంకేతిక ప్రపంచంలో కీలకంగా మారాయి. ఇప్పటి ఎఐ వ్యవస్థలు పూర్తిగా స్వతంత్రంగా పనిచేయకపోయినా, వాటి సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ అసిమోవ్ ఊహించిన సమస్యలు వాస్తవానికి దగ్గరగా కనిపిస్తున్నాయి. అందువల్ల రోబోట్ సిరీస్ చదవడం కొంత ఆసక్తికరంగానూ, కొంత భయానకంగానూ అనిపించవచ్చు. రోబోట్ సిరీస్ విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు పొందింది. అనేక సాహిత్య విమర్శకులు దీనిని సైన్స్ ఫిక్షన్ క్లాసిక్‌గా గుర్తించారు. కథలలో ఉన్న మేధోపరమైన గాఢత, తాత్విక చర్చలు, సామాజిక పరిశీలన విలక్షణంగా ఉంటాయి. ఎంత గొప్పగా రాసినప్పటికీ అసిమోవ్ రచనలపై కొన్ని విమర్శలు లేకపోలేదు. ప్రారంభ కథలలో పాత్రల భావోద్వేగ గాఢత తక్కువగా ఉందని కొందరు అభిప్రాయపడుతారు. కథలలో ఎక్కువగా తార్కిక చర్చలు ఉండటం వల్ల భావోద్వేగ నాటకీయత తగ్గుతుందని కూడా వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ఈ లక్షణాలే అసిమోవ్ రచనకు ప్రత్యేకతను కూడా ఇస్తాయి. ఇది కేవలం భవిష్యత్తు సాంకేతికతను ఊహిస్తుంది. మనిషి నాగరికత భవిష్యత్తు పై ఒక ఆలోచనాత్మక దృష్టిని అందిస్తుంది. సాంకేతిక అభివృద్ధి మనిషి స్వ భావాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? యంత్రాలకు నైతిక పరిమితులు అవసరమా? మనిషి–రోబోట్ సహజీవనం ఎలా ఉండాలి? వంటి ప్రశ్నలకు ఈ సిరీస్ లోతైన చర్చను ప్రారంభిస్తుంది. సాహిత్య పరంగా చూస్తే ఇది ఒక బలమైన కథన నిర్మాణం, మేధోపరమైన చర్చ, ఆసక్తికరమైన ప్రపంచ నిర్మాణం కలయిక. శాస్త్రకథలను ఇష్టపడే పాఠకులకు మాత్రమే కాదు, సాంకేతికత–సమాజ సంబంధంపై ఆసక్తి ఉన్న ఎవరికైనా ఈ సిరీస్ ఒక ముఖ్యమైన పఠన అనుభవంగా నిలుస్తుంది. అందుకే అసిమోవ్ రోబోట్ సిరీస్‌ను చాలా మంది సైన్స్ ఫిక్షన్ పాఠకులకు తప్పనిసరిగా చదవాల్సిన క్లాసిక్‌గా భావిస్తారు. ఇది మనిషి భవిష్యత్తును గురించి ఆలోచింపజేసే, విజ్ఞానాన్ని తాత్వికతతో మేళవించిన అరుదైన సాహిత్య సృష్టిగా నిలిచింది.

**పుస్తకం పేరు**

**'రోబోట్ సిరీస్'**

రచయిత : అసిమోవ్

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

ఈ వారం కవితలు

## యాగ ఫలం

పువ్వుల్ని నలిపితేనే..
సువాసనల సుగంధ ద్రవ్యాలు
ద్రాక్షను క్రష్ చేస్తేనే..
రుచికరమైన మద్యం !

నిమ్మను కోసి పిండితేనే..
ఆరోగ్యకర రసం లభిస్తుంది
పండ్లను కోసి ముక్కలు చేస్తేనే..
తియ్యని రుచుల విందులు !

ఇంధనం మండితేనే..
శక్తి ఊటల వరదలు
బియ్యం ఉడికితేనే..
చేతిలో అన్నం ముద్ద !

నిశ్శబ్దంగా విత్తనం..
పెరిగి పెద్ద వృక్షం అవుతుంది
చెట్టు నరికితే..
భీకర శబ్దంతో కూలుతుంది !

నిశ్శబ్దంగా ఎదగడం..
విస్ఫోటన శబ్దంతో పతనం
మాటల కత్తుల గాయాలు..
మౌనం మానసికోల్లాసం !

చెమట కక్కితేనే
లక్ష్య సాధన సులువు
అడుగు పడితేనే..
గమ్యం దరి చేరును !

కష్టపడితేనే..
సుఖ జీవన అర్హతలు
త్యాగం చేస్తేనే..
యాగ ఫలం సిద్ధిస్తుంది !

– మధుపాళీ
9949700037

## వలల వలయం

డబ్బుల వలలో పడితే
మనసు ముడుచుకుంటుంది
మానవత్వం మసకబారుతుంది
మూల్యాలు మట్టిపాలవుతాయి
మాటల వలలో చిక్కితే
మధురం మాయమవుతుంది
నిజం నీడవుతుంది
నమ్మకం నిశ్శబ్దమవుతుంది

అందాల వలలో అడుగేస్తే
అలజడి అలుముకుంటుంది
బాహ్య కాంతి మాయ చేస్తుంది
అంతరంగం ఆవేదన పడుతుంది
ఆనందాల వలలో మునిగితే
అతిగా అలవాటు అవుతుంది
తాత్కాలిక తేజస్సే మిగులుతుంది
శాశ్వత శాంతి దూరమవుతుంది

చూపుల వలలో చిక్కితే
చిత్తం చెల్లాచెదురవుతుంది
ఆశల అలలు లేపుతుంది



ఆటుపోట్లు తగులుతాయి
వలపు వలలో ఇరుక్కుంటే
వెలుగు వెన్నెలలా కనిపిస్తుంది
హృదయం కరిగిపోతుంది
వేదనల వర్షం కురుస్తుంది

ఉచితాల వలలో లీనమైతే
ఉన్నదాని విలువ కనుమరుగవుతుంది
ఉన్నతతనం దిగజారుతుంది
ఉద్యమమే విశ్వాసం కోల్పోతుంది.
రంగుల వలలో మునిగితే
రంగులు రంజింపజేస్తాయి
నిజరంగు కనబడదు
జీవితం దారితప్పుతుంది

వలల వలయంలో
వివేకమే వైద్యం
విలువలే వెలుగులు
విశ్వాసమే విముక్తి మార్గం

మనసే మిత్రమైతే
ఏ వలయమూ బంధం కాదు
మనుగడే మంగళగానం ఆలపిస్తుంది
మనిషితనం మహోత్సవం
అవుతుంది

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టు తీర్పు బాధాకరం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఫీజు రియంబర్స్‌మెంట్‌పై హైకోర్టు తీర్పు బాధకరమని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్రప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన హుజూర్‌నగర్‌లో బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకానికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు రావడం ఎంతో ఆవేదనకు గురిచేసిందని బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని హైకోర్టులో ప్రభుత్వ తరుపున సరైన వాదనలు వినిపించకపోవడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని, అందువల్ల ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి సుప్రీంకోర్టులో అప్పీలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల బడ్జెట్‌లో నిధులు విడుదలలో జాప్యం చేయడం పట్ల తీవ్ర ఇక్కట్లు పాలైన కాలేజీ యాజమాన్యాలు అనేక సందర్భాల్లో సమ్మెకు దిగుతామని హెచ్చరించినట్లు తెలిపారు. విద్యా హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్రంలోని బిసి ఉద్యమ బాధ్యులతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీను, యుగందర్, రామకృష్ణ లు పాల్గొన్నారు.

## క్రైస్తవ మతంలో చేరితే రిజర్వేషన్ రద్దు ప్రతిపాదన అన్యాయం

### సిపిఐ నేత మల్లెపల్లి ఆదిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** క్రైస్తవ మతంలో చేరిన వారిపై ఎస్‌సి రిజర్వేషన్ రద్దు చేయాలని తీసుకొస్తున్న ప్రతిపాదనలు సరైనవి కావని సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రముఖ దళిత నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను హామీ ఇస్తుందని,అలాంటి హక్కులను కించపరచే విధంగా ఎస్‌సి రిజర్వేషన్‌లను మతంతో అనుసంధానం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దేశంలో ప్రస్తుత పాలకులు రాజ్యాంగ మార్పులకు కుట్ర పన్నుతున్న నేపథ్యంలోనే ఈ విధమైన ప్రతిపాదనలు తీసుకువస్తున్నారని ఆరోపించారు.దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఇచ్చిన రిజర్వేషన్లు వారి మత మార్పిడితో సంబంధం లేకుండా కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. మత స్వేచ్ఛను హరించే ఏ నిర్ణయాన్నైనా ప్రజాస్వామ్యవాద శక్తులు తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.లౌకిక భారతదేశంలో ప్రతి వ్యక్తికి తన మతాన్ని స్వేచ్ఛగా ఎంచుకునే హక్కు ఉందని, ఆ హక్కును పరిమితం చేయడానికి చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని హెచ్చరించారు.

## శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగొండ

### మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణం శర వేగంగా అభివృద్ధి చెందుతోంది..అందుకు తగ్గట్టుగా నాణ్యమైన నివాస ప్రాజెక్ట్ సురభి హౌసింగ్ కాలనీ అని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్,డాన్ బాస్కో కళాశాల పక్కన 11 ఎకరాల్లో మేనేజింగ్ డైరెక్టర్లు మొహమ్మద్ బషీరుద్దీన్,మొహమ్మద్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన సురభి హౌసింగ్ కాలనీ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్ముల మోహన్ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిటిసిపి,ఆర్ఈఆర్ఏ అప్రూవల్‌తో రూపొందిన ఆధునిక లేఅవుట్ పెట్టుబడిదారులకు గోల్డెన్ ఛాన్స్ అని భవిష్యత్తులో విలువ పెరుగుతుందనే అంచన ఉందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.మేనేజింగ్ డైరెక్టర్లు మొహమ్మద్ బషీరుద్దీన్, మొహమ్మద్ అజారుద్దీన్ లు మా ట్లాడుతూ ప్రారంభ రోజే బుకింగ్‌లకు ఊహించని స్పందన వచ్చిందని పలువురు ముందస్తు రిజర్వేషన్లు చేసుకున్నారని వారు తెలిపారు.ఈ కాలనీలోఆధునిక సదుపాయాలతో ప్లాట్లు,రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్, పార్క్ తదితర హంగులతో ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బండారు ప్రసాద్, డిప్యూటీ మేయర్ ఆమేర్, వంగూరి లక్ష్మయ్య,మహమ్మద్ అజీమ్ ఉద్దీన్,సైఫ్ ఉద్దీన్,చిన్నాల జానయ్య, సైదులు, పుర ప్రముఖులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## టెస్కో టెండర్లు రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

### ప్రభుత్వ విప్ వీరేశంకు చేనేత కార్మిక సంఘం వినతి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** చేనేత కార్మికుల ఉపాధికి నష్టం కలిగించే టెస్కో టెండర్ల రద్దు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ రంగ సంస్థ టెస్కో ద్వారానే యూనిఫాం,దుప్పట్ల కొనుగోళ్లు కొనసాగించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కు ఆదివారం చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మురలీధర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యాశాఖ, సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు యూనిఫాంలు, దుప్పట్లు తయారీ బాధ్యతను రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి విద్యార్థుల యూనిఫాం తయారీకి రూ.105.50 కోట్ల టెండర్‌ను టెస్కోకు ఇచ్చి, ఇప్పుడు రద్దు చేసి ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలనే నిర్ణయం చేనేత కార్మికుల పొట్టకొట్టడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘాల నల్లగొంసూర్యాపేట ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మి నరసయ్య,మాజీ అధ్యక్షుడు రావిరాల మల్లయ్య,డైరెక్టర్లు గంజి ఎల్లయ్య,జిల్లా లక్ష్మీనారాయణ, కొంపెల్లి పద్మ,గుర్రం చంద్రమ్మ,సక్కుబాయి పాల్గొన్నారు.

# ఈ కార్యాలయానికి తాళాలు వేసేదే ఉండదు

### తలుపులు ఎప్పుడు బార్లగానే... వైద్యుడు... సిబ్బందికి సమయపాలనే పాటించరు..!

**మండల కేంద్రంలోని ఆయుర్వేద ఔషధశాలకు ఎప్పుడు తాళాలు వేసేదే ఉండదు. తలుపులు కూడా 24/7 ఎప్పుడు బార్లగానే తీసి ఉంటాయి. ఆదివారంతో పాటు ఇతర సెలవు దినాల్లో కూడా ఇదే పరిస్థితి. వైద్యుడు, సిబ్బంది సమయ పాలనే పాటించరు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఔషధశాల పరిస్థితిపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం.**




**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఆయుర్వేద ఔషధశాల సెలవు రోజైన ఆదివారం తెరిచే ఉంది. దీనికి కార్యాలయ సిబ్బంది తాళాలు వేయకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. శనివారం పని ముగించుకొని పోయిన సిబ్బంది పొరపాటున తాళం వేయకుండా మరిచివెళ్ళారా... లేక ఏ ఇతర కారణాలతోనైనా తాళం వేసి వెళ్ళలేదా అన్నది అంతు చిక్కడం లేదు. ఈ ప్రాంగణంలోనే ప్రభుత్వ పశువైద్యశాల, ప్రభుత్వ వైద్యశాల ఉన్నాయి. బస్సు స్టాఫ్ సమీపంలోనే రోడ్డుపై ఉన్న ఈ కార్యాలయాల ప్రాంగణంలో స్థలం విశాలంగా ఉండడంతోపాటు భారీ వృక్షాలు ఉండడంతో ప్రయాణికులతోపాటు గ్రామ ప్రజలు అక్కడ ప్రతిరోజు సేదతీర్చుకుంటారు. చిన్నారులు సైతం ఆటపాటలతో సందడి చేస్తారు. రోజులాగే ఆదివారం కూడా అక్కడికి వెళ్ళిన కొందరు ఆయుర్వేద ఔషధశాలకు తాళం వేయకుండా, తలుపులు బార్లుగా తెరిచిఉండడం వారికి కనిపించింది. ఔషధశాలలో ఎవరైనా ఉన్నారా అని చూస్తే ఎవరూ కూడా కనబడలేదు. దీంతో కొందరు ఔషధాలయం తలుపులు బార్ల తీసిఉన్న చిత్రాన్ని సెల్‌ఫోన్‌లో బంధించారు. సిబ్బంది నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతుండగా అక్కడ పనిచేస్తున్న వైద్యుడు, ఇతర సిబ్బంది సమయపాలన కూడా ఏనాడు పాటించిన పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలతో రోగులకు సేవలు చేయకుండా ఇండ్లకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. మందుబాబులు సైతం ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని అడ్డాగా చేసుకొని అక్కడ మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడ పడేసి వెళ్తున్నారని ఈ విషయం అధికారులకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఔషధాలయానికి తలుపులు బిగించి తాళం వేయకపోవడంతో అందులో ఉన్న విలువైన మందులతోపాటు ఫర్నీచర్ ఇతర సామాగ్రికి భద్రత లేకుండా పోయిందని ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేసి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కార్యాలయ తలుపులు బార్లుగా తెరిచి ఉండడం ఏమిటి? ఈ విషయం నా దృష్టికి రాలేదు... అడిగి తెలుసుకుంటాను : ఔషధశాల వైద్యులు రాంప్రసాద్**

ఆయుర్వేదిక్ ఔషధశాలకు ఆదివారం సెలవు దినమైనా తలుపులు బార్లుగా తెరిచి ఉండడంపై ఔషధశాల వైద్యులు తన్నీరు రాంప్రసాద్‌ను ప్రజాపక్షం వివరణ కోరగా తలుపులు బార్లుగా తెరిచి ఉండడమేమిటని తిరిగి ప్రశ్నించడం గమనార్హం. ఈ విషయం మీరు చెప్పేంత వరకు నా దృష్టికి రాలేదని మా సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని చెప్పడం జరిగింది.



## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వరం

**ప్రజాపక్షం/చండూరు:** ఇందిరమ్మ పాలనలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రక్కన గంజి భ్రమరాంభ కట్టుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమీషనర్ మల్లేశం ,వైస్ చైర్మన్ భూతరాజు దశరథతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం వలన నిరుపేదలకు సొంత ఇంటికల నెరవేరిందని అన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి, బుషిపాక వాసు, సామ సుజాత , జెల్ల ధనమ్మ, కొండ్రెడ్డి మధు, కోడి సుష్మావెంకన్న, కటకం రమేష్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ ముందు




జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టు పార్టీ ముందుంటుందని జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో బాగంగా మోటకొండూర్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి సిపిఐ గురించి అవగాహన కల్పించారు. దేశంను మతోన్మాథ కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల నుండి విముక్తి కోసం, సమ సమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని, కార్మికులు, రైతులు, మహిళలు తదితర ప్రజా సంఘాలు నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కోసం, కార్మికులకు, కర్షకులను దోపిడీ నుంచి విముక్తి చేయడానికి పోరాటాలు చేస్తున్న పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మోటకొండూరు గ్రామ శాఖ సహాయ కార్యదర్శి జీవీకేలపల్లి పాండు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కార్యదర్శులు బీరకాయల మధు, గొట్టిపాముల సునీల్ కుమార్, ఏండి గుంశీ, కారుపోతుల సత్యనారాయణ, గడ్డం శ్రీను, బోట్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



### 3,4 వార్డులలో ఇంటింటికి సిపిఐ

సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో 3,4 వార్డులలో మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాలను వివరించారు. మండల సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల ఏఐవైఎఫ్ అధ్యక్షులు బీరకాయల మధు, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు గొట్టిపాముల సునీల్ కుమార్, బీరకాయల నరసింహ, కొల్లూరు నాగరాజు పాల్గొన్నారు.

# మద్దతు ధరకు నాణమైన ధాన్యాన్ని తీసుకురావాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రబీలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టి తాలు,తరుగు, చెత్త వంటివి లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యానికి ప్రకటించిన 2389 రూపాయలు, కామన్ వెరైటీకి 2369 రూపాయల మద్దతు ధరను పొందవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూర్పురబట్టే యంత్రాలను సిద్ధంగా ఉంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ రబీలో జిల్లాలో 401 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు 124 రైస్ మిల్లులను అనుసంధానం చేయగా, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమ కొలిచే యంత్రాలు ,తూర్పారబట్టే యంత్రాలు,



టార్పాలిన్లు, గన్ని బ్యాగులు అన్ని సిద్ధంగా ఉంచడం జరిగిందని, అంతే కాక సెంటర్ ఇన్చార్జిలకు ఇదివరకె ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇవ్వడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సీనియార్టీ ప్రకారం సీరియల్ నెంబర్ ప్రకారం కొనుగోలు చేస్తారని ఆయన వెల్లడించారు.నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రామ్ పతి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్ నాగరత్నం రాజు ఉన్నారు.

# సామాజిక సమానత్వానికి కృషిచేసిన మహనీయుడు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సామాజిక సమానత్వానికి కృషిచేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ఎదురుగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత దేశంలో అణగారిన వర్గాల ఆశా కిరణం బాబు జగ్జీవన్ రామ్ అని, చిన్న వయసులోనే స్వాతంత్ర సమరంలో పాల్గొని భారత దేశ స్వాతంత్రానికి కృషి చేశారని, దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,రెవెన్యూ ఆధనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, దళిత సంఘాల నాయకులు వున్న కైలాస్ నేత, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, మల్లెపల్లి ఆదిరెడ్డి,లొడంగి శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట :** డాక్టర్ బాబుజగ్జీవన్ రామ్ సేవలు చిరకాలం చరిత్రలో నిలిచిపోతాయని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ 119 జయంతి సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ విద్య అభ్యాసం నుండి కుల వివక్షత ఎదుర్కొన్నారని, వివక్షత నుండి పోరాట ప్రతిమ మొదలు పెట్టారన్నారు. ఈ కార్యక్ర మంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ, ఎస్‌సి సంక్షేమ అధికారిణి శ్రీలత, మున్సిపల్ కమీషనర్ హన్మంతరావు పాల్గొన్నారు.




సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడు బాబుజగ్జీవన్ రామ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడిగా చరిత్రలో చిరస్థాయిగా బాబు జగ్జీవన్ రామ్ నిలిచారని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పి నరసింహ చారి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



**ప్రజా పక్షం/నకిరేకల్ :** భారత దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## అకాల వర్షం... అన్నదాతకు ఆందోళన

### ఐకెపి కేంద్రాల్లో తడిసిన ధాన్యం

**ప్రజాపక్షం/నిడమనూరు:** ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షం నిడమనూరు మండలంలోని రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇప్పటికే కోతకు వచ్చిన వరి ధాన్యాన్ని ఐకెపి కేంద్రాల్లో ఆరబోసి ఉంచిన రైతులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. చీకటి మధ్యలోనే ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు చేసిన యత్నాలు ఫలించక, చాలా చోట్ల ధాన్యం తడిసి ముద్దైంది.ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం, తాత్కాలిక కవర్లు లేకపోవడంతో ధాన్యాన్ని రక్షించుకునే అవకాశం రైతులకు లేకుండా పోయింది. దీంతో "అయ్యో లక్క" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లోనే కుటుంబ సభ్యులతో కలిసి ధాన్యాన్ని కప్పేందుకు, రాసులు పోసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో పలువురు రైతులు కంటతడి పెట్టుకున్నారు.ఇప్పటికే కోతకు వచ్చిన పంట పొలాల్లోనే ఉండటంతో, ఈ వర్షం కారణంగా ధాన్యం రాలి నేలపాలు అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట చేతికి వచ్చే సమయానికి ఇలా నష్టపోవడం రైతుల్ని తీవ్ర నిరాశలోకి నెట్టింది.రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసి ఉంటే ఈ పరిస్థితి రాకపోయేదని వాపోయారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం ప్రకటించి, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అకాల వర్షంతో కలిగిన నష్టాన్ని ప్రభుత్వం వెంటనే అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా కేంద్రాల్లో శాశ్వత సదుపాయాలు కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## బ్యాంకు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి తప్పని బాధలు

### చాలీచాలని వేతనాలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్యాంకుల తరపున అవుట్‌సోర్సింగ్ సిబ్బంది బాధలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన యువత దేవస్థానంలో ఉద్యోగమంటే ఉపాధి కోసం ఆసక్తితో ఉన్నారు. ఇక్కడ చిన్నపాటిదైనా ఉద్యోగం పొందాలని కుటుంబసభ్యులు కూడా ఆశిస్తున్నారు. కానీ, ఆలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగంలో చేరిన వారిలో చాలిచాలనీ వేతనాలకు పెరిగిన ధరలు తోడు కావడంతో కుటుంబపోషణకు ఆర్థిక భారమై కష్టతరంగా మారింది. ఎంతగా చాకిరి చేసిన ఉద్యోగాలు మాత్రం పర్మినెంట్కు భరోసా లేదు. అవుట్సోర్సింగ్ ఉద్యోగం చేయకతప్పని పరిస్థితుల్లో సిబ్బంది ఉన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన 17 విభాగాలతో పాటు సెంట్రల్ బ్యాంకు ఇండియా (సీబీఐ), యూనియన్ బ్యాంకు ఇండియా (యూ బీఐ), తెలంగాణ గ్రామీణ (బ్యాంకు (టీజీజీబీ), స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) బ్యాంకులతో కూడా సేవలు అందిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నాలుగు విభాగాల్లో 27 మంది అవుట్సోర్సింగ్ సిబ్బందితో సేవలు అందుతున్నాయి. సీబీఐ బ్యాంకు ప్రసాదాల విభాగం 13 మంది, సువర్ణపు ష్పార్చన విభాగం ముగ్గురు, యూబీఐ, టీజీజీబీలకు చెందిన 8మంది సిబ్బంది. ప్రధాన బుకింగ్, ఎస్బీఐ తరపున అద్దె గదుల విభాగంలో ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అధికంగా సీబీఐకి చెందిన సిబ్బంది ఉన్నారు. కాగా, వీరికి చాలిచాలనీ వేతనమే ప్రధాన సమస్యగా మారింది. గత 15 ఏళ్లుగా విధులు నిర్వహించిన సిబ్బందికి మాత్ర రూ.13వేలకు మించలేదు. కొన్ని బ్యాం కులు తక క్కువలో రూ.7వేలే వేతనం ఇస్తున్నాయి. వీటితో సిబ్బంది కుటుంబ పోషణకు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలతో పోటీ పడలేక ఆర్థికంగా చితికి పోతున్నారు. వేతనం పెంచాలని బ్యాంకు మేనేజర్లను సంప్రదిస్తే పైనుంచి ఆమోదం రాలేదని తెలుపుతున్నట్లు సిబ్బంది. వెల్లడిస్తున్నారు.



## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి




**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** హైదరాబాద్ జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 119 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు, దళితుల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు.



**కంటోన్మెంట్:** బాబూ జగ్జీవన్‌రామ్ 119 వ జయంతి వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి ఆయన వివిధ ప్రాంతాల్లో బిజెఆర్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. బాబూ జగ్జీవన్‌రామ్ దేశంలో ప్రతి ఒక్కరికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమాల్లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, మాజీ ఛైర్మన్, వైస్ చైర్మన్‌లు కదిర్వన్, వేణుగోపాల్‌రెడ్డి, బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రకాష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ, వైష్ణవి యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధనగర్ పద్మశాలి సంఘం కమిటీ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్ ఆధ్వర్యంలో బౌద్ధ నగర్ డివిజన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. డివిజన్ పరిధిలోని అంబర్‌నగర్ ఏకశిలా మెడికల్ హాల్ వద్ద ఉన్న పద్మశాలి సంఘంలో కమిటీని సికింద్రాబాద్ అధ్యక్షుడు మంద జగన్ ప్రకటించారు. కమిటీలో... అధ్యక్షుడు అనందాను కథకర్, ఉపాధ్యక్షుడు చింతకింది సాయికిరణ్, ప్రధాన కారదర్శి తాట్టం ప్రతిష్,
కోశాధికారి తిరుము రవి, వర్కింగ్ ప్రెసిండిట్ కర్ణాటి ఆనంద్ కూమార్, కార్మదర్శ దిండిగల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. సమావేశంలో నాయకులు చింతకింది మల్లేష్, ఆరుమల సంతోష్, శాగిమల దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గడపకు పోలీసు సేవలు




**ప్రజాపక్షం/రేవల్లి :** హత్య, అత్యాచారం, దోపిడీ వంటి సీరియస్ నేరాల్లో తక్షణ స్పందన మహిళలు, వృద్ధులు గ్రామీణ ప్రజలకు మరింత ఉపయోగకరం ప్రజలకు మరింత చేరువగా, వేగవంతంగా, పారదర్శకంగా పోలీస్ సేవలను అందించాలనే లక్ష్యంతో సీరియస్ నేరాలలో ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తున్నామని ఎస్ఐ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రజిత మాట్లాడుతూ మండల పోలీసు మరింత సౌకర్యంతమైన సేవలను అందించేందుకు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ డోర్ స్టెప్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తోందని బాధితులు హత్య, అత్యాచారం దోపిడీ చోరీ కిడ్నాప్, మహిళలు, చిన్నారులపై నేరాల, రోడ్డు ప్రమాదాలు ఎస్సీ, ఎస్టీ, బాల్యవివాహాల, ర్యాగింగ్ వంటి సీరియస్ నేరాల్లో బాధితులు పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఎక్కడ ఉంటే అక్కడ బాధితుల నివాసం, హాస్పిటల్, రక్షణ ప్రదేశం, సంఘటన చోటుచేసుకున్న ప్రదేశంలో పోలీసు అధికారులు ఫైన్ నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరూ ఈ సేవను వినియోగించుకొని న్యాయం పొందాలని, వనపర్తి జిల్లా పోలీసు ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా మరిన్ని వినూత్న సేవలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని ఎస్పీ అలాగే రేవల్లి సబ్ ఇన్స్‌పెక్టర్ రజిత తెలిపారు.

## దాడి చేయడం హేయమైన చర్య


### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్టారామ్ రెడ్డి

**ప్రజాపక్షం/వెల్దండ :** మాజీ సిఎం, ఎమ్మెల్యే చంద్రశేఖర్ రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎంపిపి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్టారామ్ రెడ్డి అన్నారు. కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి పుట్టారామ్ రెడ్డి మాట్లాడుతూ ఈ దాడి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవంపై జరిగిన దాడిగా క్యాంపు కార్యాలయంలో అక్కడ ఎమ్మెల్యే కేసీఆర్ ఫోటో పెట్టకుండా సిఎం ఫోటో పెట్టడం ఏమిటని ఎమ్మెల్యే ఫోటో ఉండకూడదాని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఎంపీల అధికార నివాసంలో ఎంపీల ఫోటో లేకుండా ప్రధాని మోడీ ఫోటో పెట్టగలరా క్యాంపు కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలంలే అధికారులే పెట్టొచ్చు కదా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వెంటనే ఎటువంటి పనులు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్ రెడ్డి, జోగయ్య, లింగం ముదిరాజు, పొలె అశోక్, నిరంజన్, సత్యం, రవిలతో పాటు తదితరులు ఉన్నారు.

## అరుణ కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సిపిఎం జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య సతీమణి, పార్టీ సభ్యురాలు కామ్రేడ్ అరుణ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. శనివారం అంత్యక్రియలకు హాజరు కాలేకపోయిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ ఆదివారం బొల్లారం గ్రామానికి చేరుకుని మృతురాలి భర్తను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యం కోల్పోకుండా ఉండాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి, ఎం.రాజు, గ్రామ పార్టీ నాయకులు వి.కృష్ణయ్య, బాలగౌడ్, వెంకటస్వామి, నాగరాజు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే బంధుమిత్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మృతురాలికి నివాళులు అర్పించారు. కామ్రేడ్ అరుణ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకురాలని, ఆమె సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని నేతలు పేర్కొన్నారు.

## సామాజిక సమానత్వానికి కాంగ్రెస్ పునాది





### సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పారదర్శకంగా ప్రజాపాలన

### బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు కేవలం స్మరణకే పరిమితం కాకుండా, దళిత ఆత్మగౌరవ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే సంకల్పదినంగా మార్చాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనరసింహ, ఎంపి మల్లు రవి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఎంఎల్‌సి , విప్ అద్దంకి దయాకర్, ఎంఎల్ఎలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, నాగరాజు, రిటైర్డ్ ఐపిఎస్ బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ కాచిగూడలోని నింబోలి అడ్డలో రూ.30కోట్ల వ్యయంతో బాబూ జగ్జీవన్ రామ్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో పది అంతస్థులకు తగ్గకుండా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాలెడ్జ్ పార్కును రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకు అంగీకరించిన సిఎం రేవంత్‌రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ దేశానికి స్వాతంత్ర్యం మాత్రమే కాకుండా సామాజిక సమానత్వానికి పునాది వేసిందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాల హక్కులు, రిజర్వేషన్లు కాంగ్రెస్ దృక్పథంతోనే సాధ్యమయ్యాయని చెప్పారు. భూమి సంస్కరణలు, విద్యా అవకాశాల ద్వారా పేదల అభివృద్ధికి కాంగ్రెస్ కృషిచేసిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన పారదర్శకంగా జరుగుతుందన్నారు. దళితులకు సంక్షేమమే కాకుండా అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. దళిత విద్యార్థులకు ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నట్టు చెప్పారు. దళిత ఓటు కాదు.. దళిత గౌరవమే ముఖ్యమని కాంగ్రెస్ భావిస్తున్నదన్నారు. జగ్జీవన్‌రామ్ కలల భారతాన్ని తెలంగాణలో సాకారం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపూరి సోమయ్య ఆలపించిన గీతాలు ఆహూతులను ఉర్రూతలూగించాయి. సమావేశంలో వివిధ మాదిగ సంఘాల ప్రతినిధులు జెబి రాజు, మేడి పాపయ్య, జెర్రిపోతుల పరశురాం, ఇటుకరాజు, కనకరాజు, చిలుక భాస్కర్ ఉత్సవ కమిటీ నేతలు పాల్గొన్నారు.

## మాదిగల ఓట్లు మాదిగలకే

### మాదిగ మహాశక్తి జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రి మోత్కుపల్లి




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** మాదిగల ఓట్లు మాదిగలకే అన్న నినాదంతో ప్రజల్లోకెళ్తామని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ ప్రముఖులు, పెద్దలతో కలిసి మాదిగ మహాశక్తి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 30 ఏళ్లుగా ప్రజలకు సేవ చేశానన్నారు. మాదిగ జాతి అభివృద్ధికి తన జీవితాంతం కృషిచేస్తానని తెలిపారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మాదిగలకు రేషన్‌కార్డు, ఇల్లు తప్ప ఏం లేదన్నారు. ఎన్‌టిఆర్ తప్ప, ఏ రాజకీయ నాయకుడు మాదిగలను గౌరవించలేదన్నారు. మాదిగలను గద్దెను ఎక్కించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50వేల మంది మాదిగలుంటారని, మనం ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. మన ఓట్లు మనం వేసుకొంటే మన మాదిగ బిడ్డలు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలవుతారని తెలిపారు. మాదిగలను గౌరవించినవారినే తిరిగి మళ్లీ గౌరవిద్దామన్నారు. ఇప్పటికే ఎంతో నష్టపోయామని, మాదిగలంతా తనకు మద్దతుగా ఉంటే తెలంగాణ రాజకీయం మారిపోతుందన్నారు. కులానికి ఓటు వేయాలని, పార్టీలను చూసి ఓట్లు వేస్తే మనం ఎదగలేమని చెప్పారు. వర్గీకరణ ఉద్యమంలో అమరులైన బాధిత కుటుంబాలకు సిఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. మాదిగ ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కనకయ్య, విజయ్, చిలుక భాస్కర్, వీరాస్వామి, ప్రొఫెసర్ విద్యాసాగర్, అడ్వకేట్ నాగభూషణం, ప్రసాద్, వాసు, గాయకుడు రాంబాబు, తిరుపతి,నారాయణ

## హ్యాపీ సండేకు విశేష స్పందన

### న్యూటౌన్ చౌరస్తా వద్ద 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ నగరంలోని న్యూటౌన్ చౌరస్తా ప్రాంతంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా న్యూటౌన్ చౌరస్తా వద్ద హేపీ సండే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమైన వారి సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జూన్ 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. అలాగే పట్టణంలో ప్రతి ఆదివారం ''హ్యాపీ సండేస్'' కార్యక్రమాన్ని ఉదయం సుమారు మూడు గంటల పాటు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు కలిసి మోగా, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆరు నుండి అరవై సంవత్సరాల వయస్సు గల ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషమని చెప్పారు. పట్టణ ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని, అందరూ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి పాల్గొంటున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పట్టణ ప్రజలను అభినందించారు. ''హ్యాపీ సండే'' కార్యక్రమంలో భాగంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కార్పొరేటర్ రమేష్ బాబు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణంతోనే శాశ్వత సాగునీటి పరిష్కారం


### మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/పానుగల్ :** రామన్న గట్టు రిజర్వాయర్ నిర్మాణంతోనే శాశ్వత సాగునీటి పరిష్కారం గోపాల్ దిన్నె సింగోటం లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయ్యాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొల్లాపూర్, దేవరకద్ర ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. జలవిద్యుత్ పేరిట శ్రీశైలంలో సాగునీటిని ఎపి ప్రభుత్వం దోచుకుంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చేస్తుందన్నారు. ఇరిగేషన్ మంత్రి, జిల్లా మంత్రి ఎందుకు అడ్డుకోలేక పోయారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన వాటిని రద్దు చేశారని, మధ్యంతరంలో ఉన్న పనులను పూర్తి చేయడం లేదన్నారు. పానుగల్ మండలంలోని కిష్టాపూర్ వద్ద రానున్న గట్టు రిజర్వాయర్ నిర్మాణం కోసం 500 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంజూరును నిలిపివేసిందన్నారు. రానున్న గట్టు రిజర్వాయర్ నిర్మాణంతోనే శాశ్వత సాగునీటి పరిష్కారం అవుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేస్తే 25 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. 150 కోట్ల గోపాల్‌దీన్నే సింగోటం లింకు కెనాల్ను గుత్తేదారు అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని, జిల్లా మంత్రి జూపల్లి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఓట్లప్పుడే రాజకీయాలు తప్ప మిగతా సమయంలో అభివృద్ధి పై దృష్టి సారించేలా నాయకుల పనితీరు ఉండాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, జ్యోతి నందన్ రెడ్డి, చంద్రశేఖర్ నాయక్, అడ్వకేట్ రవి, రాజేష్ రెడ్డి, తిలక్, భాస్కర్ రెడ్డి, దశరత్ నాయుడు, గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి నడక మంచిది

### విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఆరోగ్యానికి నడక మంచిదని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూటౌన్ ప్రాంతంలో సుశ్రుత ఆసుపత్రి ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించి, 2కే రన్ లో అందరితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ''ఆరోగ్యమే మహాభాగ్యం'' అని పేర్కొంటూ, మన జీవనశైలిలో మార్పులు తీసుకురావడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని సాధించవచ్చని అన్నారు. రోజు వారీ జీవితంలో కనీసం కొంత సమయం నడక, వ్యాయామం, యోగ వంటి ఆరోగ్యకర అలవాట్లకు కేటాయించడం చాలా అవసరమని సూచించారు. ఈ సందర్భంగా సుశృత ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్న వారికి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ వేడుకలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జె.రామ్‌మోహన్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ సామ్యెల్, డాక్టర్ ఏగూర్ ఆనంద్, డాక్టర్ విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ పట్టణంలోని కల్వరి కొండపై ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించిన వేడుకలకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని మతాల మధ్య సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కల్వరికొండ ప్రాంత అభివృద్ధి కోసం మొత్తం రూ.242 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు పనులను వివరించారు. అందులో భాగంగా బోయపల్లిలోని పాత, కొత్త స్మశానవాటికల పెద్ద షెడ్ల నిర్మాణం, కమలా నెహ్రూ కాలనీలో షాలేం ఎం.బి.చర్చి వద్ద షెడ్ నిర్మాణం, మిషన్ కాంపౌండ్‌లోని కల్వరి ఎం.బి.చర్చి వద్ద మరుగుదొడ్ల నిర్మాణం, కల్వరి టెంపుల్ రోడ్ నుండి స్మశానవాటిక వరకు సీసీ రోడ్డు నిర్మాణం, అలాగే కల్వరి కొండ ప్రాంగణ అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ సిబి శ్రీపూజిత, సిజె బెనహర్, ఫాస్టర్ రెవ, వరప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, చర్చ్ పాస్టర్లు, ప్రముఖులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశానికి బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

### డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దేశ ఉప ప్రధానిగా, రక్షణ, కార్మిక, వ్యవసాయ శాఖ మంత్రి బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా తెలంగాణ చౌరస్తాలో గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, నాయకులు చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, రాజేందర్ రెడ్డి, అజ్మత్ అలీ, ఎండి. తాహెర్, ప్రవీణ్ కుమార్, జే.చంద్రశేఖర్, గులాం మహీర్, పీర్ సాధిక్, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ తెలంగాణ చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మణ్, నాయకులు, భరత్, అంజి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మక్తల్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ ఆధ్వర్యంలో స్థానిక మక్తల్ పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి 118 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంగం అధ్యక్షులు పృథ్వీరాజ్, దళిత నాయకులు జీర్గల్ నగేష్ మాదిగ 10వ వార్డ్ కౌన్సిలర్ కర్రెం చెన్నమ్మ నీలప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి నారాయణ, కేవిపిఎస్ నాయకులు బండారి నరసప్ప, అంబేద్కర్ యువజన సంఘం ముదుమాల్ అధ్యక్షులు తిమ్మన్న, నాయకులు మహాదేవ్, అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు కర్రెమ్ శ్రీనివాసులు, తల్వార్ నరేష్, పెరియార్ సంఘం నాయకులు అక్షయ, గోలపల్లి, బిఆర్ఎస్ నాయకులు మాలికట్టే రాములు, జగ్గలి బహదూర్, క్రాంతి కుమార్, అంబేద్కర్, యువజన సంఘం నాయకులు తరుణ్, సందీప్, చిన్ని, సాయికుమార్, గార్లపల్లి అశోక్, దీపక్. నాగరాజు, దేవేంద్ర దేవా పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వంగూర్ :** స్వాతంత్ర సమరయోధులు సుదీర్ఘ రాజకీయ చరిత్రలో పేరుగాంచి ఎన్నో ఉన్నత పదువులు చేపట్టి దేశానికి ఉప ప్రధానిగా 30 సంవత్సరాలు కేంద్రమంత్రిగా పనిచేసే దళితుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన మహానీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని రంగాపూర్, వంగూర్, సర్పంచ్‌లు క్యామ మల్లయ్య, పురుగుల యాదయ్య అన్నారు. ఆదివారం ఆయా గ్రామాలలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో 119 జయంతి వేడుకలు జరుపుకొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు రామస్వామి, భాస్కర్, పంచాయితీ కార్యదర్శిలు, శ్రీనివాస్, రమేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకై సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుర్రపు కురుమయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు తప్పెట కిరణ్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శి రమణ, సిపిఐ మండల నాయకులు జి. వెంకటస్వామి, చేపల శేఖర్‌లు నివాళులార్పించారు.

**ప్రజాపక్షం/వెల్దండ :** స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగల ఐక్యవేదిక అధ్యక్షులు దూళ్ల సామేలు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఈడుదులపల్లి అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీలు లింగం ముదిరాజ్, నాయక్ మాదిగల ఐక్యవేదిక వ్యవస్థాపక నాయకులు పోలే అశోక్ కుమార్, వార్డు మెంబర్లు, ముదిగొండ కవిత రమేష్, సిరసనగండ్ల శేఖర్, కిష్టాలు, తెలంగాణ ఉద్యమకారులు దాసరి రాము, గజిని శీను, మండల మాదిగల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి మునగల్ శెట్టి మల్లేష్, వెంకటయ్య, కొప్పు గెలవయ్య, వివిధ పార్టీల నాయకులు మాసుల బాలరాజ్, నారాయణ, మట్ట విష్ణుగౌడ్, కార్యదర్శి మీసాల రాజు, ప్రచార కార్యదర్శి ఈడుదులపల్లి శ్రీనివాస్, ఆ సంఘం నాయకులు పుల్లయ్య, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించారు.
బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్క యువత ముందుకు నడవాలని చెరుకూరు సర్పంచ్ మైపాల్ నాయక్ ఆధ్వర్యంలో, తిమ్మినోనీపల్లి గ్రామ సర్పంచ్ మూడవత్ శారత హరికిషన్ నాయక్ ఆధ్వర్యంలో కుప్పగండ్ల గ్రామ సర్పంచ్ ముక్తాల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ కార్యాలయాలలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు.

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** సామాజిక న్యాయం కోసం పోరాడిన సమతావాది దళిత బాంధవుడు మహానేత జగ్జీవన్ రామని ప్రపంచ శాంతి సంఘం వనపర్తి జిల్లా సమన్వయకర్త ఎత్తం శివ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. వనపర్తి ఆఫీసులో జగ్జీవన్ రామ్ 119 వ జయంతిని ప్రపంచ శాంతి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# సొంతగడ్డపై ఆర్‌సిబికి భారీ విజయం

## డేవిడ్ సిక్సర్ల మోతకు అల్లాడిన సూపర్ కింగ్స్..

సొంత ఇలాకాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గర్జించింది. చిన్నస్వామి స్టేడియంలో బ్యాటర్ల ఊచకోతకు, బౌలర్ల వికెట్ల వేట తోడవ్వగా ఆర్‌సిబి 43 పరుగులతో భారీ విజయం సాధించింది. టిమ్ డేవిడ్(70 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్(50) మెరుపులతో కొండంత స్కోర్ కొట్టిన బెంగళూరు.. పవర్ ప్లేలోనే చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టింది. టాపార్డర్ కుప్పకూలిన చోట సర్ఫరాజ్ ఖాన్(50), ప్రశాంత్ వీర్(43)లు బ్యాట్ ఝులిపించారు. ఆఖర్లో జేమీ ఓవర్టన్(37) ధనాధన్ ఆడినా సరిపో లేదు. ఫలితంగా చెన్నై ఖాతాలో హ్యాట్రిక్ ఓటమి చేరింది. పంతొమ్మిదో సీజన్‌లో రికార్డు స్కోర్ బాదిన ఆర్‌సిబి వరసగా రెండో విజయం నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ప్రత్యర్థి నిర్దేశించిన కొండంత లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన సూపర్ కింగ్స్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. బౌలర్లు విఫలమైన చోట బ్యాటర్లూ 'మేము ఆడలేమంటూ' చేతులెత్తేశారు. జాకబ్ డఫ్ఫీ వేసిన తొలి ఓవర్లో సిక్సర్ బాదిన రుతురాజ్ గైక్వాడ్(7) సులువుగా వికెట్ ఇచ్చేయగా.. గత మ్యాచ్‌లో అర్ధ శతకంతో రెచ్చిపోయిన ఆయుష్ మాత్రే(1)ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. భారీ స్కోర్ బాకీ పడిన సంజూ శాంసన్ మరోసారి నిరాశపరుస్తూ 9 పరుగులకే వెనుదిరిగాడు.

### సర్ఫరాజ్ మెరిసినా..

డఫ్ఫీ, భువనేశ్వర్‌ల విజృంభణతో 30 కే మూడు బిగ్ వికెట్లు పడిన వేళ సర్ఫరాజ్ ఖాన్(50), ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(6)లు బౌండరీలతో స్కోర్ బోర్డును నడిపించారు. అయితే.. కృనాల్ పాండ్యా(236) ఒకే ఓవర్లో వీరిద్దరిని పెవిలియన్ పంపి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు.శివం దూబే(18) కాసేపు అలరించాడంతే. ప్రశాంత్ వీర్(43), జేమీ ఓవర్టన్(37)లు ఆర్సీబీ బౌలర్లను ప్రతిఘటించారు. స్కోర్ 100 దాటించి ఆరో వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని డైవింగ్ క్యాచ్‌తో పాటిదార్ విడదీశాడు. కాసేపటికే ఓవర్టన్ ఇన్నింగ్స్ ముగియగా.. సీఎస్కే 207 పరుగులకే పరిమితమైంది.



### ఆ ఇద్దరూ.. ఆకాశమే హద్దుగా

సొంత గడ్డపై రాయల్ ఛాలెంజర్స్ బ్యాటర్లు పూనకాలు వచ్చినట్టే చెలరేగారు. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. దానికి రెండింతలు అన్నట్టు మిడిలార్డర్ బ్యాటర్లు సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల భరతం పట్టారు. ఫలితంగా ఈ సీజన్‌లో అత్యధిక స్కోర్ నమోదు చేసింది ఆర్సీబీ. పవర్ ప్లేలోనే విరాట్ కోహ్లీ(28) ఔటైనా.. దేవ్‌దత్ పడిక్కల్(50) జతగా ఫిలిప్ సాల్ట్(46) స్కోర్ బోర్డును ఉరికించాడు. అర్ధ శతకానికి చేరువైన సాల్ట్‌ను దూబే వెనక్కి పంపాడు. అనంతరం పడిక్కల్‌తో కెప్టెన్ రజత్ పాటిదార్(48 నాటౌట్) సూపర్ కింగ్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. ఓవర్టన్ ఓవర్లో స్కూప్ షాట్‌కు యత్నించిన పడిక్కల్ బౌల్డ్ అయ్యాడు. అయినా.. ఆర్సీబీ స్కోర్ వేగం తగ్గలేదు. చివరి ఐదు ఓవర్లలో టిమ్ డేవిడ్70 నాటౌట్) ఆకాశమే హద్దుగా.. సిక్సర్లే సిక్సర్లు బాదేశాడు. 16వ ఓవర్ నుంచి మొదలైన అతడి దూకుడు చివరి ఓవర్ వరకూ కొనసాగింది. దాంతో.. ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ చేసింది.

## వరల్డ్ స్కూల్ వాలీబాల్ టోర్నీకి సింధు



**హైదరాబాద్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి కొప్పెర సింధు సత్తా చాటింది. తుంగతుర్తిలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న సింధు..ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఫెడరేసన్ వరల్డ్ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్(అండర్–18) ట్రయల్స్‌కు భారత్ నుంచి ఎంపికైంది. చైనాలోని షాంగ్లు వేదికగా జూలై 1 నుంచి 10వ తేదీ వరకు జరిగే ట్రయల్స్‌లో సింధు దేశం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఇందుకోసం ఇటీవల రాయభరేలి(ఉత్తర ప్రదేశ్)లో జరిగిన 69వ జాతీయ స్కూల్ గేమ్స్ మెరుగైన ప్రతిభ కనబరిచిన టాప్29 బాలికల నుంచి సింధును ఎంపిక చేశారు. సింధును రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, జూనియర్ కాలేజ్ పీడీ, పీఈటీ అసోసియేషన్ చైర్మన్ రామ్లక్ష్మ ణ్, అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి చందర్, నీరజ ప్రత్యేకంగా అభినందించారు.

## హోరాహోరీగా దక్కన్ పాడెల్ లీగ్

**హైదరాబాద్ :** దక్కన్ పాడెల్ లీగ్(డిపిఎల్) పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మహావీర్ స్టార్స్ ఆతిథ్యమిచ్చిన లీగ్‌లో ప్లేయర్లు తమదైన ప్రతిభతో ఆకట్టుకున్నారు. కొత్త ప్రమాణాలు నెలకొల్పుతూ ప్లేయర్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. టెన్నిస్ను పోలిన ఈ ఆటలో సింగిల్స్తో పాటు డబుల్స్ మేళవింపుగా ప్లేయర్లు తలపడ్డారు. కేవలం ఆటకే పరిమితం కాకుండా ప్రేక్షకులకు లైఫ్స్టయిల్ను పరిచయం చేయడం మారుతున్న శైలికి నిదర్శనమని నిర్వాహకులు పేర్కొన్నారు.



# ఆరోగ్యం

## భ్రాంతికి కారణం హెపటైటిస్ 'సి'!

మానసిక భ్రాంతి కారకాల్లో హెపటైటిస్ 'సి' ఉన్నట్టు వచ్చిన వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయి. మానసిక అనారోగ్యం గురించి ఇప్పటి వరకు ఉన్న అర్థాన్ని పూర్తిగా మార్చేలా శాస్త్రవేత్తల పరిశోధన ఉంది. బైపోలార్ డిసార్డర్, స్కిజోఫ్రెనియా ఉన్న కొన్ని రోగుల మెదడు కణజాలంలో హెపటైటిస్ 'సి' వైరస్ ఉన్నట్లు కనుగొన్నారని సోషల్ మీడియా వార్తలు హల్‌చల్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ వ్యాధులను జెనెటిక్స్, మెదడులోని రసాయన అసమతుల్యత, పర్యావరణ ప్రభావాలు వంటి కోణాల్లో మాత్రమే పరిశోధించారు. కానీ, వైరస్ మెదడులో ఉండటం అనేది ఈ వ్యాధుల మూలకారణంలో సంక్రమణల పాత్ర కూడా ఉండొచ్చనే కొత్త ఆలోచన తీసుకొచ్చింది. అంటే మనసు, భావోద్వేగాలు, ప్రవర్తనలకు దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని సూచిస్తోంది. ఈ పరిశోధన భవిష్యత్తు వైద్యంలో పెద్ద మార్పులకు దారి తీయవచ్చు. మరిన్ని శాస్త్రీయ అధ్యయనాలు ఈ విషయాన్ని నిర్ధారిస్తే భవిష్యత్తులో లక్ష్యం కేవలం లక్షణాలను నియంత్రించడం కాకుండా వైరస్‌ను నేరుగా లక్ష్యంగా పెట్టుకుని చికిత్స చేయడం సాధ్యమవుతుంది. అంటే ప్రస్తుతం మందులు ఫలితం ఇవ్వకపోయినా, కొత్త చికిత్సలు రోగులకు మరింత ఆశను ఇవ్వవచ్చు. ఈ కనుగొనుగుడు మనిషి మెదడు ఎంత క్లిష్టమైనదో మరోసారి గుర్తు చేస్తోంది. మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఎన్నో దాగిన అంశాలు ఇంకా మనం పూర్తిగా అర్థం చేసుకోలేదు. శాస్త్రం నిరంతరం మారు తూ ఉంటుందని, ప్రతి కొత్త అధ్యయనం మన అంచనాలను మించి కొత్త దారులను తెరుస్తుందని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యానికి సంబంధించి నిజమైన కారణాలను తెలుసుకోవడం, భవిష్యత్తులో మరింత ఖచ్చితమైన, ప్రభావవంతమైన చికిత్సలకు ఇలాంటి పరిశోధనలు మార్గాలు వేస్తాయి. రోగులకు మంచి జీవితాన్ని అందించవచ్చనే ఆశను కలిగిస్తున్నాయి. ఎవరైనా ఈ వ్యాధులతో బాధపడుతున్నా లేదా దగ్గర్లో ఎవరికైనా ఉంటే, ఇందు లో ఏ తప్పు లేదు. ఇది వారి వైఫల్యం కాదు. మానసిక ఆరోగ్యం కూడా శరీరం మిగతా భాగాల మాదిరిగానే వైద్య సహాయం అవసరమైన అంశం. శాస్త్రం ముందుకు సాగుతున్న కొద్దీ మంచి పరిష్కారాలు రావడం తప్పదు.



## ఆరోగ్యానికి విటమిన్ బి3

ఇటీవల శాస్త్రవేత్తలు విటమిన్ బి3 (నియాసిన్)కు సంబంధించిన ఒక ముఖ్యమైన వైద్య పరిశోధనా ఫలితాన్ని ప్రకటించారు. ప్రయోగశాలలో ఎలుకలపై నిర్వహించిన అధ్యయనాల్లో, విటమిన్ బి3 సప్లిమెంటేషన్ ద్వారా ఎన్ఎక్స్‌డి డెఫిషియన్సీ అనే అరుదైన జన్యు సంబంధ వ్యాధిని విజయవంతంగా నియంత్రించగలిగినట్లు ఆ ప్రకటన సారాంశం. ఇది భవిష్యత్తులో తీవ్రమైన నర సంబంధ వ్యాధుల చికిత్సల్లో కొత్త మార్గాలను తెరవవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఈతాజా అభివృద్ధి కారణంగా విటమిన్ బి3 యొక్క జీవక్రియాత్మక ప్రాధాన్యం మళ్లీ వైద్య ప్రపంచంలో చర్చకు వచ్చింది. విటమిన్ బి3ను నియాసిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్‌లలో ఒకటి, అంటే శరీరంలో నిల్వ ఉండకుండాఅవసరమైనంత మాత్రమే ఉపయోగించబడుతుంది. మిగిలినది మూత్రం ద్వారా బయటకు వెళుతుంది. నియాసిన్ సహజంగా అనేక ఆహారపదార్థాల్లో లభిస్తుంది. అదనంగా, కొన్ని ఆహారాలలో దీనిని పోషక విలువ పెంచేందుకు కలుపుతారు మరియు ఇది ఆహార అనుబంధ మాత్రల రూపంలో కూడా అందుబాటులో ఉంటుంది. నియాసిన్‌కు ప్రధానంగా రెండురసాయన రూపాలు ఉన్నాయి. మొదటిది నికోటినిక్ ఆమ్లం, రెండవది నియాసినమైడ్ లేదా నికోటినమైడ్. ఈ రెండు రూపాలు శరీరంలో ముఖ్యమైన జీవక్రియల లో భాగస్వామ్యం అవుతాయి. మన శరీరం ఆహారం ద్వారా నియాసిన్‌ను పొందడమే కాకుండా ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం నుంచి కొంతమేర తయారు చేసుకోగలదు. ట్రిప్టోఫాన్ ఎక్కువగా టర్కీ మాంసం, గుడ్లు, చేపలు వంటి ప్రోటీన్ ఆహారాల్లో లభిస్తుంది. విటమిన్ బి3 శరీరంలో కోఎంజైమ్‌గా పనిచేస్తుంది. శరీరంలోని 400కిపైగా ఎంజైమ్ చర్యలు దీనిపై ఆధారపడి ఉంటాయి. ఇది ఆహారంలోని కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్లను శక్తిగా మారుస్తుంది. అదేవిధంగా కొలెస్ట్రాల్ మరియు కొవ్వు పదార్థాల తయారీలో సహకరిస్తుంది. డిఎన్ఏ నిర్మాణం, మరమ్మతు ప్రక్రియల్లో కూడా నియాసిన్ కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా ఇది యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగి ఉండటం వల్ల కణాలను ఆక్సిడేటివ్ నష్టం నుంచి రక్షిస్తుంది. అందువల్ల శరీర శక్తి ఉత్పత్తి, మెదడు ఆరోగ్యం, చర్మం మరియు నర వ్యవస్థ పనితీరుకు ఇది అత్యంత అవసరం. నియాసిన్ లోపం సాధారణంగా అరుదుగా కనిపిస్తుంది, ఎందుకంటే ఇది జంతు మరియు వృక్ష ఆహారాల్లో విస్తృతంగా లభిస్తుంది. ఎర్ర మాంసం, కాలేయం, పంది మాంసం, చికెన్, చేపలు వంటి ఆహారాల్లో ఇది అధికంగా ఉంటుంది. అలాగే బ్రౌన్ రైస్, పోషక పదార్థాలు కలిపిన ధాన్యాలు, పప్పుధాన్యాలు, విత్తనాలు, కాయగూరలు, అరటిపండ్లు వంటి వృక్ష ఆహారాల్లో కూడా నియాసిన్ లభిస్తుంది. సమతుల ఆహారం తీసుకునే వ్యక్తుల్లో సాధారణంగా లోపం ఏర్పడదు. అయితే తీవ్రమైన నియాసిన్ లోపం పెల్లాగ్రా అనే వ్యాధికి దారితీస్తుంది. ఈ పరిస్థితిలో సూర్యకాంతికి గురయ్యే చర్మ భాగాల్లో ముదురు రంగు లేదా పొట్టు లాంటి చర్మ వ్యాధి కనిపిస్తుంది. నాలుక ఎర్రబడటం, జీర్ణ సమస్యలు, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి లక్షణాలు కూడా ఉంటాయి. అదనంగా డిప్రెషన్, తలనొప్పి, అలసట, జ్ఞాపకశక్తి తగ్గడం, భ్రమలు వంటి నర సంబంధ లక్షణాలు కూడా కనిపించవచ్చు. ఈ లక్షణాలు నియాసిన్ శరీర నర వ్యవస్థకు ఎంత ముఖ్యమో సూచిస్తాయి. ఇటీవల వార్తల్లో నిలిచిన ఎన్ఎక్స్‌డి లోపం అనే వ్యాధి ఎన్ఎడి(పి)హెచ్ఎక్స్ డిహైడ్రాటేస్ అనే ముఖ్యమైన కణ ఎంజైమ్ లోపంతో ఏర్పడుతుంది. ఈ ఎంజైమ్ కణాల్లో శక్తి ఉత్పత్తికి అవసరమైన మెటబాలిక్ అణువులను మరమ్మతు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈఎంజైమ్ సరిగా పనిచేయకపోతే కణాల శక్తి ఉత్పత్తి దెబ్బతింటుంది, దాంతో నర వ్యవస్థ క్రమంగా నాశనం అవుతుంది. ఇది సాధారణంగా శిశు దశలో ప్రారంభమయ్యే అరుదైన న్యూరోమెటబాలిక్ వ్యాధి. ఎన్ఎక్స్‌డి లోపం ఉన్న పిల్లల్లో జ్వరం వచ్చిన తర్వాత కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం, కండర బలహీనత, అలసట, చిరాకు, నడకలో అసమతుల్యత, మాట కోల్పోవడం, కదలిక సమస్యలు, ఫిట్స్, కళ్ల కదలికల లోపం, వినికిడి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి ఇప్పటివరకు సమర్థవంతమైన చికిత్సలు చాలా పరిమితంగా ఉన్నాయి.



# రాజకీయ చైతన్యం కోసమే ఇంటింటికీ సిపిఐ

## సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం

**ప్రజాపక్షం/కథలాపూర్ :** ప్రజల్లో రాజకీయ చైతన్యం తేవడానికి ఇంటిటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పేర్కొన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం గంభీర్పూర్, ఊట్పెల్లి, పెగ్గెర్ల, భూషణరావుపేట గ్రామాల్లో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహించి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించి, పార్టీ బలోపేతానికి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సభ్యుడు సుతారి రాములు, నాయకులు ఎన్నం రాధక్క,అందె వంశీకృష్ణ , కర్నె భూమయ్య, చెన్నవేని దశరథం,గుండేటి పోశెట్టి పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి :** త్యాగాలకు.. పోరాటాల కు కేంద్రమైన సిపిఐని ఆదరించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. ఎల్కతుర్తి మండలం గోపాల్ పూర్ గ్రామంలో సిపిఐ ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రే లక్ష్మ ణ్, మండల కార్యదర్శి శనిగర పు రాజ్ కుమార్, కామెర వెంకటరమణ, నిమ్మల మనోహర్, తండముండయ్య, మర్రి విజయ్, సర్పంచ్ కర్రె లక్ష్మి, సూర మొగిలి, మాధవరావు, గడ్డం లలిత, కర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ అర్బన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్లే రామ్‌దాస్, గంగమ్మ, పెద్ది మధు, గిరిజన సంఘం నాయకులు సురేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ :** అంతరాలు లేని సమ సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేసే ఏకైక పార్టీ సిపిఐ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ తెలియజేశారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మాజీ సర్పంచ్ ఆర్.ఇంద్రమ్మ, జిల్లా సమితి సభ్యులు తుమమల శివులు, తప్పెట కిరణ్‌కుమార్, పెంట్లవెల్లి మండల కార్యదర్శి దేవ, సహాయం సహాయ కార్యదర్శి నిరంజన్ నాయుడు, కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శి రమణ, ఏఐటియుసి నాయకులు చాపల శేఖర్, బి. వరలక్ష్మి , కమల, హమాలీ యూనియన్ నాయకులు సత్యం, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ) ఆదరించాలని పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు కోరారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని హైదర్‌గూడ ఉప్పరపల్లిలో ఇంటింటికీ సిపిఐ మాస్ క్యాంపెనింగ్ నిర్వహించారు. సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రియాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్‌గౌడ్, మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మునీశ్వరి, కుకునూరు వాణి, ఎండి సాబీర్, పాండు, మౌనిక, జ్యోతి, ఊర్మిళ, శాలిని, అనిత, సునీత మధు, సిహెచ్ నర్సిరెడ్డి, జి.సత్యం, ఎఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజా, శాంతమ్మ పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ కోరారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జగద్గిరిగుట్టలోని బీరప్ప నగర్, దేవమ్మ బస్తీలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి కె.స్వామి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, నాయకులు హరినాథ్, బాబు, న్యాయవాది సత్యనారాయణ, సహదేవరెడ్డి, కె.వెంకటేష్, వీరస్వామి కొండయ్య, రాజు నాగేశ్వరి, చంద్రయ్య, బాలరాజు, ఇమామ్, సామెల్, ఆశయ పీటర్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా కథలాపూర్


రంగారెడ్డి...



కుత్బుల్లాపూర్...


ఎల్కతుర్తి...


ఆదిలాబాద్..


నాగర్‌కర్నూల్...

## ఎఐటియుసిలో కార్మికుల చేరిక




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** కార్మికులకు అండగా ఎఐటియుసి ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధి రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో చెరుకు మిషన్ వీధి వ్యాపార కార్మికులు ఇరవై మంది ఎఐటియుసిలో చేరగా అజయ్‌సారధిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, 18వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కార్మికుల పక్షాన ఎఐటియుసి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై అనేకమంది కార్మికులు చేరుతున్నారన్నారు. రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారస్తుల కార్మికులను అధికారులు ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. వీధి వ్యాపారుల చట్టం ప్రకారం కార్మికులందరికి ముద్ర రుణాలు ఇచ్చి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఎఐటియుసిలో చేరినవారిలో చెరుకు మిషన్ వీధి వ్యాపార కార్మికులు బయ్యా దేవేందర్, ఎండి.నదీమ్‌ఖాన్, భూక్య శ్రీను, కుంట వీరేందర్, ఖడ్గ వెంకయ్య, నక్క వెంకన్న, పొన్నం వీరన్న, గుదె నర్సయ్య, మహమ్మద్ రహీం, షేక్‌ఫయాజ్, చోడబోయిన అప్పన్న, నవీన్, ఎండి.హుస్సేన్, ఎండి.చాంద్, పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, తండా శ్రీనాథ్, రాజు ఉన్నారు.

## దళిత హక్కుల రక్షణకు పోరాటాలు




### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** దళిత హక్కుల రక్ష ణకు పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలో ఏప్రిల్ 17,18 తేదీలలో నిర్వహించే డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆదివారం క్యాతనపల్లి పట్టణంలో మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు ఇస్తామని చెప్పి దళితులను దగా చేసిందని లక్ష్మ ణ్ విమర్శించారు. వరంగల్ మహాసభల్లో దళితులపై జరుగుతున్న దాడులు, అసమానతలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం కోసం అన్ని శక్తులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా అధ్యక్షుడు మామిడి గోపి, మున్సిపల్ వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత, సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు కౌడగాని సాంబయ్య, మద్దెల శంకర్, మీనుగ ముని, నాయకులు మిట్టపల్లి పౌలు, గుమాస మల్లయ్య పాల్గొన్నారు.

## ఉప్పల్–నారపల్లి కారిడార్ పేరుమార్పు.. బిజెపి వైఖరిపై సిపిఐ ఆగ్రహం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని బిజెపి వ్యతిరేకించడం రాజకీయ ద్వేషానికి నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వియస్.బోస్ విమర్శించారు. ప్రజా భావాలను అవమానించే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడిన బోస్ మాట్లాడుతూ బండారి రాజిరెడ్డి కాప్రా మున్సిపాలిటీ చైర్మన్‌గా, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన నాయకుడని గుర్తుచేశారు. అలాంటి ప్రజానాయకుడి పేరును ఒక ప్రజా ప్రాజెక్టుకు ఇవ్వడాన్ని కూడా బిజెపి జీర్ణించుకోలేకపోవడం ఆ పార్టీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందన్నారు. ప్రజా సమస్యలపై స్పందించలేని బిజెపి, ఇప్పుడు పేర్ల రాజకీయంతో ప్రజలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉప్పల్–నారపల్లి కారిడార్ పూర్తిగా కేంద్ర నిధులతోనే నిర్మిస్తున్నామని బిజెపి చెప్పడం తప్పుదారి పట్టించే ప్రకటన బోస్ అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ.దామోదర్‌రెడ్డి, సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్య ప్రసాద్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మండల కార్యవర్గ సభ్యులు నర్సింహారావు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యమని జి.కృష్ణ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి మండలం ఇంద్రానగర్ సిపిఐ ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి ఉన్నటువంటి ఇంద్రానగర్ ప్రాంతంలో అభివృద్ధికి అమడ దూరంలో ఉందని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టి, అండర్ గ్రౌండ్ నిర్మాణం చేపట్టాలని, ఇక్కడి నివాసులకు ఉన్న చోటనే ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.దావీదు, కె.మనోచారి, కె.కృష్ణచారి, జి.రాములు, ఇ.ఉమారాణి, నారాయణ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో కడియాల పోచయ్య జ్ఞాపకార్థం అపోలో వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేద ప్రజలకు ఆరోగ్య పరిరక్షణకు నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామని ఆయన తెలిపారు.ఈ వైద్య శిబిరంలో 500 మందికి పైగా పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ,ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి,మాజీ చైర్మన్లు హరీష్‌రెడ్డి,జక్కా రోషిరెడ్డి,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు బొంతు శ్రీదేవి,పావనీరెడ్డి,ధన్‌పాల్‌రెడ్డి,సోమశేఖర్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## కీసరగుట్టలో స్వామివారిని తాకిన సూర్యకిరణాలు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అరుదైన ఆధ్యాత్మిక దృశ్యం ఆవిష్కృతమైంది. సాయంత్రం సూర్య భగవానుడు తన కిరణాలతో స్వామివారిని అర్చించిన దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంతో ముంచెత్తింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్‌శర్మ మాట్లాడుతూ సూర్యకిరణాలు స్వామివారి తాకడం అత్యంత పవిత్రమైన దివ్య సంఘటనగా పేర్కొన్నారు.ప్రతి ఏడాది ఇలాంటి అరుదైన దర్శనం లభించడం భక్తులకు అదృష్టమని అన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో ఎనిమిది మందికి అవకాశం

శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి ఎనిమిది మందికి అవకాశం లభించింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా కూన శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా ముడిమ్యాల రాముగౌడ్, జెమ్మి దేవేందర్, మోతె శ్రీనివాస్ యాదవ్, బొబ్బా రంగారావు, బుచ్చిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బాలప్ప, ఎర్వ వెంకట రమణలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా షాపూర్ నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ని జిల్లా కాంగ్రెస్ నూతన సభ్యులు కలిసి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ నూతనంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో నియమితులైన కార్యవర్గ సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంతో పాటు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా చేసేందుకు ప్రతిఒక్కరు శాయశక్తులా పాటుపడాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింతగా బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల గొంతుకగా అవతరించనున్న రాజకీయ పార్టీ

**తెలంగాణ జాగృతి బిసి రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య**



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** తెలంగాణ ప్రజల గొంతుకగా రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ అవతరించనుందని తెలంగాణ జాగృతి రాష్ట్ర బిసి అధ్యక్షులు ఎత్తరి మారయ్య అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితక్క ఆధ్వర్యంలో నూతన పార్టీ ఆవిర్భావం సందర్భంగా వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. రాష్ట్ర జాగృతి బిసి అధ్యక్షులు ఎత్తరి మారయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 25వ తేదీన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీని ప్రజల ముందుకు తీసుకువస్తున్నారని తెలిపారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 25న ఉదయం ఎనిమిది గంటలకు నూతన రాజకీయ పార్టీని ప్రకటించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని మారయ్య కోరారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల మనోజ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, ఎంబీసి అధ్యక్షురాలు మంజుల, నాయకులు నీలం వీరేందర్, గుర్రం వెంకన్న, చామర్తి సీతారాం, నవీన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

**● ప్రభుత్వ భూముల్లో దర్జాగా నిర్మాణాలు ● కబ్జాదారులకు అండగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులు**



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మమండల పరిధిలోని విలువ చేసే ప్రభుత్వ స్థలలు అన్యాక్రాంతం అవుతున్నాయి. డి.పోచంపల్లి సర్వేనెంబర్ 120, చర్చ్ గాగిలాపూర్ సర్వేనెంబర్ 214, దుండిగల్ తాండ సర్వేనెంబర్ 684లలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తూ కొందరు విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగులు తూతూ మంత్రం చర్యలు చేపట్టి తొందరగా కోర్టు నుండి స్టే తెచ్చుకోండి అంటూ సలహాలు ఇచ్చి వారికి వత్తాసు పలుకుతున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి. ఇటీవలే రెవెన్యూ ఉద్యోగాలలో చేరిన జిపిఒ, విఆర్‌ఎ ఆధీనంలోనే నిర్మాణాలు బాహాటంగా నిర్మిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు కబ్జాదారులు కాలం చెల్లిన పట్టాలు 58, 59 జిఒలు ఉన్నాయంటూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేసిన జిఒలు తాత్కాలికంగా నిలుపుతున్నామని ఆదేశాలు జారీ చేసిన దుండిగల్ రెవెన్యూ విభాగంలో వాటికి తూట్లు పడుతున్నాయి. కబ్జాదారులు జిఒలను, కాలం చెల్లిన పట్టాలను చూపుతూ నిర్మాణాలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు అడ్డుపడకుండా ప్రభుత్వం జారిచేసిన ఆదేశాలను బెకతార్ చేస్తూ పరోక్షకంగా నిర్మాణదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడేందుకు విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగులు వారికి సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నేటికైనా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం గురి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# పేద ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలిన ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**ప్రజాపక్షం/తాండూరు :** ఇంటింటికి సిపిఐ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ శ్రీకారం చుట్టారు. సిపిఐ ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరులో పర్యాటించారు. అంతకు ముందు బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలి కార్పొరేట్‌కు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా దేశంలో కార్మికులు, రైతులు, పేదల విషయానికి వస్తే ప్రభుత్వం వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని దుయ్యబాట్టారు. మార్పులు తీసుక రావడం వల్ల మరింత కష్టాల్లోకి నెట్టడం జరిగిందన్నారు. వారి జీవన ప్రణామాలు పెరగక ఆర్థికంగా మరింత చితికిపోయే విధంగా పరిస్థితి దాపురించిందన్నారు. యుద్ధం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు గ్యాస్, పెట్రోల్ లభించక ధరలు పెగిరి ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోంటున్నారన్నారు. అమెరికా, ఇజ్రాయోల్ వంటి దేశాలకు తమ వైకరిని తెలియజేస్తూ వారిపై ఒత్తిడి తీసుకరావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవిందర్, వెంకటేష్, సురేష్, కౌన్సిల్ సభ్యులు చంద్రయ్య, పార్టీ నాయకులు రాజేందర్ తదితరులు పాల్గోన్నారు.

## అక్నాపూర్ గ్రామానికి బస్ సర్వీస్‌లు పునరుద్ధరించాలి!

**సర్పంచ్ అరుణ బంధయ్య గౌడ్, అనసూజా అనంతరాములు**



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ డిపో నుండి అక్నాపూర్,చించల్ పేట్ గ్రామాల వరకు గతంలో మాదిరిగా రద్దు చేసిన బస్సు సర్వీసులను యధావిధిగా పునరుద్ధరించాలని చించల్ పేట్ సర్పంచ్ జి.అనసూజా అనంతరాములు, అక్నాపూర్ సర్పంచ్ అరుణ బంధయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్‌లోని డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో అక్నాపూర్ గ్రామానికి పది ట్రిప్పులు వచ్చేది ఇప్పుడు ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తుంది. గతంలో మాదిరిగానే అదనంగా మూడు సర్వీస్‌లు పొడిగించాలని ఇన్‌చార్జ్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో మాదిరిగానే రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించిన్నట్లయితే విద్యార్థులకు, ఉపాధికోసం వెళ్లే వారికి, అలాగే పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లే వారికి రవాణా సౌకర్యం లేక రెండు, మూడు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బస్ సర్వీస్‌లు ఇంతకు ముందులాగా పునరుద్ధరించినట్లయితే అందరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే చదువుకునే విద్యార్థులకు బస్సు పాసులు మంజూరు చేశారే కానీ, అందుకు తగినట్లు బస్సులు నడపడం లేదని వాపోయారు. దీంతో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు సకాలంలో రాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైన రవాణా సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు చదువులు మానేసే పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై ఆర్‌టిసి అధికారులు స్పందించి మరో మూడు అదనపు సర్వీస్‌లు పొడిగించాలన్నారు.

## అక్రమ కార్యాకలాపాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/వికారాబాద్ :** అక్రమ కార్యాకలాపాలపై ఉక్కు పాదం మోపడం జరిగిందని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తాజా నిర్వహించిన దాడుల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి తెలిపారు. రేషన్ బియ్యం నిల్వలపై దాడులు కుల్కచర్ల మండల కేంద్రంలో పిడిఎప్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్నరనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిఐ అన్వర్ పాషా బృందం దాడులు నిర్వహించి కుల్కచర్ల గ్రామానికి చెందిన అంగడి ప్రదీప్ 38 నిల్వ ఉంచిన బస్తలు 1900కిలలో బియ్యాని ,ముగుద రవితేజ దగ్గర 31 బస్తాలు స్వాధీనం చేసుకోకొని నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పేదలకు చెందిల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదరి పట్టించినా ,బహిరంగ ప్రదేశాల్లో పేకట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించేప్రసక్తే లేదని జిల్లా ఎస్‌పి తెలిపారు.

## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో శ్రీనివాస్‌రెడ్డి భేటీ



**ప్రజాపక్షం/తాండూరు :** రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సిఎం సలహాదురుడు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మార్యద పూర్వకంగా కలుసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసలంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డిని తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా బేటి అయ్యారు.ఈ సందర్భంగా పలు రాజకీయ విశాయాలపై మాట్లాడారు.

## కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటిన మోక్షదృతి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కూచిపూడి సంగీతం నృత్యాలతో సాంస్కృతిక వాతావరణం నెలకొన్న ఘట్‌కేసర్ సర్కిల్ ఎన్ఎఫ్‌సి నగరకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి మోక్ష దృతి తన అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిందని తెలంగాణ జాగృతి ఫౌండేషన్ అధ్యక్షులు పద్మ వెంకటేష్ అన్నారు.హైదరాబాద్ నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణ వైభోగం సంగీత నృత్య నిరాజనం కార్యక్రమం కళా ప్రియులను ఆకట్టుకుంది.రామాయణంలోని సీతారాముల కల్యాణ ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని ఆమె అందించిన నృత్య రూపకం భావప్రధానంగా సాంప్రదాయ సౌందర్యంతో నిలిచిందని మోక్ష దృతిని కోదండ రామ అవార్డుతో పాటు జ్ఞాపికతో సత్కరించారు.ఆమె ప్రతిభను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలను చేరాలని ఆశీర్వదించారు.అధ్యక్షులు రాము,తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**ప్రజాపక్షం/వికారాబాద్:** పట్టణంలో నిర్వహించిన స్వాతంత్ర సమరయోధులు దివంగత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవల్లో ముఖ్య అతిథిగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా , అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ,మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య , మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ , మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి నాయకులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా బిజెఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రసిద్ధ స్వాతంత్ర సమర యోధులు , సంఘ సంస్కర్త మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. అయన కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రిగా సుధీర్ఘకాలం దేశానికి సేవలు చేశారు. స్వాతంత్రోద్యమం సందర్భంగా క్విట్ ఇండియా సత్యాగ్రహం తదితర కార్యక్రమాలో చురుగ్గా పాల్గోని జైలుకు వెళ్లారు అని అన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీమాట్లాడుతూ జ్ఞానాన్ని పెంపొందించేందుకు వీలుగా స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తారన్నారు.జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా మాట్లాడుతూ ,ప్రజలందరికీ సమాన అవకాశాలు కలగాలని ఎంతో మంది మహనీయులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్య, ఉత్సవ కమిటి అధ్యక్షులు రామచంద్రయ్య తదితరులు పాల్గోన్నారు.

**జవహర్‌నగర్‌లో...**



బాబు జగ్జీవన్‌రాం బడుగు బలహీనవర్గాలు, దళితుల అభ్యున్నతికి చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ నేతలు అన్నారు. ఆదివారం నిర్వహించిన జవహర్‌నగర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్ష వర్గం సురేందర్ పరశురాం ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, నిమ్మల నర్సింలు, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో....**



అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల డివిజన్, కుత్బుల్లాపూర్ గ్రామం చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సూరారం ప్రధాన రహదారిలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందలు వేర్వేరుగా విచ్చేసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు జగన్, సురేశ్ రెడ్డి, నాయకులు కిషన్ రావు, సత్యనారాయణ, రాంచందర్, ఎల్లయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్ సర్కిల్‌లో...**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్‌లోని రాజీవ్ గృహకల్ప, సాయినగర్ తదితర ప్రాంతాలలో జరిగిన జయంతి వేడుకల్లో బిఆర్‌ఎస్ సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ దన్‌రాజ్‌లు పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**బాచుపల్లిలో...**




బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బిఆర్‌ఎస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ విచ్చేసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు బాబు జగ్జీవన్ రామ్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

**సూరారంలో.........**



బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డిలు వేర్వేరుగా విచ్చేసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**యంనంపేట్ చౌరస్తాలో....**



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి అన్నారు. మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం భారత స్వాతంత్ర్య సమర యోధుడు భారతమాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా యంనంపేట్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మలి పెద్ది సుదీర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, పోచారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్,మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొని బాబు జగ్జీన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షులు సార శ్రీనివాస్ గౌడ్,మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజి రెడ్డి,మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి,కీసరగుట్ట దేవస్థానం ధర్మకర్త సగ్గు అనితశ్రీనివాస్,మెరుగు నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధకృష్ణ ముదిరాజ్,మేకల దాస్,శ్రీనివాస్,బచ్చు నాగేష్ గుప్త పాల్గొన్నారు.

**హెచ్‌ఎంటి నగర్ డివిజన్ పరిధిలో**



హెచ్‌ఎంటి నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక సంక్షేమం ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఎం.సంజన్న, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి హాజరై, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో...**

భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుద్దు రాహుల్ మాట్లాడుతూ, నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.



**దేవరయాంజాల్‌లో...**



శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలు ఎంఆర్‌పిఎస్ నాయకుడు బంగరిగళ్ల శంకర్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవరయాంజాల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కళా మండలి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్, మాజి సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ తిరుపతి శంకర్‌గౌడ్, మాజి చైర్మన్ లక్ష్మి నారాయణ, తదితర నాయకులు, ధర్మకర్తలు, యువకులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో..**



మూడుచింతలపల్లి మున్సిపల్‌లో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు బూరుగు రమేష్ ఆధ్వర్యంలో బాబు జగ్జివన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జాం రవి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్‌లు ముఖ్య అతిథిగా విచ్చేసి జగ్జివన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, మాజి ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, నాయకులు జగన్నాదం, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్ నియోజకవర్గంలో**

వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో బాబుజగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్త అన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.



# దేవాలయ నిర్మాణానికి తోడ్పాడు



ప్రజాపక్షం/కొందుర్గు: జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్న పేట గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయ నిర్మాణానికి రూ.4లక్షల విలువ చేసే గ్రానైట్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దైవభక్తి కలిగి ఉండాలని, అప్పుడు మనస్సుకు ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు. దేవాలయ నిర్మాణంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్, సర్పంచ్ సుమలత వెంకట్‌రాములు, మాజీ సర్పంచ్ గౌస్, మాజీ ఎంపిటిసిలు రాములు, మాణయ్య, నాయకులు జహంగీర్, సలీం, సత్యం, నర్సింలు, అమీర్, శేఖర్, శివ, చంద్రబాబు, బుచ్చయ్య, లక్ష్మయ్య, బాలరాజ్, సోహైల్, రమేష్‌లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యాలు చేయటం తగదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజా అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ప్రశాంత్ కుమార్‌రెడ్డికి లేదన్నారు. 15 ఏళ్లుగా ప్రజా సమస్యలు విస్మరించి భూ కబ్జాలు, అవినీతి అక్రమాలు చేసి ప్రజా ధనాన్ని దోచ్చుకోని దాచ్చుకున్న ఘన చరిత్ర మాజీ ఎమ్మెల్యేకు ఉందని అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే నియోజకవర్గం ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పట్నం నియోజకవర్గం వేగవంతంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంటే చూసి ఓర్వలేక మతిభ్రమించి రంగారెడ్డిని విమర్శించటం సిగ్గు చేటన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర చారీ, పాండురంగారెడ్డి, జంగారెడ్డి, నీళ్ళ భాను, రాందాస్, చందు, ఆనంద్, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు



ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వ రైతులను ఇబ్బందుకు గురి చేస్తే సహిచేదిలేదని గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితులు హెచ్చరించారు. గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణ బాధితులు చేస్తున్న రిలే నిరహర దీక్షలు 20 వ రోజుకు చేరాయి. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ ఫార్మసిటీకి రైతులను మోసం చేసి భూములు బలవంతగా తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు పభ్యులు మధురనాయక్, శంకర్, రామకృష్ణ, జైపాల్, గోపి, సురేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేశ్, రవిందర్, రాజు, రమేశ్, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం భాదితులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టే మాటలను మానుకోవాలి : కాంగ్రెస్



ప్రజాపక్షం/యాచారం : బిఆర్ఎస్ నాయకులు మల్‌రెడ్డి రంగారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని యాచారం మండల మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మ డిమాండ్ చేశారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యక్తి గతంలోగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తన స్థాయిని మర్చి ఎంఎల్ఎను విమర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇష్టా రాజ్యంగా మాట్లాడితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే నియోజకవర్గం ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు వరికుప్పల సుధాకర్, ముచ్చర్ల సంపత్, తిరుమలేశ్,పాండురంగారెడ్డి,అక్బర్,సాజీద్,నర్రె శ్రీశైలం,రవింధర్‌రెడ్డి, నల్లవెల్లి సర్పంచ్ కిషన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పిరంగి నాలా కబ్జా పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/శంకర్ పల్లి: శంకర్ పల్లి మండలంలోని మొకిలలో ఎన్నో ఏండ్ల నుంచి ఉన్న పిరంగి నలను బిఎస్ఎన్ఎల్ వెంచర్ యాజమాన్యం నాలా పై రోడ్ వేసి పిరంగి నలను కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు, ఇప్పటికే పిరంగి నెలపై రోడ్ వేయడానికి కంకర డస్ట్ వేసి చదును చేస్తున్నారు, ఈ పిరంగి నాలా శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ మొదలై హైదరాబాద్ వైపు ఎన్నో ఏండ్ల నుండి పరుతుంది రియల్ ఎస్టేట్ పుణ్యమా అని అది కనుమరుగు అయ్యో ప్రమాదం ఏర్పడింది, ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పిరంగి నలను సర్వే చేసి అక్రమాలను తొలగించి నాలా హద్దుబందులు ఏర్పాటు చేయాలనీ రైతులు గ్రామస్తులు కోరుతున్నాను

**ఇరిగేషన్ వివరణ ...** ఈ విషయం పై స్థానిక ఇరిగేషన్ ఏఈని వివరణ కోరగా పిరంగి నాలా కాబ్జకు గురైనట్లు తన దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి కబ్జాకు గురైనట్లు తెలితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం అని చెప్పారు.

# దేశానికి ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్ రామ్

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి : దేశానికి ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని నాంపల్లిలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారినవర్గాల హక్కు ల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు మనం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

షాద్‌నగర్: స్వాతంత్ర సమరయోదుడు.. గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ అని. వాని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ డివిజన్‌లోని కొత్తూరు, కొందుర్గు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.

## మహనీయుల అడుగు జాడలో నడవాలి

దేశానికి ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ ఛైర్మన్ అందె మోహన్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైరన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కౌన్సిలర్లు పెంటయ్య, దిలీప్, నేతలు రఘునాయక్, బాదేపల్లి సిద్దార్థ, జాంగారి రవి, సింగపాగ అనిల్ , లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, శేఖర్ పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** బారతదేశ మాజీ ఉపప్రధాని, సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను ప్రజలందరూ అదర్శంగా తీసుకోవాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ, తాజా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాహెబ్ నగర్ చౌరస్తాలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం కమిటీ అధ్యక్షులు జగన్మోహన్, యంజాల బిక్షపతి, పారంద యాదయ్య, కొంగర మహేష్, నరేష్, జంగయ్య, బాబుచ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నివాళి అర్పించిన లక్ష్మి ప్రసన్న ...**జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా సాహెబ్ నగర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీ అధ్యక్షులు జగన్మోహన్, యంజాల బిక్షపతి, పారంద యాదయ్య, కొంగర మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అయన విగ్రహలకు పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమాల్లో పవన్‌కళాణ్, శరణం, అంజయ్య, అబ్బయ్య, సాయిలు, జాని, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.







# హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యం



ప్రజాపక్షం/కొత్తూరు : హిందూ ధర్మ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కు హిందువులందరు ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని స్వామి దుర్గానంద పూరి పీఠాధిపతులు పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఎల్లారం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం ఒక మతం కాదని, అది ప్రపంచానికే దిక్సూచి వంటి జీవన విధానమని ఉద్ఘాటించారు. సంస్కృతి, సంప్రదాయాలను బావితరాలకు అంధించడం ప్రతి హిందువు బాధ్యత అని, కులమత వైషమ్యాలను వీడి హిందువులందరు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ధర్మ రక్షణలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి ఇంట్లో సంస్కారవంతమైన విద్యాబోధన జరగాలని సూచించారు. పెద్ద ఎత్తున హిందూ సమ్మేళనం ఏర్పాటు చేసిన ఎల్లారం శేఖర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినంధించారు. సభకు వచ్చిన హిందువులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించిన వక్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల పక్షాన పోరాడే సిపిఐకి చేయూతనివ్వండి

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి

ప్రజాపక్షం/హయత్ నగర్: నిరంతరం పేదల పక్షాన పోరాడే సిపిఐకి చేయూతనివ్వాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి కోరారు. ఆదివారం మన్సూరాబాద్‌లో పర్యటించిన ఆందోజు రవీంద్ర చారి సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్‌లో "పోరాటాల పార్టీకి చేయూతనివ్వండి" అనే నినాదంతో "ఇంటింటి సిపిఐ" కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆందోజు రవీంద్ర చారి, నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి హాజరై ప్రజల నుండి విరాళాలు సేకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..




నూరేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాలకు, పోరాటాలకు ఎప్పుడూ ప్రజా విరాళాలే మూలధనమని గుర్తుచేశారు. ప్రజల మద్దతుతోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని, తద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా పోరాడుతుందని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శి సుజాత, మమత, పద్మ, స్వప్న, జ్యోతి, కృష్ణలీల, గంగాధర్, శ్రీను, గడ్డపాటి యాదయ్య, కట్టి పార్వతి, సుమలత, భద్రమ్మ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రభుత్వంలో అన్నిమతాలకు గౌరవం

## టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్

ప్రజాపక్షం/హయత్‌నగర్ : తెలంగాణలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తుందని అని టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. ఆదివారం హయత్‌నగర్ డివిజన్‌లోని రాక్ హిల్స్ కాలనీలోని యూనివర్సల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా పాస్టర్లు మధుయాష్కీకి ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీకి మాట్లాడుతూ సమాజంలో మానవత్వం, ప్రేమ, ఎదుటివారిని ఆదుకునే సేవా గుణాన్ని ఏసుక్రీస్తు బోధించారని పేర్కొన్నారు. ఈస్టర్ యేసు క్రీస్తు పండుగను పవిత్రమైన పండుగ యేసును భక్తులు జరుపుకుంటారన్నారు. శాంతికి చిహ్నంగా ప్రతీకగా యేసు క్రీస్తులు విశ్వాసులకు కొత్త నిరీక్షణను, సంతోషాన్ని, ఆధ్యాత్మిక ఇస్తుందని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం అన్ని మతాల ప్రజలకు సమాన హక్కులు హక్కులు కల్పించిందన్నారు. కానీ కొందరి విద్వేష రాజకీయాలతో మతాల మధ్య, ప్రజల మధ్య వైశ్యమాలు పెంచాలని చూస్తున్నారన్నారు. అన్ని మతాలను గౌరవించే సెక్యులర్ విధానం కాంగ్రెస్ పార్టీదన్నారు. సమాజంలో విద్వేషాన్ని వీడి.. ప్రేమ, సోదర భావం పెంపొందించాలన్న లక్ష్యంతో రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ ఆర్. గిడియన్ ప్రేమ్ కుమార్ గారు, వైస్ ప్రెసిడెంట్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జి.ఆల్ఫ్రెడ్ , సెక్రటరీ ఎబెనైజర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏసుదాస్, బిషప్ భక్తవత్సలం, సంపత్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్దా సత్యానారాయణ గారు, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, దేవాలయ కమిటీల డైరెక్టర్లు కంచర్ల కవిత, భవాని శంకర్, నాయకులు షరీఫ్, కందికంటి శ్రీధర్ గౌడ్, చెరుకు చిరంజీవి గౌడ్, శ్రీనాథ్, శరత్ యాదవ్, రమేష్, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.




# శాంతికి చిహ్నంగా ఈస్టర్ వేడుక

## ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : శాంతికి చిహ్నంగా ఈస్టర్ వేడుక జరుపుకుంటామని, యేసు చనిపోయి తిరిగి లేవడం జరిగే పండుగను ఈస్టర్ యేసు క్రీస్తు పునరుత్థానాన్ని అని అంటారని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్‌లోని గుంటి జంగయ్య కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన క్రీస్తు పునరుత్థాన ఆరాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవత్వం, ప్రేమ, ఎదుటివారిని ఆదుకునే సేవా గుణాన్ని ఏసుక్రీస్తు బోధించారని పేర్కొన్నారు. ఈస్టర్ యేసు క్రీస్తు పండుగను పవిత్రమైన పండుగ యేసును భక్తులు జరుపుకుంటారన్నారు. శాంతికి చిహ్నంగా ప్రతీకగా యేసు క్రీస్తులు విశ్వాసులకు కొత్త నిరీక్షణను, సంతోషాన్ని, ఆధ్యాత్మిక ఇస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, క్రైస్తవులు డాక్టర్ కె.వి.ఎన్ జాకబ్, దేవానంద్, బి.వి.ప్రసాద్, సురేష్, ఎపాప్రా, ఏసుపాదం, సుదర్శన్, ఎన్. రంగారావు, జోసఫ్, సన్నీ, జాన్ పాల్గొన్నారు.



# అక్షయ విద్యా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

## డిజిపి శివధర్ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: అక్షయ విద్యా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం అని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఆదివారం అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సీట్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను గౌరవించేందుకు సైబరాబాద్ సిపి కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి బి శివధర్ రెడ్డి, సైబరాబాద్ హెడ్ క్వార్టర్ లో పికిల్‌బాల్ కోర్టును ప్రారంభించారు.అనంతరం ఆయన ఆటలో పాల్గొని కొంతసేపు ఆడారు. కార్యక్రమానికి పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్,సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్,అక్షయ విద్యా ఫౌండేషన్ చైర్మన్ జె వివేక్ ఆనంద్,వ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు టి.ప్రసాద్, వ్యవస్థాపకుడు,ట్రస్టీ ఎస్. జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్న ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారి విజయానికి కారణమైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు, ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్నవారు అవసరం ఉన్నవారి కోసం కొంత భాగాన్ని కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఈ దిశగా ఎస్.జనార్ధన్ వారి కుమారుడు టి.ప్రసాద్ అక్షయ విద్యా ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సమాజానికి ఇటువంటి ఫౌండేషన్లు ఎంతో అవసరమని, నాశనం కాని అక్షరానికి నాందిగా అక్షయ విద్యా ఫౌండేషన్ నిలుస్తోందన్నారు. విద్య సరిగా లేని ప్రాంతాల్లో ప్రజల దృష్టి, ప్రభుత్వ దృష్టి తగ్గే అవకాశం ఉండటంతో పాటు నేరాల శాతం పెరిగే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అలాంటి ప్రాంతాల్లో అక్షయ విద్యా ఫౌండేషన్ రాత్రి సమయాల్లో కూడా ట్యూషన్లు, స్టడీ అవర్స్ నిర్వహిస్తూ గత 16 సంవత్సరాలుగా నిరంతరం సేవలందించడం ప్రశంసనీయం అని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. టూ వీలర్‌పై ప్రయాణించే ప్రతిసారీ హెల్మెట్ ధరించడం భయంతో కాదు, బాధ్యతగా చేయాలని కోరారు. చాలామంది హెల్మెట్ ధరించినప్పటికీ స్ట్రాప్ బకిల్ (బెల్టు) పెట్టుకోక పోవడం వల్ల ప్రమాద సమయంలో అది జారి పోయి రక్షణ కలగడం లేదని వివరించారు. విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించే అలవాటు కల్పించాలని కోరుతూ,సమాజానికి గొప్ప సేవ అందిస్తున్న అక్షయ విద్యా ఫౌండేషన్‌ను అభినందించారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
06-04-2026
www.prajapaksham.in

"నేషనల్ క్రష్ రష్మిక లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న ఫీమేల్-సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మైసా. దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు."

రీల్


# 'డెకాయిట్' ఓ ప్రేమజంట జీవితంలో జరిగే కథ



డెకాయిట్ కథ హరి, జూలియెట్ మధ్య ఉన్న ఇంటెన్స్ బాండింగ్ చుట్టూ తిరుగుతుంది. ఒక ప్రశాంతమైన జీవితానికి కలలు కంటున్న ఈ జంట జీవితాన్ని, ఒక ద్రోహం పూర్తిగా మార్చేస్తుంది. హరి జైలుకు వెళ్లాల్సి వస్తుంది. కానీ అతని పరారితో కథ మళ్లీ మలుపు తిరుగుతుంది. ఈ సమయంలో జూలియెట్ తన అనారోగ్యంతో ఉన్న కుమార్తె ప్రాణాలను కాపాడటానికి పెద్ద మొత్తంలో డబ్బు కోసం పోరాడుతుంది. ఈ పరిస్థితుల్లో, హరి ప్రేమికుడి నుంచి సర్వైవర్‌గా మారి, జూలియెట్ అవసరాన్ని ఉపయోగించుకుంటూ క్రైమ్ ప్రపంచంలోకి అడుగుపెడతాడు. మృణాల్ ఠాకూర్ జూలియెట్ పాత్రలో ప్రేమికురాలిగా, తల్లిగా రెండింటినీ అద్భుతంగా నటించారు. అనురాగ్ కశ్యప్ కూల్, టెర్రిఫిక్ పోలీస్ పాత్రలో, ప్రకాష్ రాజ్ తన అనుభవంతో కథకు బలాన్ని ఇచ్చారు. అలాగే సునీల్, అతుల్ కులకర్ణి వంటి నటులు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. ధనుష్ భాస్కర్ సినిమాటోగ్రఫీ సినిమాకు స్టైలిష్ లుక్‌ను ఇచ్చింది. జ్ఞాని అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. నిర్మాత సుప్రియా యార్లగడ్డ, కో ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రం రూపొందింది. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రం, ట్రైలర్‌కి తగ్గట్టే అడివి శేష్, షానీల్ డియో కలిసి ఒక హై వోల్టేజ్ సినీమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతున్నారు.డైరెక్టర్ షానీల్ గురించి చెప్పాలంటే, ఆయన చెప్పేటప్పుడు భోజ్‌పురి కల్చర్ ఫ్లేవర్ కనిపిస్తుంది. అందుకే ఆ కల్చర్‌ని రిప్రజెంట్ చేయడానికి పవన్ సింగ్ ని తీసుకొచ్చాం. మృణాల్ ఈ సినిమాలో అద్భుతంగా నటించింది.

ఈ ట్రేలర్ రిలీజ్ కార్యక్రమంలో అనురాగ్ కశ్యప్ ,డైరెక్టర్ శానిల్ , నిర్మాత సుప్రియ యార్లగడ్డ , నటుడు సునీల్, డీఓపీ ధనుష్ భాస్కర్, రైటర్ అబ్బూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## వేణు ఊడుగుల సమర్పణలో
# 'సైన్మా' స్టూడియోస్ చిత్రం




రాజు వెడ్స్ రాంబాయి చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించిన డా. నాగేశ్వరరావు పూజారి తన సైన్మా స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 1 చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సక్సెస్ ఫుల్ దర్శక నిర్మాత వేణు ఊడుగుల సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు పివిఎన్ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం నిర్మాత డా.నాగేశ్వరరావు పూజారి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ ఈ మూవీ అనౌన్స్ మెంట్ తో పాటు పోస్టర్, మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ఒక అమ్మాయి కంటిని, ఆ కంటిలో అన్నా తమ్ముడు సైకిల్ పై వెళ్తుండటం చూపించారు. ఈ ప్రకృతి మనకు ఇచ్చిన స్నేహితుడు మన సోదరుడు, కానీ ఆ బంధానికి మధ్యలో అహం అనే అడ్డుగోడలు మనమే నిర్మించుకున్నాం. అంటూ పోస్టర్‌పై రాసిన క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నామని చిత్ర సమర్పకులు వేణు అడుగుల తెలిపారు.

# 'గేదెల రాజు'గా రఘు కుంచె



సంగీత దర్శకుడు, నటుడు, సింగర్ రఘు కుంచె టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'గేదెల రాజు'. ఈ సినిమాలో రవి ఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మౌనిక కీలక పాత్రల్లో నటించారు. మోటూరి టాకీస్ పతాకంపై రఘు కుంచె సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. 'గేదెల రాజు' సినిమా నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. మా మూవీని మీరే ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలి. రఘు కుంచెతో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. ఈ సినిమాకు రఘు కుంచె మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో నేను ఒక ఇంపార్టెంట్ రోల్ చేశాను. మా మూవీలో మంచి కంటెంట్ ఉందని మేము నమ్ముతున్నాం. ఈ నెల 17న థియేటర్స్ లో సినిమా చూసి మీ రెస్పాన్స్ తెలియజేస్తారని కోరుకుంటున్నా.ఈ కార్యక్రమంలోనటుడు రవిఆనంద్ చిన్నిబిల్లి, కో ప్రొడ్యూసర్ తాడాల వీరభద్రరావు, ప్రొడ్యూసర్ వాణి రవికుమార్ మోటూరి, నటుడు రామచంద్రం, నటుడు కిష్టయ్య, డైరెక్టర్ చైతన్య మోటూరి.

# 'మైసా'లో రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మైసా. దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఆకట్టుకున్న టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌లు, టీజర్ తో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రష్మిక పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రష్మిక గాయాలతో నిండిన, యుద్ధం చేసినట్లుగా కనిపించే లుక్‌లో కనిపిస్తోంది. ఆమె ముఖం మీద మట్టి, పొగ, రక్తపు మరకలు కనిపిస్తుండగా, ముక్కు, చెంపలు, నుదుటిపై ఉన్న గాయాలు ఆమె పాత్ర ఎదుర్కొన్న క్రూరత్వాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. అయినప్పటికీ, ఆమె కళ్లలో కనిపించే ఆగ్రహం, తీవ్రత మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఆ పాత్రకు అవసరమైన రా ఫెరోసిటీని అద్భుతంగా ప్రతిబింబిస్తోంది. గోండు తెగల సాంస్కృతిక నేపథ్యంతో తెరకెక్కుతున్న మైసా సినిమాలో రష్మికను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఓ శక్తివంతమైన గోండు మహిళగా కనిపించనున్నారు.

# 'జయమ్మ'గా...



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీ 'రణబాలి'. ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. నేషనల్ క్రష్ రశ్మిక మందన్న బర్త్ డే సందర్భంగా స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు ఈ మూవీ మేకర్స్. ఈ వీడియోలో రశ్మిక ఎంత సహజంగా జయమ్మగా మారిపోయిందో చూపించారు. రణబాలి బలం జయమ్మ, అతని సంతోషాలకు కారణం జయమ్మ అంటూ ఈ వీడియోలో పేర్కొనడం ఈ జంట మధ్య ఉన్న ప్రేమను తెలియజేస్తోంది.ఈ సినిమాలో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ, జయమ్మగా రశ్మిక మందన్న ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి మ్యూజిక్ అజయ్ అతుల్, డిఓపి నీరవ్ షా, రైటర్ ప్రమోద్ తమ్మినేని, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్, ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, యాక్షన్ కొరియోగ్రాఫర్స్ యెన్నిక్ బెన్, ఆండీ లాంగ్ గ్యుయెన్, రాబిన్ సుబ్బు.

# 'నిజమేనా' పాట ఆవిష్కరణ

హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కెఎ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయితేజ్, వేద జలంధర్ హీరో–హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా నుంచి' నిజమేనా' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటను ఎమోషనల్ ఫీల్ తో వంశీకాంత్ రేఖన కంపోజ్ చేశారు. సనరే లిరిక్స్ రాయగా, యువ గాయని జయశ్రీ పల్లెం పాడారు. 'నిజమేనా నిజమేనా నే విన్నది నిజమేనా, నువు పలికిన ఆ మాటే పొరబడి విన్నానా, నిజమేనా నిజమేనా నువ్వన్నది నిజమేనా కను తెరిచి నీ ముందే కలనే కన్నానా, ప్రతి క్షణం నీ వెంటే ఇన్నాళ్లుగా తిరిగానే, నేనేమిటో కొంచెం కూడా అర్థం కాలేదా...' అంటూ హార్ట్ టచింగ్‌గా సాగుతుంది పాట. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ సుధీర్ మాచర్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కెఎల్ మదన్, డిఒపి అక్షయ్ రామ్ పొదిశెట్టి, మ్యూజిక్ వంశీకాంత్ రేఖన, కో ప్రొడ్యూసర్ తేజ వేల్పుచర్ల, ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం, రచన, ఎడిటింగ్, దర్శకత్వం వి.మునిరాజు.



# యువత క్రీడల వైపు మళ్లకపోతే దేశ భవిష్యత్తుకు తీవ్ర నష్టం

### జాతీయ పోలీసు ఫుట్‌బాల్ పోటీల ముగింపు ఉత్సవాల్లో సిఎం రేవంత్‌రెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత క్రీడలవైపు మళ్లకపోతే దేశ భవిష్యత్తుకు తీవ్ర నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న జాతీయ పోలీసు ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల ముగింపు ఉత్సవాలకు సిఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పబ్, డ్రగ్స్ సంస్కృతిలోకి వెళ్లుతున్న యువతను తిరిగి క్రీడా మైదానాల్లోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం, హైదరాబాద్‌కు భారత ఫుట్‌బాల్ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1950–60 కాలంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరుగాంచిందని, దేశానికి అగ్రశ్రేణి క్రీడాకారులను అందించిందని గుర్తుచేశారు. 1956 ఒలింపిక్స్ ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు హైదరాబాద్‌కు చెందినవారేనని తెలిపారు.టోర్నమెంట్‌లో దేశం నలుమూలల నుంచి వచ్చిన 34 జట్లు ప్రతిభను చాటుకున్నాయని, అన్ని జట్లను అభినందించారు. హైదరాబాద్ పోలీస్ ఫుట్‌బాల్ జట్టుకూ దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు.యువత క్రీడల నుంచి దూరమవడం ఆందోళనకరమని, క్రీడా మైదానాలను వదిలిపెట్టడం తప్పు నిర్ణయమని సిఎం పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీను ఏర్పాటు చేస్తున్నామని, పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో దీనిని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.దక్షిణ కొరియా వంటి చిన్న దేశం అనేక ఒలింపిక్ పతకాలు సాధిస్తుండగా, భారతదేశం వెనుకబడటం ఆలోచనీయమని అన్నారు. యువతకు సరైన మార్గదర్శనం అవసరమని, అందుకోసమే అంతర్జాతీయ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీను హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎస్‌సి, ఆదివాసీ పిల్లలకు మెస్సీతో కలిసి ఆడే అవకాశాన్ని కల్పించామని చెప్పారు.క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్1 ఉద్యోగంతో పాటు నగదు ప్రోత్సాహం అందించామని, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ప్రత్యేక సడలింపులతో డిఎస్‌పి ఉద్యోగం ఇచ్చామని తెలిపారు. పరాలింపిక్స్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారిణులకు కూడా అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.డ్రగ్స్, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సమాజం మొత్తం కలిసి యువతను సరైన దిశలో నడిపించాలని సీఎం పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించే తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఖాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వాన్ని కదిలిస్తుందా?

(మొదటి పేజీ తరువాయి)

తమ స్పష్టమైన హామిలను తెలియజేశారు. తమ ప్రభుత్వంవచ్చిన వెంటనే (రెండు నెలల్లో) చేర్యాల ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగూనంగా రెవిన్యూడివిజన్ ఎర్పాటుచేస్తామని హామి ఇచ్చారు. కాని ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు దాటినా, డివిజన ఏర్పాటుపై ప్రకటన చేయకుండా మౌనం వహిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగా ఉన్న చేర్యాలను, తెలంగాణ రాష్ట్రం ఎర్పాటు తరువాత సిద్దిపేటతో పోటీలో అభివృద్ది చెందుతుందని భావించిన ఇక్కడి ప్రజలకు అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. రెండోవసారి ఈ ప్రాంతం నుండి టీఆర్ఎస్ ఎంఎల్ఏ గా పోటీ చేసిన ముత్తిరెడ్డి కూడ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానన్న నినాదంతోనే గెలిచారు. తెలంగాణ ఏర్పాటు తరువాత, 11 అక్టోబర్ 2016లో తెలంగాణ జిల్లాల ఏర్పాటు సవరణ చట్టంతో రాష్ట్రంలో 21 కొత్తవి మరియు 10 పాత జిల్లాలతో కలిపి 33 జిల్లాలుగా ఏర్పడ్డాయి. వాటిలో పలు జిల్లాలలో మరిన్ని కొత్త రెవిన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేశారు. అదే సందర్భంలో మళ్లి తెరపైకి వచ్చిన చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటు పోరాటం నేటి వరకు కొనసాగుతూనే ఉంది. తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేటతో పాటుగా కీలకంగా వ్యవహరించిన ప్రాంతంగా చేర్యాలకు గుర్తింపు ఉంది. ఇక్కడి ప్రజలు, ప్రజా నాయకులు, మేదావులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు సైతం ఈ పోరాటంలో ఒక్కతాటిపై వచ్చారు. అయినా కూడ అధికారంలోని ప్రభుత్వం మాత్రం డివిజన్ ఎర్పాటుపై మౌనం వీడడంలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత చేర్యాల ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాలు జనగామ నియోజకవర్గం, హూస్నాబాద్ డివిజన్, సిద్దిపేట జిల్లా, యాదాద్రి భువనగిరి పార్లమెంట్ స్థానాలుగా ఇలా ముక్కలుగా విభజించి విసిరివేసినట్లుగా నాలుగు మండలాలు అభివృద్దిలో, మనుగడలో ఈ ప్రాంతం ప్రశ్నార్థకంగా మారింది అని, వెనుకబాటు తనానికి గురౌతోంది అని జెఏసి నాయకులు అంటున్నారు.

**రెవిన్యూ డివిజన్ కల నెరవేరుస్తాం అన్నమాట నేడు మౌనం ఎందుకు..**

శాసనసభ ఎన్నికల తరువాత తెలంగాణలో జరిగిన 2024 భారత సార్వత్రిక ఎన్నికలు (పార్లమెంట్ ఎన్నికల్లో) ఇక్కడి ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి, చేర్యాల మండలాలను కలుపుకుని ఇక్కడి ప్రజల చీరకాల కల చేర్యాలను రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని, అలాగే 2026 డిలిమిటేషన్‌లో చేర్యాలను నియోజకవర్గంగా పునరుద్దరిస్తామని అప్పటి భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, ప్రస్థుత మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్యలు హామిని ఇచ్చారు. పార్లమేంట్ ఎన్నికల్లో భవనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని వారు జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆద్వర్యంలో మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల కార్నర్ మీటింగ్‌లో పిలుపునిచ్చారు. అలాగే ఇక్కడి ప్రజలు చామలను గెలిపించారు. అయినా నేడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మౌనం ఎందకు పాటిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవిన్యూ డివిజన్ కల నెరవేరుస్తాం అన్నమాట నేడు నిలపెట్టుకోవాలని కోరుతున్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్యతో పాటుగా మాజీ ఎంఎల్‌సి నాగపురి రాజలింగం, ఉమ్మడ్డి మద్దూరు మండల జడ్పిటీసీ గిరి కొండల్ రెడ్డిలు స్థానిక ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా ఉధ్యమానికి ఊపిరి పోద్దాం

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా ఉధ్యమానికి ఊపిరిపోద్దాం అని ఉమ్మడి చేర్యాల, కొమురవెల్లి, ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టు నాయకులు చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మొదటి నుండి సంఘీభావం తెలిపారు. గతంలో చేర్యాల మండల కేంద్రంలో జెఎసి ఆద్వర్యంలో నిర్వహించిన డివిజన్ ఎర్పాటు కార్యక్రమంలో చేర్యాల, ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలా వర్కింగ్ జర్నలిస్టులు మద్దతు తెలుపుతూ, ఒక్కరోజు రిలే నిరహార దిక్షలో పాల్గొన్నారు. దీనికి సంఘీభావంగా ప్రస్థుత కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా డిసిసి ప్రెసిడెంట్, మాజీ శాసనసభ సభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, సిపిఐ, సిపిఎం నాయకులు అందె అశోక్, వెంకట్ మావో, ఆలేటి యాదగిరిలు, వివిధ కుల యువజన సంఘాల నాయకులు పాల్గోని రెవిన్యూ డివిజన్ జెఎసికి మద్దతు తెలిపారు.

**చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమిస్తాం**

ధూల్మిట్ట, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి మండలాలను కలుపుకుని చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంతవరకు జెఎసి పోరాడుతుందని, అలాగే ప్రజా సమస్యలపై స్పందిస్తూ భవిషత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా సాగిస్తామని చేర్యాల రెవెన్యూ డివిజన్ జెఎసి నాయకులు తెలిపారు. బైరాన్‌పల్లి అమరవీరుల సాక్షిగా వారి పోరాట స్పూర్తితో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జనగామ నియోజకవర్గంలోని ఈ నాలుగు మండలాల అభివృద్ది నాలుగు జిల్లాల పరిధిలో ఉన్నాయని అభివృద్దిలో వెనకబాటుకు గురౌతున్నాయని అన్నారు. ఈ నాలుగు మండలాలను కలుపుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, ఇక్కడి ప్రజల చీరకాల కోరికను పరిగనంలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ రెవెన్యూ డివిజన్ సాధనలో పార్టాలకు అతీతంగా కలసి రావాలని విజ్ఞప్తి చెశారు. ఏది ఏమైనా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న ఇక్కడి ప్రజల డిమాండ్ మరింత బలపడుతోంది. ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, యువత, కలసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. పరిపాలన సౌలభ్యం, అభివృద్ధి వేగవంతం, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత త్వరగా అందాలన్న లక్ష్యంతో ఈ పోరాటం ముందుకు సాగుతోంది.

**చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని**

అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లేఖ వ్రాసి స్వయంగా అందించారు. లేఖలో కూనంనేని ఈ ప్రాంత సమస్యలను ప్రస్తావిస్తూ... జనగామ నియోజకవర్గంలోని చేర్యాల ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి నాలుగు మండలాల అభివృద్ధి... నాలుగు జిల్లాల పరిధిలో ఉన్నాయని, అభివృద్ధిలో వెనకబాటుకు గురౌతున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. చేర్యాల ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి నాలుగు మండలాలు జనగామ నియోజకవర్గం, హూస్నాబాద్ డివిజన్, సిద్దిపేట జిల్లా, యాదాద్రి భువనగిరి పార్లమెంట్ స్థానాలుగా ఇలా ముక్కలుగా విభజించి విసిరివేసినట్లుగా అభివృద్దిలో, మనుగడలో ఈ ప్రాంతం ప్రశ్నార్థకంగా మారిందని, వెనుకబాటు తనానికి గురౌతోందని అన్నారు. ఈ నాలుగు మండలాలను కలుపుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, ఇక్కడి ప్రజల చీరకాల కోరికను పరిగనంలోకి తీసుకోవాలని వారు ప్రభుత్వం దృషికి తీకుకవెళ్లారు.

# అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

50 శాతం, ఎడిజి స్థాయిలో 67 శాతం పోస్టులను డిప్యుటేషన్ కేటాయించడం అన్యాయమన్నారు. స్పెషల్ డిజి, డిజి పోస్టులను పూర్తిగా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయడం వల్ల 13,000 మంది అధికారుల భవిష్యత్తు అంధకారంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదాస్పద క్యాప్స్ బిల్లు 2026ను ఉపసంహరించుకోవాలన్నారు.

**తీవ్ర ఒత్తిడిలో బలగాలు..**

దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న బలగాల సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కఠినమైన సేవా పరిస్థితులు, పదోన్నతులు లేకపోవడంతో ఇప్పటివరకు 50,000 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారని తెలిపారు. పని ఒత్తిడి కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 150 మంది సిబ్బంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు సేవ చేసినా కనీస పదోన్నతులు లభించని దుస్థితి నెలకొందన్నారు. పదోన్నతుల్లో ఉన్న అడ్డంకులను తొలగించి, ఇతర గ్రూప్ఎ సేవలతో సమానంగా వేతన, సేవా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రస్తుత, మాజీ సిబ్బందితో చర్చలు జరిపి సంస్కరణలు చేపట్టాలన్నారు. ఈ సమస్యలను పట్టించుకోకపోతే సిబ్బంది మనోస్థైర్యం దెబ్బతిని, దేశ భద్రతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎక్స్ సిఏపిఎఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యామ్ సుందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, సలహాదారులు ఎస్.వి.రెడ్డి, రిటైర్డ్ కమాండెంట్ ఎఫ్.జె.బాబా, వి.యాదయ్య, బి.వి.రెడ్డి పాల్గొన్నారు.

# బెట్టింగ్ మాయలో యువత!

(మొదటి పేజీ తరువాయి)

మార్చుకున్నారు. యువతతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు బెట్టింగులకు ఆకర్షితులవుతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో బెట్టింగ్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టాలను చవిడా స్తున్నారు. కూలీ నాలి చేసుకునే వారు, ప్రైవేట్ ఉద్యోగులు సైతం బాధితులుగామారుతుండడం గమనార్హం.

**లొకేషన్లు మారుస్తూ..!**

ఆన్ లైన్ బెట్టింగ్ నిషేధం ఉన్నప్పటికీ యాప్ల ద్వారా లోకేషన్ చేంజ్ చేస్తూ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు నిరుద్యోగ యువత యాప్ ద్వారా ఆన్లైన్ బెట్టింగ్స్ కొనసాగిస్తున్నారు. పదుల సంఖ్యల్లో వెబ్సైట్లు, యాప్‌లలో ఇది నడుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఐపీఎల్ సందర్భంగా జోరుగా బెట్టింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. జట్టులో ఆటగాళ్ల తీరు, మ్యాచ్ గెలిచేదెవరు, ఫోర్, సిక్స్ ఇలా అన్నింటికి వేల రూపాయల్లో బెట్టింగ్ పెడుతున్నారు. యువకులతో పాటు పలు వ్యాపారులు సైతం ఈ మోజులో పడి అప్పుల పాలవుతున్నారు. ఈ క్రేజ్‌ను దందాగా మలుచుకొని కొంత మంది బెట్టింగ్ యాప్ ద్వారా తమ జేబులు నింపుకుంటున్నారు.

**బెట్టింగులపై పోలీసుల ఫోకస్..!**

ఆన్లైన్ బెట్టింగ్లపై పోలీసులు ఫోకస్. ఇంటిలిజెన్స్ నిగా పెట్టారు. సీసీఎస్ సిబ్బంది కన్నేసి ఉంచారు. ఎక్కడైనా ఆన్లైన్ బెట్టింగ్ సాగుతున్నట్లు స మాచారం అందిస్తే వెంటనే అప్రమత్తమ వు తున్నారు. వారిపై కేసులు పెడుతున్నారు. రాష్ట్రం లో ఆన్లైన్ బెట్టింగ్ నిషేధం ఉంది. ఇటీ వల ప్రభు త్వం అలాంటి వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని పోలీసులకు అదేశాలు జారీ చేసింది. దీంతో వారు అవగాహన కార్యక్రమాలతో పాటు బెట్టింగ్‌లు అరి కట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఎక్కుడైనా బెట్టింగ్ జరిగితే పోలీసులకుసమాచారం అందించాలని చెబుతున్నారు.

# భారత్ వాటా 25 శాతం

(మొదటి పేజీ తరువాయి)

పలు ప్రాంతాల్లో నీటి వనరులు క్షీణిస్తున్నాయని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు రాష్ట్రాల్లో భూగర్భ జల వినియోగం 100 శాతం కంటే ఎక్కువగా ఉండగా, 24 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 267 జిల్లాల్లో వినియోగ స్థాయి 64 శాతం నుంచి 385 శాతం వరకు నమోదైంది. 2004 నుంచి 2017 వరకు దేశవ్యాప్తంగా ఈ వినియోగ స్థాయి 58 శాతం నుంచి 63 శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భూగర్భ జల వినియోగం 100 శాతం దాటింది. అంటే అక్కడ భూగర్భ జలాలను, నీటి ఉత్పత్తి కంటే అధికంగా వినియోగిస్తున్నారు. ఇది భవిష్యత్తులో తీవ్రమైన నీటి సంక్షోభానికి దారితీసే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. ఇదిలా ఉండగా, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తమ చర్యలను వివరించింది. జల్‌శక్తి అభియాన్, అటల్ భూజల్ యోజన, నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ వంటి పథకాల ద్వారా భూగర్భ జలాలను స్థిరంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. 2023లో జరిగిన తాజా అంచనా ప్రకారం, భూగర్భ జల వినియోగం 2017లో 63.33 శాతం నుంచి 59.26 శాతానికి తగ్గింది. అలాగే సేఫ్ స్థాయిలో ఉన్న ప్రాంతాల శాతం 62.6 నుంచి 73.1కు పెరిగింది. అతిగా వినియోగం జరుగుతున్న ప్రాంతాలు 17 శాతం నుంచి 11 శాతానికి తగ్గాయి. 2022 వర్షాకాలం తర్వాత 61 శాతం బావుల్లో నీటి మట్టం పెరగడం కూడా కొంత మెరుగుదల సంకేతంగా పేర్కొన్నారు. అయితే ఈ పురోగతిని కొనసాగించాల్సిన అవసరం ఉందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భవిష్యత్తులో వర్షపు నీటి నిల్వ, కృత్రిమ రీచార్జ్ నిర్మాణాలు, అక్విఫర్ మ్యాపింగ్ వంటి చర్యల ద్వారా భూగర్భ జలాల శాస్త్రీయ నిర్వహణను బలోపేతం చేయాలని సూచించింది. మొత్తం మీద, భారత్‌లో భూగర్భ జల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, స్థిరమైన నీటి నిర్వహణ అత్యవసరమని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com